ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ fb.com/vaartha
PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
26-9-2023 మంగళవారం సంపుటి : 29 సంచిక : 237 పేజీలు : 10+4 వెల : 6.50

'కృషి' బ్యాంక్ డెరెక్టర్ శ్రీధర్ అరెస్టు 2లో

బిలాస్‌పూర్ రైలులో ప్రయాణించిన రాహుల్ 5లో



## 'సాగర్'లో పిఒపి విగ్రహాల నిమజ్జనానికి నో

### హైకోర్టు ఆదేశం.. కృత్రిమ కొలనుల్లో చేయాలని సూచన

**హైదరాబాద్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** హుస్సేన్‌సాగర్‌లో గణేష్ విగ్రహాల నిమజ్జనం విషయంలో హైకోర్టు సోమవారం నాడు కీలక ఆదేశాలు జారీ చేసింది. హుస్సేన్‌సాగర్‌లో ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పిఒపి) విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. దీనికి బదులు బల్దియా ఆయా ప్రాంతా లలో కృత్రిమంగా ఏర్పాటు చేసిన నీటి కొలనుల్లో పిఒపి విగ్రహాలను నిమజ్జనం చేయాలని ఆదేశించింది. తమ ఉత్తర్వులను యధాతథంగా అమలు చేయాలని బల్దియా, పోలీసు కమిషనర్లను హైకోర్టు ఆదేశించింది. హుస్సేన్‌సాగర్‌లో పిఒపి విగ్రహాల నిమజ్జనం విషయంలో కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఈ విషయమై రెండు వారాలుగా సాగుతున్న విచారణకు హైకోర్టు సోమవారం నాడు ముగింపు పలుకుతూ హుస్సేన్‌సాగర్‌లో పిఒపి విగ్రహాలను ఎట్టిపరిస్థితుల్లోనూ నిమజ్జనం చేసేందుకు వీల్లేదని, ఇందులో ఎలాంటి వివాదాల కు తావులేదని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ నెల ఎనిమిదవ తేదీన హుస్సేన్‌సాగర్‌లో పిఒపి విగ్రహాల నిమజ్జ నం విషయమై దాఖలైన పిటిషన్‌పై మొదలైన విచారణ ఇప్పటి వరకు పలుమార్లు కొనసాగగా సోమవారం నాడు ముగిసింది. ఈ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం హుస్సేన్‌సాగర్‌లో పిఒపి విగ్రహాల నిమజ్జనం విషయమై ఘాటుగా వ్యాఖ్యలు చేసింది. ఈ విషయమై గత ఏడాదే తాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, మరోసారి దీనిపై వి చారణ చేయడం సరైంది కాదని వెల్లడించింది. ≫2

## టాంకుబండ్‌పై ఆందోళనలు..

పోలీసులు అడ్డుకొనడంపై నిరసనలు 7లో

## ఆ 'ఇద్దరికి' గవర్నర్ రెడ్‌సిగ్నల్



నామినేటెడ్ కోటా కింద దాసోజు శ్రవణ్, సత్యనారాయణ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను తిరస్కరించిన తమిళిసై

కళలు, సాంకేతిక రంగాలలో వారికి ఎలాంటి అర్హతలు లేవని అభిప్రాయం

రాజకీయాలతో సంబంధంలేని వారినే సిఫారసు చేయాలని హితవు

సర్కార్‌కు మళ్లీ షాకిచ్చిన గవర్నర్.. సిఎస్ శాంతికుమారికి లేఖ

అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబర్25:** తెలంగాణలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కెసిఆర్ ప్రభుత్వం మధ్య వ్యవహారం నువ్వానేనా అన్నట్లు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారంనాడు గవర్నర్ తమిళిసై సౌందరాజన్... బిఆర్ఎస్ ప్రభుత్వానికి మరో షాక్ ఇచ్చారు. మంత్రి మండలి సిఫార్సు చేసిన నామినేటెడ్ ఎమ్మెల్సీల పేర్లను తిరస్కరించారు. దీంతో తెలంగాణలో రాజకీయం మరోసారి ఆసక్తిగా మారింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ కింద దాసోజు శ్రవణ్,కుర్రా సత్యనారాయణల అభ్యర్థిత్వాలను తమిళిసై తిరస్కరించారు. సర్వీస్ సెక్టార్‌లో వీరు ఎలాంటి సేవలు చేయలేదని.... ఈ కోటా కింద వీరిని నామినేట్ చేయడం కుదరదని స్పష్టం చేశారు. సాహిత్యం, శాస్త్ర సాంకేతి రంగం, కళలు,సహకార ఉద్యమం,సామాజిక సేవలో ఈ ఇద్దరికి ఎలాంటి ప్రత్యేకతలు లేవని... ఆర్టికల్ 171(5) ప్రకారం అర్హతలుసరిపోవని తమిళిసై పేర్కొన్నారు.ఈమేరకు తననిర్ణయాన్ని ముఖ్యమంత్రి ≫2

## తెలంగాణ 'ఆరోగ్యం' బెస్ట్

### దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచాం

నీతి ఆయోగ్ ఆరోగ్యసూచిలో 3వ ర్యాంకులో రాష్ట్రం

బడ్జెట్‌లో రూ. 12,364 కోట్లు కేటాయింపు

వైద్యఆరోగ్య శాఖ పదేళ్ల ప్రగతి నివేదిక విడుదల చేసిన మంత్రి హరీష్



సోమవారం హైదరాబాద్‌లో వైద్యఆరోగ్య శాఖ పదేళ్ల ప్రగతి నివేదిక విడుదల చేసిన మంత్రి హరీష్

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 60ఏళ్లలో సాధించలేనిదాన్ని తెలంగాణ రాష్ట్రమేర్పడిన తర్వాతి దశాబ్ద కాలంలో అద్భుతాలను దశాబ్దకాలంలోనే ఆవిష్కరించి ఆరోగ్యరంగంలో తెలంగాణ దేశానికి రోల్‌మోడల్ అయ్యిందని తెలంగాణవైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తెలంగాణ వైద్యఆరోగ్య ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖల డైరెక్టర్ డా. జి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థికశాఖల మంత్రి తన్నీరు హరీష్‌రావు వైద్య ఆరోగ్యరంగంలో గత 10ఏళ్లలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని సూచించే ఆరోగ్య తెలంగాణ పదేళ్ళ ప్రగతి నివేదికను ఆవిష్కరించి ప్రసంగిస్తూ అన్నారు. 2014లో నీతిఆయోగ్ ఆరోగ్యసూచిలో 11వ స్థానం నుండి 2023నాటికి 3వ ర్యాంకుకు చేరుకోవడం, ఒకప్పుడు నేనురాను బిడ్డో నుండి నేడు పోదాంపదా బిడ్డో సర్కారు దవాఖానాకి అనేలా మార్పే నిదర్శనమని, మొదటిస్థానానికి అడుగులు వేస్తున్నామని అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర బడ్జెట్‌లో 12,364 కోట్లు కేటాయించి ఒక్కొక్కరికి వైద్యంపట్ల 3532 రూపాయలు తలసరి ఖర్చు చేస్తూ దేశంలో 3వస్థానంలో ఉన్నామన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో పడకలు 17నుండి 34వేలకు; ఆక్సిజెన్ పడకలు 14వందల నుండి 34వేలకు; ప్రభుత్వ వైద్యకళాశాలలు 5 నుండి 26కు; ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు 5 నుండి 23కు, ప్రభుత్వ ఎంబిబిఎస్ సీట్లు 850 నుండి 3690కు; ప్రభుత్వ పోస్టుగ్రాడ్యుయేట్ సీట్లు 515 నుండి 1320కు; ప్రభుత్వ సూపర్ స్పెషాల్టీ సీట్లు 72 నుండి 179కు; దయాలసిస్ కేంద్రాలు 3 నుండి 82కు; ఐసియులు 5 నుండి 80కి; డిపిసియులు 2 నుండి 35కు; ఎస్ఎన్‌సియులు 15 నుండి 55కు; బ్లడ్‌బ్యాంకులు 28 నుండి 56కు; 108 అంబులెన్స్‌లు 316 నుండి 455కు; నియోనాటల్ అంబులెన్స్‌లు 33, అమ్మఒడి వాహనాలు 300; పరమపద వాహనాలు 50కు పెంచామని, ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు 30 నుండి 76.8శాతానికి పెరిగాయని, మాతృ, శిశు మరణాల రేటు 50శాతం తగ్గాయని మంత్రి హరీష్‌రావు వివరించారు. అవయవ మార్పిడి శస్త్రచికిత్సల్లో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఉందని, నిమ్స్ ఆస్పత్రిలో 6నెలల్లో 100 కిడ్నీమార్పిడి ఆపరేషన్లు, ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆస్పత్రిలో ప్రతీనెల ≫2



## చంద్రబాబు పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా

### కస్టడీ విచారణ నివేదిక జడ్జికి అందజేత

**విజయవాడ,సెప్టెంబరు25,ప్రభాతవార్తప్రతినిధి:** స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు బెయిల్ పిటిషన్.సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్లపై విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణ సోమవారం జరిగింది.సీఐడీ, చంద్రబాబు న్యాయవాదుల వాద, ప్రతివాదనల తరువాత విచారణ మంగళవారానికి వాయిదా పడింది.సీఐడీ కస్టడీ పిటిషన్‌పై కౌంటరు దాఖలు చేయాలని చంద్రబాబు తరపు న్యాయవాదులను ఏసీబీ న్యాయస్థానం ఆదేశించింది.ఈ రెండు పిటిషన్లపై మంగళవారం విచారణ జరిపి ఉత్తర్వులు ఇస్తామని ఏసీబీ న్యాయస్థానం ఆదేశించింది.అంతకు ముందుకు రెండు రోజుల కస్టడీ ≫7

## ఎన్డీఏకు అన్నాడిఎంకె గుడ్‌బై

### ఒంటరి పోటీకి నిర్ణయం

**చెన్నై, సెప్టెంబరు 25:** కేంద్రంలో అధికారంలో ఉన్న నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ ఎన్డీఏకు గుడ్‌బై చెప్తున్నట్లు ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్రకజగం అన్నాడిఎంకె వెల్లడించింది. ఈ మేరకు పార్టీ మీటింగ్‌లో అన్నా డిఎంకె ఎంపిలు, ఎమ్మెల్యేలు, మిగిలిన నేతలంతా ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. ఈ మేరకు ఆ పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ, తమిళనాడు మాజీ మంత్రి కెపి మునుస్వామి ప్రకటించారు. తమిళనాడు లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశం తర్వా త అన్నాడిఎంకె బిజెపితో పొత్తును తెంచుకున్నట్లు వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి లేకుండానే ఒం టరిగా బరిలోకి దిగనున్నట్లు అన్నాడిఎంకె స్పష్టం చేసింది. గత కొన్ని రోజుల నుంచి అన్నాడిఎంకె, బిజెపి నేతలు బహిరంగంగానే ఒకరిపై మరొకరు తీవ్ర విమర్శలు గుప్పించుకుంటున్నారు. దీంతో ఎన్డీఏ నుంచి అన్నాడిఎంకె బయటికి వస్తుందని రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చ జరిగింది. తమ పార్టీని, పార్టీ నాయకులను నిరంతరం అవమానిస్తున్న బిజెపితో పొత్తు ఉండబోదని ఇప్పటికే చాలా మంది అన్నాడిఎంకె నేతలు బహిరంగంగానే ప్రకటించగా అధికారికంగా మాత్రం సోమవారం ప్రకటించారు. ఈ ≫2



## మైనంపల్లి రేపు కాంగ్రెస్‌లోకి

### ఆయన నివాసానికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన భట్టి, దామోదర, మధుయాష్కి

**హైదరాబాద్ (కొంపల్లి), సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** ప్రజాసంక్షేమం కోరుకునే వారు కాంగ్రెస్ పార్టీలో ఉంటారని సిఎల్పి నేత భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సోమవారం మాజీ డిప్యూటీ సిఎం దామోదర రాజనర్సింహా, మాజీ ఎంపిలు అంజన్‌కుమార్‌యాదవ్, మధుయాష్కిలతో కలిసి ఆయన మైనంపల్లి నివాసానికి చేరుకున్నారు.

ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరాలని కోరుతూ మైనంపల్లిని ఆహ్వానించారు. మైనంపల్లి మాట్లాడుతూ ఈనెల 27న మంచి ముహూర్తం ఉన్నందున అదే రోజు ఢిల్లీలో రేవంత్‌రెడ్డి సమక్షంలో అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు పేర్కొన్నారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధిని ఆకాంక్షించేవారు కాంగ్రెస్ పార్టీలో ఉంటారని, సొంత లాభం, అక్రమాలు చేసేవారు బిఆర్ఎస్‌లో ఉంటారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సీనియర్ నాయకులు నర్సా రెడ్డి భూపతిరెడ్డి, సొంటిరెడ్డి పున్నారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్‌లో అత్యాధునిక టెక్నాలజీ

### ఫ్యూజన్ సెంటర్‌ను ప్రారంభించిన హోం మంత్రి మహమూద్ అలీ





కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫ్యూజన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి మహమూద్ అలీ. చిత్రంలో డిజిపి అంజనీ కుమార్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** తెలంగాణ సర్కారు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బంజారాహిల్స్‌లోని సమీకృత కమాండ్ కంట్రోల్ సెంటర్ (టిఎస్ పిఐసిసిసి) లో కొత్తగా అందుబాటులోకి తెచ్చిన టెక్నాలజి ఫ్యూజన్ సెంటర్‌ను హోం మంత్రి మహమూద్ అలీ సోమవారం నాడు ప్రారంభించారు. ఇదే సమయంలో టిఎస్‌పిఐసి సిసిలో తొలిసారిగా పోలీసేతర విభాగాల కార్యకలాపాలు కూడా మొదలయ్యాయి. ఈ సందర్భంగా హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ తెలంగాణ పోలీసు విభాగం దేశానికే రోల్‌మాడల్‌గా నిలిచిందని అన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరాల నివారణ, టెక్నాలజిని వాడడం మొదలుకుని ఇతర అన్ని అంశాలలో రాష్ట్ర పోలీసు విభాగం అగ్రగామిగా వుందని ఆయన కొనియాడారు. ముఖ్యంగా అధునాతన టెక్నాలజిని వాడడంలో రాష్ట్ర పోలీసులు ముందంజలో వుండడంతో పాటు దీని ద్వారా నేరాలను నివారించడంలో మరింత ముందడుగు వేస్తుండడం శుభపరిణామమని ఆయన తెలిపారు. కమాండ్ కంట్రోల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన టెక్నాలజి ఫ్యూజన్ సెంటర్ వల్ల అనేక ప్రాంతాలలో గల వేల సంఖ్యలో వున్న సిసి కెమెరాలను ఇక్కడి నుంచి వీక్షించవచ్చని, దీనివల్ల ఎన్నోరకాల ప్రయోజనాలు వున్నాయని ఆ యన తెలిపారు. ఇదే సమయంలో ఇప్పటి వరకు పోలీసు శాఖ కార్యకలాపాలకే పరిమితమైన కమాండ్ కంట్రోల్‌లో ఇకనుంచి పోలీసేతర సర్కారీ విభాగాలు సైతం ప నులు చేయడం మొదలు పెట్టాయని హోం మంత్రి తెలిపారు. ముఖ్యమైన ఘటనల్లో అన్ని సర్కారీ విభాగాలు సమన్వయంగా పనిచేయడం దీనివల్ల సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా ఆయా నగరాలలో వున్న మొత్తం సిసి కెమెరాలలో 64 శాతం తెలంగాణలోనే వున్నాయని ఆయన వెల్లడించారు. డిజిపి అంజనీకుమార్ మాట్లాడుతూ తెలంగాణ పోలీసు శాఖ సక్సెస్‌కు మారుపేరుగా వుందని అన్నారు. రాష్ట్రంలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చూడడంలో ≫2



సోమవారం హైదరాబాద్‌లో మూసీనదిపై బ్రిడ్జిపనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కెటిఆర్

## మూసీ, ఈసా నదులపై 5 కొత్త వంతెనలు

### భూమి పూజ చేసిన మంత్రి కెటిఆర్

రూ.168 కోట్లతో నిర్మాణం

**ఉప్పల్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం మూసీ నదిపై నార్సింగి నుంచి గౌరెల్లి వరకు కొత్తగా వంతెనల నిర్మాణ పనులు చేపడుతున్నారు. పతుల్లాగూడ, ఉప్పల్, ప్రతాప్‌సింగారం, బాగ్‌అంబర్‌పేట, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో ఈ మేరకు సోమవారం మూసీ, ఈసా నదులపై నిర్మించతలపెట్టిన ఐదు కొత్త వంతెన నిర్మాణ పనులను రాష్ట్ర మున్సిపల్, ఐటి శాఖ మంత్రి కె.తారాకరామారావు, మేయర్ విజయలక్ష్మి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి,గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్‌రాస్ చేతులగా ప్రారంభించారు. హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో చేపడుతున్న మూసీ నదిపై ఒక్కొక్కటి నాలుగు లైన్లు ఉండే విధంగా ఐదు వంతెనలను నిర్మిస్తున్నట్లు మంత్రి కేటిఆర్ పేర్కొన్నారు. ఉప్పల్ భగాయత్ నుంచి మూసీ నదిపై కొత్తగా నిర్మిస్తున్న వంతెనలతో ట్రాఫిక్ సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్నారు. ఓఆర్ఆర్ లోపల పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా మెరుగుపర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం మూసీ, ఈసా నదులపై వంతెనలను ప్రతిపాధించింది. మూసీ, ఈసా నదులపై నిర్మించనున్న 14 బ్రిడ్జిలను నిర్మిస్తుందని, అందులో హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో మూసీ నదిపై మూడు చోట్ల ఈసా నదిపై రెండు చోట్ల వంతెనలు నిర్మాణ పనులు చేపడుతుందని తెలిపారు. సుమారు రూ.168 కోట్ల వ్యయంతో హెచ్ఎండిఏ నిర్మించే ఐదు వంతెనల నిర్మాణాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ≫2

## కళలకు కాణాచి పెంబర్తి, చంద్లాపూర్



### ఉత్తమ పర్యాటక గ్రామాలుగా ఎంపిక

రేపు అవార్డులు స్వీకారం

**హైదరాబాద్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** ప్రాకృతిక సౌందర్యం, సంస్కృతి, కళలకు పెట్టింది పేరైనా తెలంగాణ గ్రామాలు, కళలకు కేంద్ర ప్రభుత్వం సరైన గౌరవాన్ని కల్పిస్తోంది. ఇప్పటికే తెలంగాణ కళలకు, సాంస్కృతిక, పర్యాటక కేంద్రాలకు అంతర్జాతీయ గుర్తింపు రావడంలో చొరవ తీసుకున్న కేంద్ర ప్రభుత్వ, తాజాగా మరో రెండు తెలంగాణ గ్రామాలకు ఈ సంవత్సరానికి ఉత్తమ పర్యాటక గ్రామాలుగా ఎంపిక చేసింది. ఈ అవార్డులకు ఎంపికైన మొదటి గ్రామం జనగామ జిల్లా పెంబర్తి, కాకతీయుల కాలం నుంచి ఈ గ్రామం హస్తకళలకు ప్రసిద్ధిచెందిన సంగతి తెలిసిందే. ఇత్తడి, కంచు లోహాలతో ఈ గ్రామంలో చేసే కళాకృతులకు ఉన్న డిమాండ్ దృష్ట్యా వీటిని పెద్ద మొత్తంలో అమెరికా, జర్మనీ, బెల్జియం, జపాన్ తదితర దేశాలు దిగుమతి చేసుకుంటున్నాయి. సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే కళాకృతులు, దేవతల విగ్రహాలు, కళాఖండాలు, గృహ అలంకరణ వస్తువులెన్నో ఇక్కడి కళాకారులు చేతివృత్తుల నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తాయి. దీనికి తోడు యేడా 25వేల మంది పర్యాటకులు ఈ గ్రామాన్ని సందర్శించినట్లు కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణ సంస్కృతిని ప్రోత్సాహించే విషయంలో ఇక్కడి కార్మికులు చేస్తున్న కృషి తద్వారా జరుగుతున్న ఆర్థిక కార్యకలపాలు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని పెంబర్తి ఉత్తమ పర్యాటక గ్రామంగా కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది. ≫2



పెంబర్తి కళాఖండాలు



సోమవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకొన్న 2021 బ్యాచ్ ఐఎఎస్ అధికారుల బృందం

# తెలంగాణ 'ఆరోగ్యం' బెస్ట్

>> సగటున 8మందికి బోన్‌మారో మార్పిడి ఉచితంగా చేస్తున్నామని, త్వరలో గాంధీ ఆస్పత్రి 8వ అంతస్తులో అన్నిహంగులతో అవయవమార్పిడి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, రాబోయే రోజుల్లో దేశ విదేశాల నుండి వచ్చి ప్రభుత్వ ఆస్పత్రులు అవయవమార్పిడులు చేసుకునేలా మారబోతున్నాయని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశీస్సులతో రాష్ట్రంలో ఎయిర్ అంబులెన్స్‌లు ప్రవేశపెట్టబోతున్నామని, రాష్ట్రంలోని మారుమూల ప్రదేశాల నుండి అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్య నిరుపేదలను హుటాహుటిన హైదరాబాద్‌కు తీసుకొచ్చి వైద్యసేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎటువంటి హెల్త్ ఎమర్జెన్సీనైనా తట్టుకోవడానికి తెలంగాణ సర్వసన్నద్ధంగా ఉందని, గ్రామస్థాయిలో పల్లె దవాఖానాలు; పట్టణస్థాయిలో బస్తీ దవాఖానాలు; మండలస్థాయిలో పిహెచ్‌సిలు; నియోజకవర్గస్థాయిలో వందపడకలు; జిల్లాలో మెడికల్, నర్సింగ్, పారామెడికల్ కాలేజీలు; వరంగల్‌లో హెల్త్‌సిటీ నిర్మాణం, నగరం నలువైపులా కార్పొరేట్‌స్థాయి ఆస్పత్రులు, 4వేల పడకలతో నిమ్స్ ఆస్పత్రి విస్తరణ చేపట్టామని, ప్రజల శుభాశీస్సులు, దీవెనలతో ఆరోగ్యశాఖను మరింత ముందుకు తీసుకువెళ్తామని మంత్రి హరీష్‌రావు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఎంఎస్ఐడిసి ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ ఛైర్మన్ డా. సుధాకర్‌రావు, డిఎంఈ డా. కె.రమేష్‌రెడ్డి, నిమ్స్ డైరెక్టర్ డా. ఎన్.బీరప్ప, ఎంఎన్‌జె క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డా. జయలలిత తదితర వైద్యఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# 'కృషి' బ్యాంక్ డైరెక్టర్ శ్రీధర్ అరెస్టు

**రూ.36 కోట్ల కుంభకోణంలో 22 యేళ్లకు పట్టుబడిన నిందితుడు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** రెండువేల దశకంలో వెలుగుచూసిన కృషి బ్యాంక్ గోల్‌మాల్ గురించి అందరికి తెలిసిందే. హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటై 2001లో బిచాణా ఎత్తేసిన కృషి బ్యాంక్ గోల్‌మాల్ ఉదంతంలో 36.37 కోట్ల రూపాయలను బ్యాంకు ఛైర్మన్, ఎండీగా వున్న కొసరాజు వెంకటేశ్వరరావు సహా ఇతర డైరెక్టర్లు కొట్టేయడం విదితమే. అప్పటి ఘటనలో బ్యాంకు ఛైర్మన్, ఎండి అయిన కొసరాజు వెంకటేశ్వరరావు సహా మరికొందరిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఆ సమయంలో డైరెక్టర్‌గా వుండి, ఎ3 నిందితుడుగా వున్న కాగితాల శ్రీధర్ (అప్పుడు అతని వయస్సు 51 సంవత్సరాలు)ను 22 ఏళ్ల తరువాత సిఐడి అధికారులు తాజా గా అరెస్టు చేశారు. అప్పట్లో సికింద్రాబాద్‌లో వున్న శ్రీధర్ ఆ తరువాత పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు ఉడాయించి అక్కడే రహస్యంగా జీవించసాగాడు. కాగా శ్రీ ధర్ ఆచూకి గురించి సిఐడి వాకబు చేయగా అతని ఆచూకీ లభించింది. ఇదే సమయంలో అతనిపై వున్న నాన్ బెయిలబుల్ వారంట్‌ను అమలు చేసి అరెస్టు చేసి హైద రాబాద్‌కు తీసుకువచ్చి ఇక్కడి కోర్టులో హాజరుపరిచి చంచల్‌గూడ జైలుకు రిమాండుకు తరలించారు. సిఐడి ఎస్‌పి రాంరెడ్డి నేతృత్వంలోని పోలీసు బృందం ఈ నేరగాడి ని అరెస్టు చేసింది. కాగా కృషీ బ్యాంకు గోల్‌మాల్ కేసులో 22 ఏళ్లుగా పరారీలో వున్న ఓ నేరగాడిని అరెస్టు చేసిన సిఐడి బృందాన్ని ఆ విభాగం అదనపు డిజిపి మహేష్ భగవత్ అభినందించారు.

# కమాండ్ కంట్రోల్‌లో అత్యాధునిక టెక్నాలజీ

>> పోలీసులు విజయవంతం అయ్యారని ఆయన తెలిపారు. నక్సలైట్ల సమస్యలని, రౌడీల బెడదలని లేకుండా పోయిందని, దీనికి సిఎం కెసిఆర్ శాఖకు ఇస్తున్న ప్రాధాన్యం ముఖ్య కారణమని ఆయన అన్నారు. తెలంగాణ పోలీసింగ్ న్యూయార్క్ పోలీసింగ్ తరహాలో వుందని ఆయన తెలిపారు. కమా ండ్ కంట్రోల్‌లో కొత్తగా అందుబాటు లోకి వచ్చిన టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్ వల్ల అనేక లాభాలు వున్నాయని ఆయన వెల్లడించారు. సిటీ కొత్వాల్ ఆనంద్ మాట్లాడుతూ సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కొత్తగా 2500 సిసి కెమెరాలను ప్రారంభించామని తెలిపారు. ఇతర సర్కారీ విభాగాల సహకారంతో అన్నిచోట్ల నిఘాను పెంచా మని ఆయన వెల్లడించారు. కమాండ్ కంట్రోల్‌లో ఏర్పాటైన టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్ వల్ల కమాండ్ కంట్రోల్ స్థాయి మరింత ఉన్నతస్థితికి చేరిందని ఆయన తెలిపారు. మూడు రకాల సిసి టివి ప్రాజెక్టు లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని, సిటీ సైల్ ప్రాజెక్టు కింద పది వేలు, కమ్యూనిటీ పోలీసింగ్ కింద మరో పది వేలు, సేఫ్ సిటీ కింద తాజాగా ఇంకో 2306 కెమెరాలు ఇందులో వున్నాయని ఆయన అన్నారు. ఎక్కడైనా నేరాలు జరిగినప్పుడు, శాంతి భద్రతలకు ఆవాంతరాలు ఏర్పడినప్పుడు ఇవి ఎంతగానో దోహదపడుతున్నాయని కమిషనర్ తెలిపారు. సిసి కెమెరాలు శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాల నివారణలో కీలకంగా వున్నాయని ఆయన తెలిపారు. కమాండ్ కంట్రోల్‌లో మల్టీ ఏజెన్సీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టంను కూడా ఏర్పాటు చేశామని, ఇది బహుళ ప్రయోజనకారిగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్ర తల అదనపు కమిషనర్ విక్రం సింగ్ మాన్, ట్రాఫిక్ చీఫ్ సుధీర్ బాబు, స్పెషల్ బ్రాంచి అదనపు సిపి కమిషనర్ విశ్వప్రసాద్, సిసిఎస్ జాయింట్ సిపి గజరావు భూపాల్, పరిపాలనా విభాగం జాయింట్ సిపి పరిమళ హన్మా నూతన్ తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో కమాండ్ కంట్రోల్‌లో కొత్తగా ఏర్పాటైన టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్ వల్ల ఆయా ప్రాంతాలలోని సిసి కెమెరాలతో నమోదవుతున్న ఫుటేజీలను పరిశీలించి, వీటి పనితీరు అద్భుతంగా వుందని హోం మంత్రి కొనియాడా రు. దీంతో పాటు అన్ని విభాగాల హెచ్‌ఓడిలు ఒకేచోట కూర్చుని కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు వీలుగా నిర్మించిన వార్ రూంను కూడా హోం మంత్రి ప్రారం భించారు.

# గవర్నర్ రెడ్‌సిగ్నల్

>> కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి రాసిన లేఖల్లో తెలియజేశారు. నామినేటెడ్ కోటా కింద ఎమ్మెల్సీకి తగిన అర్హతలు లేవని తెలిపారు. తగిన అర్హతలు లేకుండా నామినేట్ చేయడం తగదని గవర్నర్ పేర్కొన్నారు. అర్హతలు ఉన్న ఎంతో మంది ప్రముఖులు రాష్ట్రంలో ఉన్నారని, అర్హులను పరిగణలోకి తీసుకోకుండా రాజకీయాలతో సంబంధం ఉన్నవారి పేర్లు సిఫారసు చేయడం సరైనది కాదని హితవు పలికారు. ఇలా చేస్తే రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం,అనుభవం ఉన్న వారికి గుర్తింపు లభించబోదన్నారు. ఎమ్మెల్సీలుగా ఎవరిని నామినేట్ చేయకూడదో ప్రజాప్రతినిధ్య చట్టంలో స్పష్టంగా ఉందని గవర్నర్ పేర్కొన్నారు. ప్రస్తుతం సిఫారసు చేసిన దాసోజు శ్రవన్,కుర్రా సత్యనారాయణ అనర్హత కిందకు రారని చెప్పేలా... ఇంటెలిజెన్స్ సహా ఏ ఇతర సంస్థల నివేదికలు లేవని తెలిపారు. మంత్రివర్గ సిఫారసుతో పాటు అన్ని అంశాలను జత చేయలేదన్నారు.రాజకీయాలతో సంబంధం ఉన్న వారి పేర్లను తిరస్కరించాలని మంత్రి మండలి,ముఖ్యమంత్రి కెసిఆర్‌కు సూచించారు. ఈ మేరకు సిఎం కెసిఆర్, సిఎస్ శాంతికుమారికి రాసిన లేఖలో గవర్నర్ తమిళిసై వివరణ ఇచ్చారు. ఈ ఇద్దరి పేర్లను ఆమోదిస్తే ఆయా రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం,అనుభవం ఉన్న వారికి గుర్తింపు లభించబోదని ఆమె స్పష్టం చేశారు. సరైన వ్యక్తులకు అవకాశాలు నిరాకరించినట్లవుతుందని వ్యాఖ్యానించారు.

**పాడి కౌశిక్‌రెడ్డి విషయంలోనూ ఇలాగే...**

గతంలోనూ ప్రస్తుత ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి విషయంలో గవర్నర్ ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. శాసనమండలి గవర్నర్ కోటాలో హుజురాబాద్ నియోజకవర్గ బిఆర్‌ఎస్ నేత పాడి కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ స్థానానికి మంత్రి మండలి ఎంపిక చేసి.. ఆమోదం కోసం గవర్నర్‌కు సిఫారసు చేసింది. అయితే ఈ సిఫారసునూ తమిళిసై తిరస్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కోటా కింద కౌశిక్‌రెడ్డిని నామినేట్ చేయగా... ఆమోదం తెలిపారు. కరీంనగర్ జిల్లాకు చెందిన కౌశిక్‌రెడ్డి క్రికెట్ క్రీడాకారుడు. 2018లో కాంగ్రెస్‌లో చేరి,హుజురాబాద్ నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపాయారు. హుజురాబాద్ ఉప ఎన్నిక సమయంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి... బిఆర్‌ఎస్‌లో చేరారు. హుజురాబాద్ ఉప ఎన్నిక సమయంలో ఎమ్మెల్యే టికెట్‌ఆశించినప్పటికీ. ఆస్థానాన్ని బీసీకిఇవ్వాలని నిర్ణయించడంతో కౌశిక్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్,కుర్రా సత్యనారాయణ పేర్లను రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపి పంపితే వారికి రాజకీయ నేపథ్యం ఉందని గవర్నర్ రిజెక్ట్ చేయం అత్యంత దుర్మార్గమని బిఆర్‌ఎస్ మంత్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అత్యంత వెనుకబడిన కులాలకు(ఎంబీసీ) చెందిన సామాజిక కార్యకర్త దాసోజు శ్రవణ్, షెడ్యూల్ తెగకు (ఎస్టీ) చెందిన సామాజిక కార్యకర్త కుర్రా సత్యనారాయణలను రిజెక్ట్ చేయడం యావత్ తెలంగాణ సమాజాన్ని అగౌరపర్చినట్లేనని అసెంబ్లీ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ నాయకులైతే గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా పనికి రారా? అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. నామినేటెడ్ కోటా ఎమ్మెల్సీల పేరన్లను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.మ తమిళిసా బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలి నుంచి నేరుగా గవర్నర్ కాలేదా? సర్కారియా కమిషన్ సిఫార్సులు పాటించాలని గతంతో చెప్పిన ప్రధాని మోడీ... వాటిని తుంగలో తొక్కి మిమ్మల్ని గవర్నర్ చేయలేదా? మీకు నైతికత ఎక్కడిది? అలా అయితే మొదట మీరే రాజీనామా చేయాలి అని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్పందిస్తూ గవర్నర్ చర్య సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు లాంటిదని, ఆమె రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నారని, గతంలో ఏ గవర్నర్ ఇలా చేయలేదన్నారు. రాజకీయ కక్షసాధింలపులకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. కాగా గవర్నర్ తమిళిసై నిర్ణయంపై బిఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోషల్ వర్క్ రాజకీయాలు... విభిన్న పాత్రలు,ప్రయోజనాలు కలిగి ఉంటాయని, అవి పరస్పర విరుద్ధమైనవి కావని పేర్కొన్నారు. విధానపరమైన మార్పుల కోసం సామాజిక కార్యకర్తలు న్యాయవాద లాబీయింగ్ పాత్ర పోషిస్తారని చెప్పుకొచ్చారు.




సోమవారం ఛత్తీస్‌గఢ్‌లోని జైపూర్‌లో 'గ్రామీణ అవాస్ న్యాయ్ యోజన' మహిళలకు చెక్కును అందజేస్తున్న రాహుల్ గాంధీ. చిత్రంలో సిఎం భూపేష్ బఘేల్

# ఎన్డీఎకు అన్నా డిఎంకె గుడ్‌బై

>> సందర్భంగా పార్టీ ఆఫీస్ ముందు అన్నా డిఎంకె నేతలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. తమిళనాడు మాజీ సిఎంలు అన్నాదురై, జయలలితలపై తమిళనాడు బిజెపి చీఫ్ అన్నామలై ఇటీవల చేసిన వ్యాఖ్యలు బిజెపి, అన్నాడిఎంకె పార్టీల మధ్య వివాదానికి కారణమయ్యాయి. అప్పటి నుంచి ఇరు పార్టీలకు చెందిన నేతలు తీవ్ర విమర్శలు గుప్పించుకుంటూనే ఉన్నారు. మొదట తమిళ దిగ్గజం అన్నాదురైపై సంచలన వ్యాఖ్యలు చేసిన అన్నామలై ఆ తర్వాత జయలలితపైనా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 1956లో మధురైలో జరిగిన ఓ కార్యక్రమంలో హిందూ మతాన్ని అన్నాదురై అవమానించారని అన్నామలై ఆరోపించారు. ఆ తర్వాత అన్నాదురైని మధురైలో దాచి ఉంచారని, క్షమాపణలు చెప్పిన తర్వాత ఆయన తప్పించుకున్నారని అన్నామలై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇదే ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర మాటలయుద్ధానికి దారితీసింది. ఆ తర్వాత తమిళనాడు మాజీ సిఎం జయలలితపైనా అన్నామలై తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. అన్నాడిఎంకె అధికంలో ఉన్నప్పుడు జరిగిన అవినీతి జాబితాను విడుదల చేస్తానని అనడంతో ఆ పార్టీల నేతల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. కూటమిలో ఉన్న పార్టీ పట్ల బిజెపి ఈ విధంగా వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు.

# కళలకు కాణాచి పెంబర్తి, చంద్లాపూర్

>> పెంబర్తి ఉత్పత్తులను జియో ట్యాగ్ గుర్తింపు విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం చొరవతీసుకుంది. ఇనుము వినియోగం తెలియక ముందునుంచే రాగి, ఇతర మిశ్రమ లోహాల సహాయంతో కాకతీయుల కాలం నుంచి పనిముట్లను, రోజూవారీగా వినియో వస్తువుల తయారీకి పెంబర్తి కేంద్రంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ అవార్డులకు తెలంగాణ నుంచి ఎంపికైనా రెండో గ్రామ సిద్దిపేట జిల్లా చందాపూర్. రంగనాయక స్వామి దేవాలయం, రంగనాయక కొండలు, ఇక్కడి ప్రకృతి, తెలంగాణ సంస్కృ తిని ప్రతిబింబిస్తే ఈ ప్రాంతంలో నేసే గొల్లభామ చీరలు తెలంగాణ కళాసంస్కృతికి ప్రతిబింబాలుగా నిలుస్తున్నాయి. గొల్లభామ చీర, తెలంగాణ నేతన్నల కళా నైపుణ్యానికి నిలువుటద్దం. కళాత్మకత, చేనేతల కలబోతకు నిదర్శనం. నెత్తిన చల్లకుండ, చేతిలో పెరుగు గురిగి, కాళ్లకు గజ్జెలు, నెత్తిన కొప్పులో కళకళలాడే యాదవ మహిళల యాదవ మహిళ వైభవం ఈ చీరల్లో ఇమిడిపోయి కనిపిస్తుంది. రంగనాయక స్వామి దేవాలయం, పరిసర ప్రాంతాలు గ్రామీణ పర్యాటకానికి ప్రసిద్ధి చెందిన నేపథ్యంలోపాటు ఇక్కడి గొల్లభామల చీరలకున్న ప్రత్యేకత కారణంగా ఈ ప్రాంతాన్ని ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవార్డులను సెప్టెంబరు 27న తేదిన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా, ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేయనున్నారు. తెలంగాణ ప్రాంతంలోని కళాకృతులకు నరేంద్రమోడి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపును, గౌరవాన్ని కల్పిస్తోంది. ఏ అంతర్జాతీయ వేదికైనా ఇటీవల జరిగిన జి 20 సమావేశాలైనా భూదాన్ పోచంపల్లి ఇక్కత్ చీరలను, ఇక్కడి నేతన్నలు నేసిన కండువాలను వివిధ దేశాల అధినేతలకు, విదేశీ ప్రముఖులకు అందజేశారు. వివిధ విభాగాలకు సంబంధించిన జి 20 సమావేశాలకు హాజరైన విదేశీ ప్రతినిధులకు కూడా పోచంపల్లిలో నేసిన చీరలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా గిఫ్టులుగా అందజేశారు. 2021లో భూదాన్ పోచంపల్లి గ్రామానికి యుఎన్‌డబ్ల్యుటిఓ ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తింపు కల్పించే విషయంలోనూ కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవ తీసుకున్న సంగతి తెలిసిందే.

## వారం - వర్జ్యం

**26-9-2023 మంగళవారం**

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం
భాద్రపద మాసం, వర్షఋతువు, శుక్ల పక్షం
ద్వాదశి రా.1.05, శ్రవణం ఉ.9.40
వర్జ్యం: మ.1.16-2.42
దుర్ముహూర్తం: ఉ.8.23-9.10
2) రా.10.47-11.35
శుభ సమయం: లేదు
రాహుకాలం: మ.3.00-4.30 వరకు

## వార్తాఫలం

**మేషం:** నిర్మాణ ఆలోచనలు నిదానంగా సాగుతాయి. బాధ్యతలు పెరుగుతాయి. వస్తువుల కొనుగోలు.

**వృషభం:** ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. ముఖ్యమైన పనులలో తొందరపాటు వద్దు.

**మిథునం:** ఆకస్మిక ధన లాభం. సంతానం నుండి కీలక సమాచారం అందుకొంటారు. ధన లాభం.

**కర్కాటకం:** భాగస్వామ్య వ్యాపారాలు విస్తరిస్తారు. పనులలో విజయం సాధిస్తారు. ప్రయత్నాలు ఫలిస్తాయి.

**సింహం:** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. సంతానం నుండి విలువైన సమాచారం అందుకొంటారు.

**కన్య:** కొత్త మిత్రులు పరిచయమై సాయం అందిస్తారు. శుభ కార్యాలలో పాల్గొంటారు. ప్రమోషన్లు లభిస్తాయి.

**తుల:** కుటుంబ సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. వ్యవహారాలలో కుటుంబ సభ్యులు సహాయం అందిస్తారు.

**వృశ్చికం:** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. కాంట్రాక్టులు దక్కుతాయి. మీ ప్రతిష్ఠ పెరుగుతుంది.

**ధనుస్సు:** రుణ వత్తిడులు తీరి ఊరట చెందుతారు. మానసిక ప్రశాంతత లభిస్తుంది.

**మకరం:** శత్రువులు సైతం మిత్రులుగా మారతారు. ఆర్థిక ఇబ్బందుల నుండి బయట పడతారు.

**కుంభం:** సంతానం నుండి కీలక సమాచారం అందుకొంటారు. ప్రయత్నాలు ఫలిస్తాయి.

**మీనం:** వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు. ఆకస్మిక ధన లాభం పొందుతారు. సాహిత్య సభల్లో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'సాగర్'లో పిఒపి విగ్రహాల నిమజ్జనానికి నో

>> గత ఏడాది జారీచేసిన ఉత్తర్వులు యధాతథంగా అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే హైకోర్టు ఆదేశాలను పునపరిశీలించాలని, ఇదే సమయంలో పిఒపి విగ్రహాల తయారీపై వున్న నిషేధాన్ని ఎత్తి వేయాలని గణేష్ విగ్రహాల తయారీదారుల (కళాకారులు) సంక్షేమ సంఘం హై కోర్టులో పిటిషన్ వేయగా దీనిని కూడా హైకోర్టు ధర్మాసనం విచారణ చేసి కొట్టివేసింది. గణేష్ విగ్రహాల తయారీదారుల (కళాకారులు) సంక్షేమ సంఘం తరపున వాదిం చిన న్యాయవాది కళాకారులకు విగ్రహాల తయారీ ఉపాధిని ఇస్తుందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా వున్నట్లుండి వీటిని నిషేధిస్తే ఎలా అన్ని ప్రశ్నించారు. ఇదే సమయంలో హుస్సేన్‌సాగర్‌లో పిఒపి విగ్రహాల నిమజ్జనాన్ని వ్యతిరేకించే పర్యావరణ సంఘాల తరపున వాదించిన న్యాయవాది గత ఏడాదే విగ్రహాల నిమజ్జనాన్ని హైకో ర్టు నిషేధించిందని, అయితే సర్కారు దీనిని అమలు చేయడంలో విఫలం అయ్యిందని విమర్శించారు. గత ఏడాది సర్కారు ఈ ఒక్క ఏడాది అంటూ పెద్ద సంఖ్యలో పిఒపి విగ్రహాలను నిమజ్జనం చేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా మరోసారి అనుమతి ఇవ్వాలని కోరుతున్నారని ఆయన తెలిపారు. అయితే దీంతో సర్కారు తరపు న్యాయవాది విబేధించారుజ గత ఏడాది హుస్సేన్‌సాగర్‌లో పిఒపి విగ్రహాలను నిమజ్జనం చేయలేదని, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కొలనుల్లోనే నిమజ్జ నం చేశామని తెలిపారు.

# మూసీ, ఈసా నదులపై 5 కొత్త వంతెనలు

>> హెచ్‌ఎండిఏ ఆధ్వర్యంలో మూసీ నదిపై 3 చోట్ల, ఈసా నదిపై రెండు చోట్ల మరో రెండు వంతెనలు నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈ పనులకు ఈపిసి పద్ధతిలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. హెచ్‌ఎండిఏ నిర్మించే ఐదు వంతెనల నిర్మాణ పనుల వివరాలు అధికారులు వెల్లడించారు. రూ.42 కోట్ల వ్యయంతో ఉప్పల్ భగాయత్ లేఅవుట్ వద్ద, రూ.35 కోట్లతో ప్రతాపసింగారం, గౌరెల్లి మధ్య, రూ.39 కోట్లతో మంచిరేవుల వద్ద, మరో రూ.32 కోట్లతో బుద్వేల్ ఐటి పార్కు వద్ద ఈసానదిపై, రూ.20 కోట్లతో బుద్వేల్ ఐటి పార్కు -1 సమీపంలో ఈసా నదులపై హెచ్‌ఎండిఏ వంతెలను చేపట్టనుంది. ఉప్పల్ భగాయత్, ప్రతాపసింగారం ప్రాంతాల్లో 210 మీటర్ల పొడవునా మూసీ నదిపై నాలుగు లైన్ల రహదారి వంతెనలు నిర్మాణం జరుగనుంది. టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని హెచ్‌ఎండిఏ ఎస్‌ఇ యూసుఫ్‌హుస్సేన్ తెలిపారు. నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయని తెలిపారు. వంతెనల నిర్మాణం 15 నెలల గడువులోగా పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. 16 మీటర్ల వెడల్పు, 200 మీటర్ల పొడవులో ఒక్కో వంతెన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటి మేయర్ మోతే శ్రీలతరెడ్డి, గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్‌రోస్, హెచ్‌ఎండిఏ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్‌రెడ్డి, ఎస్‌ఇ హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరికృష్ణ, కార్పొరేటర్లు బన్నాల గీత, పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, మాజీ కౌన్సిలర్ గంధం జ్యోత్స్న, గొల్లూరి అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పలువురు బిఆర్‌ఎస్ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

| SINGAM KUIL YELLOW MONDAY DrawDate on:25/09/23 | | ROSA DEAR ROYAL MONDAY DrawDate on:25/09/23 | |
|---|---|---|---|
| DAY - SINGAM SERIES Dr No:206 | DAY - KUIL SERIES Dr No:206 | DAY - ROSA SERIES Dr No:206 | DAY - DEAR SERIES Dr No:206 |
| 1st Prize Rs.100000/- 551140 | 1st Prize Rs.100000/- 221932 | 1st Prize Rs.100000/- 367715 | 1st Prize Rs.100000/- 564323 |
| 2nd Prize Rs.7000/- 73394 | 2nd Prize Rs.7000/- 53689 | 2nd Prize Rs.7000/- 38886 | 2nd Prize Rs.7000/- 17599 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 14557 24787 28412 32237 44222 | 33296 35868 43020 44541 48890 | 05112 15872 21691 48473 53086 | 20656 30534 36519 40702 52450 |
| 49605 51373 79671 89654 96808 | 56190 63009 78649 87860 99337 | 53775 53815 59950 61769 94050 | 74542 81783 93864 96774 99792 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0425 1787 2519 3277 3411 3935 7273 | 4021 4273 4512 5049 7341 7549 8274 | 0118 0184 2157 3145 3787 5719 6651 | 1025 1143 2497 3369 3408 3900 4526 |
| 8418 9023 9129 | 8736 8846 9799 | 6780 7581 8519 | 6652 9368 9743 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0930 1191 2416 4644 4833 8160 8476 | 0195 1737 5085 5156 5231 5449 6009 | 0217 0874 4051 5804 5806 6166 6315 | 0193 1823 2141 2949 3557 4027 7137 |
| 8824 9153 9635 | 6470 6659 7040 | 9236 9737 9879 | 7437 8798 9708 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0134 1785 2671 4028 5783 7674 8981 | 0548 2076 3445 4848 6404 8273 9364 | 0073 1609 3354 4232 6130 7650 9150 | 0160 1477 3184 4364 6132 7077 8848 |
| 0172 1852 2725 4055 5847 7747 9403 | 1053 2186 3519 4917 6424 8298 9445 | 0094 1620 3457 4314 6264 7731 9173 | 0209 1522 3323 4382 6278 7223 8939 |
| 0403 2009 2757 4159 5974 7775 9405 | 1130 2193 3531 4980 6449 8477 9740 | 0218 1775 3513 4343 6295 7817 9321 | 0324 1983 3351 4503 6281 7398 9071 |
| 0455 2041 2779 4399 5991 7792 9493 | 1175 2284 3545 5055 6467 8605 9751 | 0392 2225 3656 4468 6567 7844 9327 | 0351 2089 3594 4784 6296 7405 9100 |
| 0519 2051 2825 4661 6318 7963 9517 | 1191 2379 3565 5134 6575 8689 9788 | 0399 2436 3664 4620 6570 7888 9431 | 0414 2191 3647 5024 6476 7425 9105 |
| 0526 2096 2858 4793 6447 8443 9750 | 1242 2389 3923 5193 6872 8713 9829 | 0448 2493 3776 4635 6704 7958 9695 | 0441 2330 3649 5093 6527 7616 9253 |
| 0813 2227 2988 4898 6462 8572 9896 | 1255 2662 3976 5331 6888 8764 9844 | 0495 2585 3790 4865 6913 7968 9786 | 0678 2386 3697 5234 6558 7617 9363 |
| 0830 2254 3225 5027 6573 8642 9934 | 1281 2897 4212 5516 6975 8857 9927 | 0725 2595 3803 4867 6987 8138 9814 | 0687 2481 3839 5487 6664 7663 9561 |
| 0877 2259 3248 5186 6701 8729 9950 | 1301 2922 4453 5660 7126 8882 9960 | 0753 2692 3857 4915 7054 8331 9891 | 0708 2515 3982 5561 6738 7982 9795 |
| 0878 2280 3261 5242 6814 8888 9959 | 1455 2983 4485 5666 7273 8899 9975 | 0758 2703 4056 4945 7063 8476 9931 | 0871 2635 3996 5587 6764 8194 9942 |
| 0974 2340 3374 5465 6841 8912 | 1589 3143 4589 5902 7303 8919 | 0967 2797 4112 5012 7183 8659 | 1123 2652 4051 5671 6769 8364 |
| 0980 2367 3390 5505 6862 8920 | 1820 3152 4666 5926 7333 9059 | 1124 2860 4149 5252 7228 8742 | 1206 2694 4068 5834 6858 8400 |
| 1101 2385 3499 5568 7176 8950 | 1956 3303 4668 6197 7892 9200 | 1185 2888 4167 5346 7343 8801 | 1250 2740 4222 5870 6894 8410 |
| 1425 2503 3510 5603 7568 8967 | 1995 3331 4769 6317 7974 9240 | 1349 3008 4184 5394 7528 8952 | 1314 3031 4267 6062 6952 8516 |
| 1603 2608 3699 5713 7623 8976 | 2005 3372 4845 6350 8138 9281 | 1434 3243 4223 5545 7649 8975 | 1381 3115 4317 6080 7016 8549 |

| THANGAM VAIRAM LUCK MONDAY DrawDate on:25/09/23 | | NALLANERAM MANI LUCK MONDAY DrawDate on:25/09/23 | |
|---|---|---|---|
| DAY - THANGAM SERIES Dr No:206 | DAY - VAIRAM SERIES Dr No:65 | DAY - NALLANERAM SERIES Dr No:206 | DAY - MANI SERIES Dr No:65 |
| 1st Prize Rs.100000/- 162200 | 1st Prize Rs.50000/- 449254 | 1st Prize Rs.50000/- 559221 | 1st Prize Rs.50000/- 449377 |
| 2nd Prize Rs.7000/- 99224 | 2nd Prize Rs.7000/- 90605 | 2nd Prize Rs.7000/- 63694 | 2nd Prize Rs.7000/- 77048 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 12138 17806 22212 24085 25117 | 01754 08151 37132 38235 41317 | 04598 07821 12246 19564 40480 | 05186 45675 51139 67387 69670 |
| 27907 39251 41917 46844 49103 | 48538 50606 61459 62392 78875 | 57158 58814 61016 65486 66435 | 71721 74578 75325 82693 89774 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0449 1410 1664 3074 4475 6316 7688 | 0199 1405 2331 2971 3047 3156 3394 | 1929 2872 3284 3664 4238 4722 5992 | 0119 2691 3060 4457 4759 5491 6968 |
| 7909 8796 9890 | 3892 6705 6937 | 8120 9148 9658 | 7237 8972 9100 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0031 1075 1397 2274 3189 4609 5858 | 0057 2036 2608 3850 4087 5982 5998 | 1558 2811 4823 4826 5770 7025 7533 | 1085 1526 3334 4792 6064 6823 8801 |
| 8501 9207 9955 | 6365 8763 9010 | 8198 9730 9747 | 9072 9925 9956 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0103 1795 2823 4239 5320 7171 8640 | 0006 1420 2592 4183 5290 7321 9027 | 0325 1406 2814 4068 5506 7162 8764 | 0256 1733 3151 4669 5673 7304 8814 |
| 0295 1843 2981 4351 5419 7297 9008 | 0034 1512 2618 4225 5294 7329 9187 | 0339 1451 2905 4298 6078 7359 8778 | 0367 1762 3351 4727 5704 7381 8948 |
| 0376 1883 3121 4378 5425 7309 9069 | 0037 1516 2805 4226 5507 7432 9271 | 0433 1512 3197 4321 6096 7385 8874 | 0459 1949 3519 4826 5737 7404 8978 |
| 0439 1932 3387 4460 5727 7486 9221 | 0082 1535 2833 4391 5943 7792 9379 | 0621 1576 3223 4341 6179 7476 9086 | 0503 1954 3576 4871 5956 7498 9030 |
| 0537 1944 3409 4467 5957 7713 9243 | 0101 1759 2840 4422 5945 7837 9482 | 0704 1705 3302 4395 6254 7630 9093 | 0542 2108 3620 5091 6173 7731 9207 |
| 0668 2250 3547 4586 5992 7935 9430 | 0311 1780 3005 4553 6079 7897 9579 | 0776 2037 3448 4406 6309 7870 9312 | 0791 2130 3953 5122 6174 7802 9224 |
| 0787 2254 3658 4631 6144 8010 9461 | 0390 1982 3080 4620 6160 7960 9591 | 0787 2064 3475 4459 6313 7898 9566 | 0797 2132 4102 5208 6235 7829 9478 |
| 0995 2380 3661 4651 6166 8049 9684 | 0946 2014 3262 4669 6261 8054 9652 | 0826 2073 3479 4510 6407 8017 9655 | 0833 2192 4284 5407 6335 7994 9523 |
| 1082 2426 3768 4883 6236 8080 9813 | 1065 2273 3331 4801 6297 8120 9752 | 0832 2178 3533 4729 6477 8021 9725 | 0885 2235 4345 5414 6460 8098 9619 |
| 1324 2456 3830 5124 6351 8083 9875 | 1073 2275 3420 4819 6509 8202 9962 | 0977 2181 3593 4761 6680 8116 9947 | 0952 2268 4471 5449 6547 8148 9623 |
| 1332 2460 3840 5162 6409 8119 | 1093 2433 3681 4887 6684 8495 | 1121 2203 3596 5150 6870 8139 | 1169 2291 4488 5479 6615 8349 |
| 1579 2487 3914 5190 6490 8179 | 1120 2555 3772 4902 6933 8741 | 1159 2470 3707 5207 6914 8200 | 1173 2667 4514 5510 6772 8373 |
| 1663 2500 4102 5268 7029 8423 | 1203 2556 3836 5025 6949 8751 | 1176 2550 3787 5303 6954 8544 | 1216 2722 4600 5587 6795 8519 |
| 1666 2513 4152 5297 7095 8463 | 1299 2573 4004 5063 7036 8774 | 1238 2592 3863 5470 7131 8608 | 1251 3010 4605 5632 6813 8734 |
| 1759 2726 4217 5307 7138 8539 | 1329 2590 4177 5259 7082 8852 | 1367 2713 4033 5493 7146 8739 | 1436 3053 4642 5660 7303 8794 |

| KUMARAN VISHNU SUN MONDAY DrawDate on:25/09/23 | | SWARNALAXMI LION PEARL MONDAY DrawDate on:25/09/23 | |
|---|---|---|---|
| DAY - KUMARAN SERIES Dr No:206 | DAY - VISHNU SERIES Dr No:206 | DAY - SWARNALAXMI SERIES Dr No:206 | DAY - LION SERIES Dr No:65 |
| 1st Prize Rs.50000/- 134305 | 1st Prize Rs.50000/- 865510 | 1st Prize Rs.50000/- 139344 | 1st Prize Rs.50000/- 984970 |
| 2nd Prize Rs.7000/- 27232 | 2nd Prize Rs.7000/- 46416 | 2nd Prize Rs.7000/- 52314 | 2nd Prize Rs.7000/- 73142 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 03112 12336 30650 35540 37904 | 02274 04842 09797 34722 34944 | 17501 28717 39528 41136 41938 | 16765 27105 27755 38926 49895 |
| 61858 85408 92052 92901 99576 | 42760 52334 52987 54453 74872 | 52819 63400 74305 85510 96234 | 51802 62606 73709 84436 95661 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 2489 2844 2869 3568 5558 6376 6880 | 0310 0463 2351 2764 3051 3674 4001 | 1139 1653 2400 4223 6552 7352 7550 | 1033 3313 3504 3761 4282 7054 7185 |
| 8529 9766 9782 | 7075 7983 8728 | 7861 8331 9973 | 7529 9108 9949 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0013 0335 0931 1894 2248 2338 4567 | 0291 1727 4375 4664 4912 6111 7192 | 0401 0501 0564 2711 3902 5724 6564 | 0155 0338 0605 2857 3019 3130 5178 |
| 6125 7970 9717 | 7606 9751 9990 | 8630 9529 9954 | 5814 8105 8552 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0084 1238 3182 4853 5670 7396 8891 | 0035 1874 3327 4479 5944 7582 8966 | 0006 1611 2892 4288 5891 7807 9121 | 0284 1953 3484 4884 6372 7552 9096 |
| 0123 1645 3247 4871 5746 7461 8897 | 0127 1912 3557 4589 6248 7635 9056 | 0182 1665 2949 4511 6055 7833 9278 | 0301 2164 3486 5026 6374 7590 9311 |
| 0134 1776 3396 4878 5883 7649 9276 | 0152 1999 3606 4655 6286 7655 9301 | 0233 1908 2964 4587 6080 7853 9521 | 0303 2185 3524 5084 6497 7601 9395 |
| 0344 1869 3458 4914 6090 7708 9355 | 0334 2004 3625 4661 6507 7719 9341 | 0522 2156 3049 4588 6084 7918 9569 | 0311 2255 3784 5134 6546 7617 9481 |
| 0419 2128 3613 4945 6150 7709 9406 | 0869 2014 3693 4673 6569 7937 9472 | 0575 2248 3151 4675 6128 8005 9580 | 0391 2422 3850 5392 6550 7911 9512 |
| 0591 2324 3975 5017 6219 8037 9625 | 0873 2175 3710 4745 6683 8058 9589 | 0718 2273 3345 4698 6499 8030 9649 | 0492 2683 3891 5420 6584 7936 9526 |
| 0599 2478 4166 5038 6493 8144 9668 | 1013 2214 3761 4760 6849 8115 9614 | 0745 2293 3428 5001 6558 8085 9724 | 0759 2811 3897 5557 6639 8037 9606 |
| 0703 2515 4210 5092 6520 8434 9687 | 1214 2435 3778 4931 6900 8127 9712 | 0802 2368 3438 5060 6834 8209 9871 | 0920 2872 3959 5597 6771 8059 9680 |
| 0894 2524 4276 5288 6648 8467 9709 | 1222 2461 3908 4989 7023 8140 9722 | 0805 2382 3493 5169 7210 8303 9881 | 1144 2942 4074 5599 6782 8309 9854 |
| 0930 2693 4291 5325 6673 8475 9998 | 1227 2691 3963 5129 7044 8354 9737 | 0968 2441 3507 5237 7228 8305 9932 | 1198 2953 4104 5639 6788 8463 9860 |
| 0932 2710 4445 5404 6750 8580 | 1286 2721 4014 5131 7059 8368 | 1327 2689 3828 5251 7411 8311 | 1367 2970 4161 5651 6819 8603 |
| 0940 2722 4470 5455 6782 8653 | 1289 2767 4127 5503 7069 8379 | 1479 2812 3942 5379 7643 8313 | 1401 3265 4267 5703 6928 8653 |
| 1067 2961 4618 5521 6868 8694 | 1405 2992 4179 5652 7153 8393 | 1501 2839 4028 5453 7651 8404 | 1461 3361 4407 5767 7234 8710 |
| 1224 3007 4842 5538 6881 8795 | 1602 3074 4270 5727 7318 8858 | 1530 2848 4170 5492 7684 8847 | 1579 3418 4780 5800 7379 8713 |
| 1234 3122 4845 5587 7080 8822 | 1696 3273 4427 5873 7543 8960 | 1607 2861 4195 5807 7727 8936 | 1678 3471 4786 5854 7402 8822 |

# కాంగ్రెస్‌కు డెడ్‌లైన్?

## విలీనమా.. సొంతగా బరిలోకా?

### 30లోగా తేలిపోనున్న వైఎస్సార్‌టిపి భవితవ్యం

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీకి వైఎస్సార్ తెలంగాణ పార్టీ డెడ్‌లైన్ విధించినట్లు సమాచారం. ఈనెల 30వ తేదిలోగా తేల్చేయాలంటూ కోరినట్లు తెలిసింది. అందులో భాగంగానే 30వ తేది డెడ్‌లైన్ విధించిందని తెలిసింది. సోమవారం లోటస్‌పాండ్‌లో వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అధ్యక్షతన రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. 33 జిల్లాలకు సంబంధించి నేతలు పెద్ద ఎత్తున హాజరు అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ విలీనం, ఎన్నికల వ్యూహాలపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది.

# రైతులను నిండా ముంచిన నకిలీ సోయా

## సహకార సంఘం వద్ద ఆందోళన

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** నకిలీ, నాసిరకం విత్తనాలతో రైతాంగం భారీగా నష్టాలపాలవుతున్నారు. ఇదే విధంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా విక్రయించిన సోయా విత్తనాలు సైతం నకిలీవి కావడంతో పలువురు రైతులు నిండా మునిగిపోవాల్సి వచ్చింది. ఈ వానాకాలం సీజనులో జూలై. అగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలతో ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పత్తి, సోయా పంటలు నీట మునిగాయి. ఫలితంగా సుమారు 50 వేల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. మళ్లీ విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తే రైతులకు ఇప్పుడు మరో ముప్పు వచ్చిపడింది. నాసి రకం విత్తనాలు కారణంగా ప్రస్తుతం తెగులు సోకి సోయా పంట ఎదుగు దశలోనే ఎండిపోతోందని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఈ జిల్లాలో పత్తి తర్వాత అత్యధికంగా సోయా పంట సాగవుతోంది. ఈ వనాకాలం సీజనులో దాదాపు 93 వేల ఎకరాల్లో సోయా సాగు చేయగా, ఇప్పటికే 2,100 ఎకరాలకు పైగా పచ్చ తెగులు వచ్చి ఎండిపోయిందని కన్నీటి పర్యాంతమవుతున్నారు. ఇందువల్ల ఎకరానికి 20 వేల రూపాయల నుండి 30 వేల రూపాయల వరకూ నష్టపోయినట్లు వాపోతున్నారు. అయితే ఈ సోయా విత్తనాలు ప్రధామిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా సరఫరా చేసినవి కావడంతో ఎండిపోయిన సోయా పంట కర్రలతో రైతులు ఆందోళనకు దిగారు. కాగా కేడీఎస్ 720 రకం విత్తనాలు తక్కువ రేటు అని, ఎక్కువ దిగుబడి వస్తుందని సహకార సంఘం తమకు నాణ్యత లేని విత్తనాలను అంటగట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 కిలో బ్యాగ్ 2,250 రూపాయలుకు అమ్మిందని, పైగా 15 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుందని సహకార సంఘం సిబ్బంది నమ్మించి మోసం చేశారని మండిపడుతున్నారు. తమకు నష్ట పరిహారం చెల్లించాలని, నాణ్యత లేని విత్తనాలు పంపిణీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రారంభమైన నైరుతి రుతుపవనాల తిరోగమనం

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** దేశంలో నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది. సాధారణ తేదీ కంటే ఎనిమిది రోజుల ఆలస్యంగా నైరుతి రాజస్థాన్ నుండి తిరోగమనం ప్రారంభించాయని భారత వాతావరణ శాఖ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు సోమవారం నైరుతి రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుండి ఉపసంహరించుకున్నాయి. సాధారణంగా నైరుతి రుతుపవనాలు ఈ నెల 17వ తేదీ నుండి ఉపసంహరణ జరగాల్సి ఉండగా, ఇది జాప్యం జరిగి 25వ తేదీ నుండి ప్రారంభమయ్యాయి. వాతావరణ విభాగం వివరాల ప్రకారం రుతుపవనాలు ఆలస్యంగా ఉపసంహరించుకోవడం ఇది వరుసగా 13వసారి. రుతుపవనాల తిరోగమనంలో ఏదైనా జాప్యం అంటే ఎక్కువ కాలం వర్షాకాలం ఉంటుంది. ఇది వ్యవసాయ ఉత్పత్తిని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా వాయువ్య భారతదేశంలో రుతుపవనాల వర్షపాతం రబీ పంట ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించింది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1వ తేదీ నాటికి కేరళలో ప్రారంభమై జూలై 8వ తేదీ నాటికి దేశం మొత్తానికి విస్తరిస్తాయి. అలాగే సెప్టెంబరు 17వ తేదీ నాటికి వాయువ్య భారతదేశం నుండి తిరోగమనం ప్రారంభమై అక్టోబరు 15వ తేదీ నాటికి పూర్తిగా ఉపసంహరించుకుంటుంది అని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

## అశ్వ వాహనంపై

# కల్కి అలంకారంలో శ్రీమలయప్ప



**తిరుమల, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన సోమవారం రాత్రి అశ్వ వాహనంపై కల్కి అలం కారంలో శ్రీ మలయప్పస్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవ జరిగింది. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనాలు, కోలాటాలు, జీయ్యంగార్లు వేదమంత్రాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు. ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలుగా వర్ణిస్తున్నాయి. అందువల్ల అశ్వాన్ని అధిరోహించిన పరమాత్మ ఇంద్రియాలను నియమించే నియామకుడు. పరమాత్మను అశ్వ స్వరూపంగా కృష్ణయజుర్వేదం తెలియజేసింది.

స్వామి అశ్వవాహనాదిరూఢుడై కల్కి స్వరూపాన్ని ప్రకటిస్తూ కలిదోషాలకు దూరంగా ఉండాలని, నామ సంకీర్తనాదులను ఆశ్రయించి తరించాలని ప్రబోధిస్తున్నాడు. కాగా, బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం 6 నుండి 9 గంటల వరకు స్వామి పుష్కరిణిలో స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహిస్తారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు ధ్వజారోహణం జరుగనుంది. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్ స్వామి, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, ఈవో ఏవి ధర్మారెడ్డి దంపతులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం సివిఎస్వో నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పోచంపల్లి చేనేత వస్త్రాలకు దక్కిన అరుదైన గౌరవం

## మిసెస్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఫైనల్ పోటీల్లో చేనేత వస్త్రాల్లో ఆకట్టుకున్న ఫైనలిస్టులు



**భూదాన్‌పోచంపల్లి, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో మాజీ మిస్సెస్ ఇండియా అండ్ ఆసియన్ ఫసిఫిక్ మమతా త్రివేది ఆధ్వర్యంలో ఆదివారంరాత్రి జరిగిన మిసెస్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఫైనల్ పోటీలో భాగంగా ఫైనల్‌కు ఎన్నుకోబడిన 34 మంది అభ్యర్థులు పోచంపల్లి చేనేత వస్త్రాల ప్రచారంలో భాగంగా ఫైనలిస్టులందరూ చేనేత వస్త్రాలను ధరించి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పోచంపల్లి టై అండ్ డై అసోసియేషన్ ఇక్కత్ వస్త్రాలలో ఫైనల్ ఇక్కత్ వస్త్రాలను ధరించి ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా మమతా త్రివేది మాట్లాడుతూ .. పోచంపల్లి చేనేత వస్త్ర కళ ఎంతో అద్భుతంగా ఉంటుందని, ఇక్కడ ప్రాంతాన్ని సందర్శించిన తరువాత కార్మికులు చేనేత వస్త్రాల కోసం కష్టపడుతున్న వారికి రావాల్సిన గుర్తింపు రావడంలేదని, ఇది గమనించిన తరువాత కార్మికులకు మా వంతు సహాయం కోసం వస్త్రాల ప్రచారంతోపాటు ఆదరణ లభించే విధంగా వస్త్రాలకు ప్రచారమే లక్ష్యంగా ఇక్కడ అభ్యర్థులు ధరించి ప్రదర్శన నిర్వహించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపు తెచ్చే విధంగా తమ వంతు కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. అనంతరం టై అండ్ డై అధ్యక్షుడు తడక రమేష్ చేనేత వస్త్రంపై రూపొందించిన జి-20 లోగోను ఆమెకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భారత లవకుమార్, ఉపాధ్యక్షుడు బోగ విష్ణు, కోశాధికారి ముసుకూరి నరసింహా, సభ్యులు సీత లక్ష్మణ్, గంజి బాలరాజ్, సీత భవాని, గుండు ఉప్పలయ్య, తాటి గిరిబాబు, తదితరులు ఉన్నారు.

# రాహుల్‌కు దమ్ముంటే హైదరాబాద్ నుంచి పోటీ చేయాలి

## ఎంపి అసదుద్దీన్ సవాల్

**హైదరాబాద్, ప్రభాతవార్త :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి దమ్ముంటే హైదరాబాద్‌లో తనపై పోటీ చేయాలని ఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఒవైసీ సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఎన్నో మాటలు చెబుతుంది ఆ తరువాత ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయోధ్యలోని బాబ్రీ మసీదును కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్న సమయంలోనే కూల్చేశారని పేర్కొన్నారు.

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ వాయనాడ్ నుంచి కాకుండా హైదరాబాద్ నుంచి పోటీ చేయాలి. ఆయనెప్పుడూ భారీ ప్రకటనలు చేస్తుంటారు. క్షేత్ర స్థాయిలో నాతో పోటీకి నిలబడండి. అప్పుడు మీ సత్తా ఏమిటో తెలుస్తుంది అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలోనే బాబ్రీ మసీదు, సెక్రటేరియల్‌లో మసీదు కూల్చివేశారని ఆరోపించారు. అలాగే, ఇటీవల బీఎస్పీ ఎంపి డానిష్ అలీపై బీజేపీ ఎంపీ రమేష్ బిదూరీ మతపరంగా దూషించిన వ్యాఖ్యలపై ఒవైసీ మాట్లాడుతూ బీజేపీ నినాదం సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ ఎక్కడుందని ప్రశ్నించారు. పార్లమెంటులో సామూహిక హత్యలు జరిగే రోజు మరెంతో దూరంలో లేదని వ్యాఖ్యానించారు. దీనిపై దేశ ప్రధాని మోదీ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు.

కాగా, ఇటీవల తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన విజయభేరి సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎంఐఎం పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. తమను తాము వేర్వేరు పార్టీలుగా చెప్పుకునే బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలు కలిసే పని చేస్తున్నాయన్నారు.

కాంగ్రెస్ ఈ మూడు పార్టీలతో పోరాడుతున్నదనీ, అంతేకాకుండా సీఎం కేసీఆర్ ఎంఐఎం అధినేత ఒవైసీలపై సీబీఐ, ఐడీ కేసులు లేవనీ, ప్రధాని మోదీ వారిని తన సొంత వ్యక్తులుగా భావిస్తున్నారని విమర్శించారు. ఈ విమర్శలకు కౌంటర్‌గా అసదుద్దీన్ ఒవైసీ రాహుల్ గాంధీకి తనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు.

# ముస్లిం, మైనార్టీల శ్మశానవాటికలకు 125 ఎకరాల కేటాయింపు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** తెలంగాణ ముస్లిం, మైనార్టీలకు తెలంగాణ రాష్ట్ర సర్కార్ మరో శుభవార్త చెప్పింది. ముస్లిం, మైనార్టీలకు మోడల్ స్మశాన వాటికల నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం సుమారు 125 ఎకరాలను కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు దీనికి సంబంధించి మంత్రి కల్వకుంట్ల తారకరామారావు వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మహమ్మద్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఖాజా మొయినుద్దీన్‌లకు స్థలాల కేటాయింపు పత్రాలు అందచేశారు. కాగా ముస్లిం స్మశాన వాటికల నిర్మాణం కోసం 125 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని అగస్టు నెలలో తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో తాజాగా 125 ఎకరాలను కేటాయింపు చేసింఇ. స్మశాన వాటికల నిర్మాణానికి రంగారెడ్డి, మల్కాజిగిరి జిల్లాల్లో భూములు కేటాయించింది. రంగారెడ్డి జిల్లా మజీద్‌పూర్‌లో 22 ఎకరాలు, ఖనాపూర్‌లో 42 ఎకరాలు, మిగిలిన విస్తీర్ణం మల్కాజిగిరి జిల్లాలోని తుర్కపల్లిలో మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది.

# అన్ని పార్టీలు విద్యార్థి ఉద్యమకారులకు టిక్కెట్లు ఇవ్వాలి

## టిఎస్ జెఎసి, ఒయు జెఎసి నాయకులు

**హైదరాబాద్ (తార్నాక), సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** అన్ని రాజకీయ పార్టీలు విద్యార్థి ఉద్యమ కారులకు ఎమ్మెల్యే, ఎంపి టికెట్లు కేటాయించాలని టీఎస్ జేఏసీ, ఒ.యూ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. టీఎస్‌జేఏసీ.. ఒ.యూ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజ్‌లో రాజకీయ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన ఒ.యూ విద్యార్థి ఉద్యమ కారులను పూర్తిగా విస్మరించాయన్నారు. ఈ సందర్భంగా వారు రాజకీయ డిక్లరేషన్‌ను విడుధల చేశారు. అన్ని పార్టీలు పార్టీ పదవుల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో కీలకమైన పదవులను ఇవ్వాలని, ప్రభుత్వ పాలనలో రెండు మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు యువతకు తప్పనిసరిగా అవకాశం కల్పించాలని డిక్లరేషన్‌లో డిమాండ్ చేశారు. ఒ.యూ విద్యార్థి ఉద్యమ కారుల త్యాగాలను గుర్తించాలన్నారు. త్యాగాలు విద్యార్థులవి అవితే పదవులను అనుభవించే వారు ఒకరు అయ్యారని ఆరోపించారు. డా.రుద్రవరం లింగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రుద్రవరం లింగస్వామి, డా. నలిగంటి శరత్, జైగౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు డా. వట్టికూటి రామారావు గౌడ్, కంచర్ల బద్రి, గాదె వెంకట్, పుల్లారావు, రాస వెంకట్, మిడతన పల్లి విజయ్, మేడి రమణ, జంగిలి దర్శన్, పాల్వాయి నగేష్, నెహ్రూ నాయక్, బుల్లెట్ కృష్ణ, ఎస్.నాగేశ్వరరావు, దర్శనం జాన్, వలిగొండ నర్సింహ్మా, అరుణ్‌కుమార్, సమంత్, ఉదయ్, మెరిగ సైదాబాబు, ప్రశాంత్, చిన్నా, సురేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



రాజకీయ డిక్లరేషన్‌ను విడుదల చేస్తున్న టిఎస్ జెఎసి, ఒయు జెఎసి నాయకులు

# నెలాఖరులోగా రుణ మాఫీ పూర్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** తెలంగాణలో ఈ నెలాఖరు నాటికి పంట రుణాల మాఫీని పూర్తి చేయాలని రాష్ట్ర సర్కార్ పట్టుదలతో ఉంది. ప్రస్తుతం లక్ష రూపాయల వరకూ ఉన్న రుణాలను పూర్తి చేసే ప్రక్రియను అమలు చేస్తోంది. తొలుత ఈ నెల రెండో వారానికల్లా పంట రుణాల మాఫీ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, అందుకు ఒకింత నిధుల సమస్య ఎదురైంది. రాష్ట్రంలోని సుమారు 36.80 లక్షల మంది రైతులకు సంబంధించిన పంట రుణాలు మాఫీ జరగాల్సి ఉండగా, అగస్టు 15వ తేదీ నాటికి 16.22 లక్షల మంది లబ్ధి చేకూరింది. సుమారు 20 లక్షల మందికి 13 వేల కోట్ల రూపాయలు అందాల్సి ఉంది.

ఈ నెల 15వ తేదీ నాటికి మొత్తం పంట రుణాల మాఫీని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించడంతో అధికారులు దశల వారీగా రైతుల బకాయిలకు నిధులను జమ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ దాదాపు 5,500 కోట్ల రూపాయలను రుణ మాఫీ నిమిత్తం ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఇంకా సుమారు 10 లక్షల మంది అర్హులైన రైతుల పంట రుణాలు మాఫీ చేయాల్సి ఉంది. ఇందుకు మరో 7,500 కోట్ల రూపాయలు అవసరం ఉండగా ఈ మొత్తాన్ని ఈ నెలాఖరు నాటికల్లా పూర్తిగా విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియవచ్చింది.

# ఎమ్మెల్సీల విషయంలో గవర్నర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విష యంలో రాష్ట్ర గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు, ఈ నిర్ణయానికి అభినందనలు తెలుపడంతోపాటు ధన్యవాదాలు చెబుతున్నావ ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గవర్నర్ కోటా, రాష్ట్రపతి కోటాలు మేధావులకు, విద్యావంతులకు, కవులకు, కళాకారులకు, సామాజిక కార్య కర్తలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి న నామినేటెడ్ పదవులు అన్నారు. ముఖ్య మంత్రి కెసిఆర్ గతంలో కూడా అనేక క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తులకు ఎమ్మెల్సీలుగా నియమించాలని గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపితే గవర్నర్ తిరస్కరించిన విషయం తెలిసిందే. కెసిఆర్ కుటుంబానికి సేవ చేసే వ్యక్తు లకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాల్సి న అవసరం లేదన్నా రు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా నరేంద్రమోడి, బిజెపితో ఏ మాత్రం సంబంధం లేని తెలంగాణ నుంచి ఒక సినీ కథా రచయిత విజయేంద్ర ప్రసాద్ ఎంపిగా ప్రతిపాదిస్తే రాష్ట్రపతి ఆమోదం పొందారు. దక్షిణాది నుంచి పిటీ ఉషా లాంటి అంతర్జాతీయ క్రీడాకారిణిని ప్రతిపాదిం చగా రాష్ట్రపతి ఆమోదించారన్నారు. తెలంగాణ గవర్నర్ తీసుకున్న నిర్ణయం సాహసోపే తమైనది, ఆమెకు తెలంగాణ ప్రజలకు తరుపున దన్యవాదాలు తెలుపు తున్నామన్నారు. కెసిఆర్‌కు అనుకూలంగా ఉంటేనే గవర్నర్‌గా వ్యవహ రించినట్టా? కెసిఆర్ చేస్తున్న తప్పిదాలు పొరపాట్లను ఎత్తిచూపుతూ ధూర్యం నిర్ణం తీసుకుంటే, గవర్నర్‌గా మీకు నచ్చరా? అని ప్రశ్నించారు. గవర్నర్ స్వతంత్రంగా వ్యవహరిస్తారు? ఏ పార్టీతో ఆ పదవికి సంబందం ఉండదు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉండాలని కోరకోవడం సమం జసం కాదు, తెలంగాణ గవర్నర్ తీసుకున్న నిర్ణయం సరైన నిర్ణయం అన్నారు.

# గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దుపై డివిజన్ బెంచ్‌కు టిఎస్‌పిఎస్‌సి

## అప్పీల్‌పై నేడు విచారణ

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దుపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) సోమవారం హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేసింది. అత్యవసర విచారణకు లంచ్ మోషన్ అనుమతి కోరింది. అయితే ఈ అప్పీల్‌పై స్పందించిన హైకోర్టు డివిజన్ బెంచ్ నేడు(మంగళవారం) విచారణ జరిపేందుకు అంగీకరించింది. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేస్తూ శనివారం(23న) సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే పేపర్ లీకేజీ కారణంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఒకసారి రద్దయిందని.. ఇప్పుడు మరోసారి రద్దవ్వడంతో..మరోసారి ప్రిలిమ్స పరీక్షను రాయాలంటే లక్షలాది మంది అభ్యర్థులు మానసికంగా ఇబ్బందులకు గురవుతారని.. కొన్నిసార్లు ఇదంతా భరించలేక ఆత్మహత్యలే శరణ్యమని భావించే ప్రమాదం కూడా ఉందని కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే సింగిల్ జడ్జి తీర్పును డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసినట్టు కమిషన్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఇప్పటికే రెండుసార్లు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలను రాసిన అభ్యర్థులు గందరగోళంలో ఉన్నారు. ఇప్పుడు కూడా పరీక్ష రద్దయితే మరోసారి రాయాల్సి వస్తుందా? అనే సందిగ్ధంలో అభ్యర్థులు ఉన్నారు.

# మహిళా బిల్లులో బిసి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలి

## రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ పార్టీల నేతలు, బిసి సంఘాల డిమాండ్



సమావేశంలో అభివాదం చేస్తున్న మధుయాష్కీ, వి.హెచ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళ బిల్లులో బిసి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని పలువురు వక్తలు కోరారు. మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా కల్పించాలని డిమాండ్ చేస్తూ..బిసి సంక్షేమసంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో బిసి సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు కుందారం గణేష్‌చారి అధ్యక్షతన లక్డీకపూల్‌లోని ఓప్రైవేట్ హోటల్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. దీనికి టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షులు విశారధన్ మహారాజ్ ,మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్యతోపాటు పలువురు బిసిసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఓబిసిల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. మొన్న జరిగిన సిడబ్ల్యూసి సమావేశాల్లో రాహుల్‌గాంధీతో బిసిసంఘాల సమావేశం జరగాల్సి ఉన్నా అనివర్య కారణాల వల్ల అధి జరగలేదని త్వరలో బిసి సంఘాల నాయకులందరినీ తీసుకెళ్ళి రాహుల్‌గాంధీతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

మాజీ ఎంపి వి.హెచ్ మాట్లాడుతూ మహిళ బిల్లు మంచిదేనని ..కానీ బిసి మహిళలకు కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అక్టోబర్ మొదటివారంలో 10వేలమంది మహిళలతో జంగ్‌సైరెన్‌సభ నిర్వహిస్తామన్నారు. ప్రధాని మోదీకి వినపడేలా కోటిమంది మహిళలతో లేఖలు రాస్తామన్నారు. కేంద్రం తెచ్చిన మహిళా బిల్లు నారీ వందన్ కాదని ..నారీ వంచన్ బిల్లు అని ఆరోపించారు. తెలంగాణ వచ్చిందే సబ్బండ కులాల పోరాటంతో అని ఏపార్టీ బిసి సిఎంను ప్రకటించిన పార్టీకే మద్దతు ఉంటుందని లేదంటే కొత్తపార్టీ వస్తుందని జాజుల స్పష్టం చేశారు. అగ్రవర్ణాల మహిళలే రాజకీయంగా ఎదగాలని మహిళా బిల్లు తెచ్చారని ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షులు విశారధ్ మహారాజ్ ఆరోపించారు.

ఈకార్యక్రమంలో ఎంబిసి కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, నాయకుల ఇందిరా శోభన్, బాలలక్ష్మీ, మణిమంజరి, విక్రంగౌడ్, కనకాల శ్యాం కురుమ తదితరులు పాల్గొన్నారు.

# చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తి

**తిరుమల, సెప్టెంబరు 25, ప్రభాతవార్త ప్రతినిధి :** శ్రీ వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన సెప్టెంబర్ 26న చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 6 నుండి 9 గంటల వరకు శ్రీ వరాహస్వామి వారి ఆలయం వద్ద గల స్వామి పుష్కరిణిలో శ్రీ దేవి, భూ దేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారికి శ్రీ చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం ఆ తరువాత చక్రస్నానం నిర్వహిస్తారు. ఇందుకోసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కరిణిలో గ్యాలరీలు, స్నానఘట్టాలు ఏర్పాటు చేశారు. భద్రతాపరంగా ఇబ్బందులు లేకుండా టిటిడి భద్రతా సిబ్బందితో పాటు ఎన్‌పిఎఫ్ సిబ్బంది, ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. చక్రస్నానం పవిత్రత రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనం పాటించి పుష్కరిణిలో స్నానం చేయాలని టిటిడి కోరుతోంది. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

**అధికారులు టీమ్ వర్క్‌ను అభినందించిన జెఇఒ..**

శ్రీ వారి బ్రహ్మోత్సవాల్లో మాడ వీధులు, బయటి క్యూలైన్లు, ఇతర సెక్టార్లలో బాధ్యతలు అప్పగించిన టిటిడి అధికారులు, ఉద్యోగులు టీమ్ వర్క్‌తో చక్కగా పనిచేశారని టిటిడి జేఈవో వీరబ్రహ్మం అభినందించారు.

**శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మ గుడి)**
కేశవాపురం-జగన్నాధపురం గ్రా॥, పాల్వంచ మం॥, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

**సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం ప్రకటన-5**

RC No.SKDD/86/2023 తేది: 25.09.2023

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, కేశవాపురం-జగన్నాధపురం గ్రామంలో నందు గల శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మ గుడి) నందు షాపింగ్ కాంప్లెక్స్‌లోని 9 షాపులు అనగా షాపు నెం.1,2,3,5,7,9,10,11,12లకు 3 సంవత్సరాలు (36 నెలలు) కాలపరిమితికి గాను సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం పాట తేది: 03.10.2023 ఉదయం 11.00 గంటలకు దేవస్థాన ఆవరణలో జరుపుటకు నిర్ణయించడమైనది. బహిరంగ వేలం పాటలో పాల్గొనదలచినవారు ఈ క్రింది షాపు ఒక్కింటికి రూ.50,000/-లను ధరావతు సొమ్ము చెల్లించి వేలము పాటలో పాల్గొనవలెను. టెండర్ షెడ్యూల్స్ తేది: 25.09.2023 నుండి తేది: 03.10.2023 వరకు విక్రయించబడును. సీల్డ్ టెండర్ ఖరీదు రూ.200/-లు చెల్లించి పొందవచ్చును. ఇతర వివరములకు కార్యాలయము నందు సంప్రదించగలరు.

అధ్యక్షులు & ధర్మకర్తల మండలి సం/- కార్యనిర్వహణాధికారి

DIPR.No.7167-PP/CL/Advt/1/2023-24, తేది: 25.09.2023

వార్త

ఎక్కడ ఆగిపోవాలో తెలిసిన వ్యక్తి ఎప్పటికీ ప్రమాదాల్లో చిక్కుకోడు.

-లావోట్సె

# ఉపాధిని ఉరితాడుగా మార్చొద్దు!

విశ్వాసం వ్యక్తికి అద్భుతమైన ధైర్యాన్ని ఇస్తుంది. కార్యోన్ముఖున్ని చేస్తుంది. ఎన్ని అపజయాలు ఎదురైనా,మరెన్ని ఎదురు దెబ్బలు తగిలినా విశ్వాసం ఉన్న వ్యక్తి తొణకదు, బెదరదు. ముందుకు సాగిపోతూనే ఉంటాడు. అదే వ్యక్తికి విశ్వాసం సన్నగిల్లితే ఏ చిన్నఎదురుదెబ్బతగిలినా తట్టుకోలేడు. తనకుతానుగా సమిధైపోతాడు. అందుకే మానవజీవన పోరాటంలో విశ్వాసం అనేదిఎంతో ముఖ్యమైంది. ఆ విశ్వాసం దెబ్బతిని దేశంలో అన్నంపెట్టే రైతన్నలనే ఆత్మగౌరవం చంపుకోలేక తమను ఆదుకునేవారు ఎవరూ లేరని నిరాశానిస్పృహలతో తమలో తాము కృంగికృశించి మరో గత్యంతరం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఒకరుకాదు, ఇద్దరు కాదు వందలు కాదు దేశవ్యాప్తంగా వేలాదిమంది ఆత్మాహుతులైపోతున్నారు. ఎవరు ఎన్నిమాటలు చెప్పినా, ఎన్ని వాగ్దానాలు చేసినా వారిలో విశ్వాసం నింపేందుకు మరెన్ని ప్రయత్నాలు చేసినా రైతులు అంతగా విశ్వసించలేకపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో కొన్ని కార్యక్రమాలు చేపట్టినా ముఖ్యంగా తెలంగాణలో కరెంటు కష్టాలు తొలగించి రైతుబంధు లాంటి పథకాలతో రైతులకు కొంత ఊరట నిస్తున్నా ఆత్మహత్యలు ఆగడం లేదు. గతంలో కూడా రైతులకు సంబంధించి ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పరికరాలు తదితర ముడి పదార్థాలను సబ్సిడీ రేట్లతో అందించే కార్యక్రమాలు ఎన్నో జరిగాయి. జరుగుతున్నాయి. అయినా రైతుల ఆర్థిక పరిస్థితి ఏమాత్రం మెరుగుపడకపోగా మరింతగా దిగజారిపోతున్నది. వ్యవసాయరంగమే పెద్ద సంక్షోభంలో కూరుకుపోతున్నది. గ్రామీణ వ్యవసాయం చేసేవారు తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. తెలంగాణలోనే కాదు దేశవ్యాప్తంగా పప్పుదినుసుల సాగు గణనీయంగా పడిపోతున్నది. దీనిని అధిగమించేందుకు పాలక వర్గాలు త్రికరణశుద్ధిగా ప్రయత్నాలు చేయడం లేదు. కొరతలు ఏర్పడినప్పుడు విదేశాల నుండి దిగుమతుల కోసమే ప్రయత్నిస్తున్నారు తప్ప స్వదేశంలో ఉత్పత్తులు పెంచేందుకు రైతులకు చేయూతనివ్వడం లేదు. ఏదిఏమైనా ప్రభుత్వ విధానాలు ఆచరణలో జరుగుతున్న అవకతవకలతో రైతుల బతుకులు ఛిద్రం అవుతున్నాయి. ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలు రైతులకు ఏమాత్రం లాభదాయకంగా లేవు. ఆరుగాలం శ్రమించి పండించే రైతన్నకు కనీస మద్దతు ధర దక్కడం లేదనేది అందరికి తెలిసిన విషయమే. వాస్తవానికి కేంద్ర పెద్దలు నిర్ణయిస్తున్న ధరలు ఏ కోణంలో చూసినా రైతులకు గిట్టుబాటు కావడం లేదు. యేడాదియేడాదికి ఖర్చులు పెరిగిపోతున్నాయి. కూలీల రేట్ల పరిస్థితి రైతులు మోయలేనంతగా తయారైనాయి. ఎరువుల ధరల గురించి చెప్పాల్సిన పనిలేదు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని వాస్తవంగా పెట్టుబడికి అవుతున్న ఖర్చులను పరిగణనలోకి తీసుకొని ధరలు నిర్ణయిస్తే కొంతలోకొంత మేలు జరిగే అవకాశాలు ఉండేవి.సాగు ఖర్చులు అవగాహన లేకుండా నిర్ణయిస్తున్న కనీస మద్దతు ధరలతో రైతుల్లో నిరాశానిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. ఈ కనీస మద్దతు ధరలు ఏప్రాతిపదికపై నిర్ణయిస్తారో ఖర్చులుఎలా అంచనావేస్తారో, ఎవరికి అర్థంకాని నిగూఢ రహస్యంగా మారిపోయింది. కనీస మద్దతు ధర నిర్ణయించడానికి ఎలాంటి స్థిరమైన గణిత నమూనా లేదని,వ్యవసాయ ఉత్పత్తుల వ్యయాలు, ధరల కమిషన్‌ను 1998లో భానుప్రతాప్ కమిటీ అధికారికంగానే ప్రకటించింది.పూర్వాపరాల్లోకి వెళ్లితే 1960లో దేశంలో ఏర్పడిన ప్రత్యేకపరిస్థితుల ఆధారంగా 'ఝూ' కమిటీ ప్రతిపాదనల మేరకు వ్యవసాయ ఉత్పత్తులధర కమిషన్‌ను ఏర్పాటుచేశారు. మద్దతు నిర్ణయించడంలో కీలకపాత్రను ఈ కమిషనే నిర్వహిస్తుంది. పన్నెండు రకాల అంశాలను పరిగణనలోకి తీసుకొని మద్దతు ధర ప్రకటిస్తుందని చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను అవగాహన లేకుండా అధ్యయనం చేయకుండా ఈ ధరలు నిర్ణయిస్తున్నారనేది రైతులవాదన. ఫలితంగా తమకు న్యాయమైన కనీస గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా ఇబ్బడిముబ్బడిగా పెరిగిన, పెరుగుతున్న ఎరువులు, కూలీల రేట్ల వల్ల సాగు ఖర్చు చుక్కలను అంటుకుంటున్నది.కూలీల కొరత పెరిగిన ఖర్చుల భారాన్ని భరించలేక వ్యవసాయానికే మంగళం పాడుతున్న రైతులు ఎందరో ఉన్నారు. అసలు ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయం కొనసాగించాలా? లేదా అని రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.సబ్సిడీలు కూడా రైతులకు ఆశించి మేరకు సకాలంలో అందించలేకపోతున్నారు. అయితేఇలాంటి సబ్సిడీలు రైతులను బిచ్చగాళ్లుగా మారుస్తున్నాయని కొందరు మేధావులు ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నారు. సబ్సిడీలతో ఆర్థిక వ్యవస్థ కూలిపోతుందని కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం కింద ఎన్ని లక్షలకోట్ల మాఫీలు ఇస్తున్నారో,సబ్సిడీలుఅందిస్తున్నారో, వడ్డీలు రద్దుచేస్తున్నారో పెద్దలకు తెలియంది కాదు. అలా ఇవ్వడం తప్పని చెప్పడం లేదు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే అదితప్పదు. అదే సిద్ధాంతాన్ని ఇక్కడ కూడా ఎందుకు వర్తింపచేయరు.వ్యవసాయానికి ప్రోత్సాహకాలు అందివ్వడంలో మనదేశం చాలా వెనుకబడి ఉంది. అమెరికా, జపాన్ వంటి దేశాలు అత్యధికంగా ప్రోత్సాహకాలు ప్రకటించి అభివృద్ధిచెందినసాంకేతిక పరిజ్ఞానం, పరికరాలతో లెక్కకుమించిన ప్రోత్సాహకాలతో ఆయాదేశాలు పురోగమిస్తుంటే మనదేశంలో అంతంత మాత్రం ప్రోత్సాహకాలు ఇస్తూ మరొకపక్క కాలం చెల్లిన పాతపద్ధతులతో కాలం వెల్లబుచ్చుతున్నారు. అన్ని పార్టీల నేతలు రాజకీయాలకు అతీతంగా రైతు సంక్షేమం గురించి ఆలోచించాల్సిన తరుణమిది. వారికున్న ఏకైక ఉపాధి వారిపాలిట మృత్యువుగా మార్చొద్దు.

విషయాలను యథాతథంగా చూడగల నేర్పరితనంతోబాటు, వాటిని నిర్వహించవలసిన రీతిలో నిర్వహించడమే లోకజ్ఞానం.




సి.ఇ.స్టావే

చేతినిండా పని లేనప్పుడు పనితో సతమతమవుతున్నవారిపై దాడి చేయడం సాధారణం.



ఆట్కిన్సన్

## ప్రజావాక్కు



### భారత్ గురించి కెనడా తెలుసుకోవాలి

ఇతర దేశాల నుండి ఉగ్రవాద చర్యలైనా లేక వేర్పాటువాద చర్యలైనా మన భారతదేశంలో ఎవరైనా, ఏ సంస్థ అయినా నిర్వహిస్తున్నప్పుడు భారత ప్రభుత్వం ఎప్పుడూ ఊరుకోదు. తప్పకుండా కఠినచర్యలు తీసుకుంటుంది. ఖలిస్థాన్ వేర్పాటు, ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ కెనడా పౌరునిగా ఉంటూ సిక్కు వేర్పాటు వాదానికి నాయకత్వం వహిస్తూ మనదేశంలో అల్లకల్లోలంచేస్తున్నప్పుడు మనదేశం మౌనంగా ఉండదు. ఒసామా బిన్‌లాడెన్ ప్రపంచమంతా మతం పేరు మీద ఉగ్రవాదాన్ని పెంచుతున్నప్పుడు అమెరికా సైన్యం పాకిస్థాన్‌లో చంపివేయలేదా? అప్పుడు కెనడా ప్రభుత్వం ఎందుకు అమెరికాను వ్యతిరేకించలేదు?మరి నిజ్జర్,తెలియని వారిచేత చంపబడినప్పుడు ఎందుకు రాద్ధాంతం? దానికి భారత దౌత్యవేత్తలను నిందించడం ఎందుకు? ప్రపంచమంతా ఉగ్రవాదం మీద యుద్ధం చేస్తుండగా కెనడా ప్రభుత్వంమాత్రం దానిని ప్రోత్సహిస్తుంది.

-డాక్టర్ జయప్రకాశ్‌రెడ్డి, నల్గొండ

### ప్రమాద భరితంగా వృక్షాలు

సికింద్రాబాద్ లాల్‌బజార్ నుండి సుచిత్ర మార్గంలో డైరీఫారం రోడ్డు గ్రీన్ ఫీల్డ్ నుండి ఎన్‌హెచ్ 44వరకు రక్షణశాఖకు చెందిన భూమిలో చెట్లు వృక్షాలు చాలా ఎత్తు పెరిగి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు రాకపోకలకు, ఆనుకొని ఉన్న కాలనీల ప్రజలకు చాలా ఇబ్బందులు కలిగిస్తున్నవి. ఈమార్గంలో చెట్ల కొమ్మలు, మండలు రోడ్డుపైకి ఒక మీటరు దూరం వచ్చినవి. కొన్నిచెట్ల కొమ్మలు ఎండిపోయి అప్పుడప్పుడు రోడ్డుపై పడుతున్నవి. తృటిలో ప్రమాదాలు తప్పిన సందర్భాలున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

-దండంరాజు రాంచందర్‌రావు, హైదరాబాద్

### పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రి మండలిచే ఆమోదించబడిన గ్యారంటీ పెన్షన్‌విధానాన్ని ఉద్యోగ ఉపాధ్యాయులు అంగీకరించడం లేదు.పేరులో మాత్రమే గ్యారంటీ కలిగి కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌కు మరొక రూపాంతరంగా జిపిఎస్‌ను చెప్పవచ్చును. జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కాకముందు, అంటే అధికారంలోకి రాకముందు సిపిఎస్ రద్దు అనే హామీని ఎన్నికల ప్రచార సమయంలో ప్రకటించారు. జిపిఎస్ ప్రవేశపెట్టడం ద్వారా కేవలం సిపిఎస్ రద్దుహామీ నెరవేర్చుకునేందుకు చేసినట్లుగా ఉంది. అనేక రాష్ట్రాలు పాతపెన్షన్ విధానాన్నే అమలు చేస్తున్నాయి.

-వాసిలి సురేష్, నెల్లూరుజిల్లా

### అవయవదాతలకు గౌరవం

అవయవదానం మహాదానం.మానవత్వంతో తోటి వారి ప్రాణాలు నిలబెట్టి మరణానంతరం కూడా జీవించి ఉండగలిగే గొప్ప కార్యం అవయవదానం. అవయవదాతలకు మరణానంతరం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో గౌరవప్రదమైనది. బ్రెయిన్‌డెత్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు,గుండె,పాంక్రియాస్, చిన్నపేగు అవసరమైనవ్యక్తులకుఅమర్చవచ్చు.అవయవదాతలు,వారి కుటుంబ సభ్యుల త్యాగాన్ని గుర్తించి అంత్యక్రియల విషయంలో స్టాలిన్ తీసుకున్న నిర్ణయం అవయవదాతలకు ప్రోత్సాహకరం.ఈ నిర్ణయంమరింతమంది అవయవదానం చేయడానికి ఉపకరిస్తుంది.

-చల్లాచంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

### ప్రభుత్వ వైఫల్యం

టీచర్లబదిలీలు పదోన్నతులు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, కొందరి స్వార్థం వెరసి ఎనిమిదేళ్ల తర్వాత నిర్వహిస్తున్న పదోన్నతులు రెండో మల్టీజోన్‌లో ముందుకు సాగడం లేదు. క్యాడర్ స్ట్రెంత్‌ను ఖాతరు చేయకుండా 31 జీవోను అధికారులు ఇష్టారాజ్యంగా అమలు చేశారని రంగారెడ్డిజిల్లాకు చెందిన ఉపాధ్యాయులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో టీచర్ల బదిలీలు, పదోన్నతులపై హైకోర్టు స్టే ఇచ్చింది. దీనిపై ప్రభుత్వం హైకోర్టు, డివిజన్ బెంచ్‌ను సంప్రదించి స్టేను తొలగించాల్సిందిపోయి ఎమ్‌జెడ్-1లోప్రమోషన్లు నిర్వహిస్తున్నారు. ఇలా మల్టీజోన్‌లు, జిల్లాలు, పోస్టులు వేటిపై వివాదం ఉంటే వాటిని పక్కకుపెట్టి మిగతావి నిర్వహించాలనే ప్రభుత్వ చర్య సరికాదు. ఈచర్య టీచర్లను విభజించి పాలించడమే అవుతుంది. పిటిషన్‌లకు గల అవకాశాలను పరిశీలించి బదలీలు, ప్రమోషన్లు సంపూర్తిగా జరిగేందుకు కృషి చేయాలి.

-శాగ శ్రీనివాస్, జనగామ జిల్లా

### కందకు లేని దురద..

లిక్కర్ స్కాంలో కల్వకుంట్ల కవిత, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరిని ఇ.డి.సంస్థల వారు అనేక మార్లు విచారించారు. ఆధారాలు దొరికితే వారిని ఏదో ఒకరోజు అరెస్టు చేస్తారు. రాజకీయాల్లో ఉన్న ప్రముఖుల కేసుల్లో ఇరుక్కోవడం, అరెస్టు అవడం తరువాత విడుదల అవటం జరుగుతుంటుంది. అలానే చంద్రబాబు నాయుడు కూడా అరెస్టుఅయ్యారు. చిన్నకోర్టు ఆయనకు శిక్ష విధించినా హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో వాదనలు జరిగి ఎలాగోలా ఆయన విడుదలై బయటకి వస్తారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# రసాయనరహిత వ్యవసాయమే జీవనాధారం

**మూడున్నర దశాబ్దాలుగా రసాయనాలతో అధిక పంటల వ్యవసాయ తతంగం ఇప్పుడు పతాకస్థాయికి చేరుకొని కొనసాగడం నేటి, రాబోయే తరాలకు ఒక పెద్ద శాపంగా పరిణమించింది. ఫర్టిలైజర్స్, ఇతర రసాయనాలు వాడకుంటే పంటలే పండవు అనే అత్యంత దుర్మార్గ ఆలోచన నేటి గ్రామస్థాయి అన్నిస్థాయిల రైతుల మెదట్లో పాతుకుపోయింది. లక్షల మంది రైతులు ఆత్మహత్యల పాలైనా అందుకు మూలకారణాన్ని బతికి ఉండి వ్యవసాయం కొనసాగిస్తున్న రైతులు ఆలోచించడంలేదు. తమ స్వయం తప్పిదాలను గుర్తించడంలేదు. పైగా ప్రభుత్వాలే మమ్మల్ని కాపాడుతాయనే పరాధీ నతలో సగటు రైతు కూరుకుపోయిండు. స్వతంత్ర ఆలోచన లేకుండా గుడ్డెద్దు చేల్లో బడి మేసినట్లు అధిక పెట్టుబడికి అలవాటుపడి అనేక పంటలు పండించే కల్చర్ వదిలి మోనో కల్చర్‌కు అలవాటుపడి కేవలం వరి, పత్తి చెరుకు మోనో కల్చర్ విషసం స్మృతిలో కొట్టుమిట్టాడుతున్నారు నేటి సగటు రైతులు. ఇప్పుడు 'వరి రైతుకు ఉరి' 'పత్తి మెడ మీద కత్తి' అని గ్రహించాల్సిన పరిస్థితి దాపురించింది.**

గడీల సుధాకర్‌రెడ్డి

మనిషి జీవితంలో అత్యంత ప్రధానమైనది ఆహారం. ఆ ఆహార పంటలకు మూలం వ్యవసాయం. వ్యవసాయంలో రసాయనాలు ఉపయోగించకుండా పండించిన ఆహార ధాన్యాలే మనిషి మనుగడకు మూలం. స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీరు, స్వచ్ఛమైన ఆహార పదార్థాలు లభించినప్పుడే మానవులు ఆరోగ్యంగా బతుకుతూ నిండు నూరేళ్లకాలం వెళ్లదీసే అవకాశం ఉంటుంది. ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ, ప్రైవేటీకరణ సంస్కరణల ప్రభావంతో మానవ సమాజం ధనమే సర్వస్వం అన్నట్లు వ్యవహారశైలిగా మారి ఆ ధన సంపాదన వ్యామోహంలో నిట్టనిలువునా కూరుకుపోయి, కూర్చున్న చెట్టుకొమ్మనే నరుక్కునే అత్యంత మూర్ఖవిధానాలను అన్ని విషయాల్లో అవలంబిస్తున్నాడు. విపరీతంగా విచ్చలవిడిగా ప్లాస్టిక్ పాలిథిన్ ఉత్పత్తులను వాడుతున్నాడు. భూమిని, వాతావరణాన్ని, నీటిని కాలుష్యమయం చేస్తున్నాడు. తినే ఆహార పంటలను వదలకుండా విచ్చలవిడిగా రసాయనాలు, ఫెర్టిలైజర్స్, పురుగు మందులు, కలుపు మందులు, గ్రోత్ ప్రమోటర్స్ మొదలగునవి ఉపయోగించి పండించడం మూలంగా ప్రజలు అనారోగ్యానికి గురవ్వడమే కాకుండా, రైతులు అధిక పెట్టుబడులతో అప్పులు పాలవుతూ సమాజాన్ని రోగగ్రస్తం చేస్తున్నారు. పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్నారు. మూడున్నర దశాబ్దాలుగా రసాయనాలతో అధిక పంటల వ్యవసాయ తతంగం ఇప్పుడు పతాకస్థాయికి చేరుకొని కొనసాగడం నేటి, రాబోయే తరాలకు ఒక పెద్ద శాపంగా పరిణమించింది. ఫర్టిలైజర్స్, ఇతర రసాయనాలు వాడకుంటే పంటలే పండవు అనే అత్యంత దుర్మార్గ ఆలోచన నేటి గ్రామస్థాయి అన్ని స్థాయిల రైతుల మెదట్లో పాతుకుపోయింది. లక్షల మంది రైతులు ఆత్మహత్యల పాలైనా అందుకు మూలకారణాన్ని బతికి ఉండి వ్యవసాయం కొనసాగిస్తున్న రైతులు ఆలోచించడం లేదు. తమ స్వయం తప్పిదాలను గుర్తించడం లేదు. పైగా ప్రభుత్వాలే మమ్మల్ని కాపాడుతాయనే పరాధీనతలో సగటు రైతు కూరుకుపోయిండు. స్వతంత్ర ఆలోచన లేకుండా గుడ్డెద్దు చేల్లో బడి మేసినట్లు అధిక పెట్టుబడికి అలవాటుపడి అనేక పంటలు పండించే కల్చర్ వదిలి మోనో కల్చర్‌కు అలవాటుపడి కేవలం వరి, పత్తి చెరుకు మోనో కల్చర్ విషసం స్మృతిలో కొట్టుమిట్టాడుతున్నారు నేటి సగటు రైతులు. ఇప్పుడు 'వరి రైతుకు ఉరి' 'పత్తి మెడ మీద కత్తి' అని గ్రహించాల్సిన పరిస్థితి దాపురించింది. అధిక పెట్టుబడుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు పంట భూములను, పరిసరాలను, ప్రకృతిని విషతుల్యం చేస్తూ వస్తున్నారు. ప్రజలకు అనారోగ్యాన్ని పంచుతున్నారు. ఇప్పుడు పంట భూముల్లో జీవం లేకుండా చేశారు. అంతా రసాయన విషమయమే. కనీసం నేల సారాన్ని ఇనుమడింప చేసే వానపాములను బతకనీయకుండా పాపాన్ని మూటగట్టుకుంటున్నారు ఆధునిక రైతులు. కేవలం ప్రభుత్వాలే రైతులను వ్యవసాయాన్ని బతికించలేవనే నగ్నసత్యాన్ని ఆధునిక రైతులు గుర్తించి



తమ వ్యవసాయాన్ని సమూలమార్పులతో లాభసాటిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అత్యావశ్యకత నేడు నెలకొంది. అధికపెట్టుబడికి కారణమవుతున్న హైబ్రిడ్ విత్తనాలను కొనడం మానేసి, అప్పుల పాలవడానికి ప్రధాన కారణమైన అన్ని రకాల రసాయనాలను కొనడం మానేసి స్థానిక విత్తనాలతో రసాయనరహిత వ్యవసాయం కొరకు ప్రతి రైతు ముందుకు రావాలి. నగరాల్లోని కొన్ని పట్టణాల్లోని మిద్దె తోటల పెంపకాన్ని ప్రతి పల్లె రైతులు చూసి నేర్చుకోవాలి. సేంద్రియ వ్యవసాయం అవశ్యకతను మిద్దె తోటల పెంపకం ఆధునిక అవసరాలకు సరిపోకున్నా పెంపకందారుల కుటుంబాలు మాత్రం ఆరోగ్యంలో ముందుంటారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇప్పుడు ఏ ఒక్క రైతు రసాయనాలతో కూడిన వ్యవసాయాన్ని చేయకూడదు. అలాంటి వ్యయసాయం పాపకార్యమని తలచి సేంద్రీయ వ్యవసాయం చేసి పాపవిముక్తులు కావాలి. తాము వ్యవసాయంలో స్వయం ప్రతిపత్తి సాధించడం ఖాయమని గ్రహించాలి. సేంద్రీయ వ్యవసాయమే చేవగల్ల వ్యవసాయము అని, తమకు సమాజానికి మేలు చేసే వ్యవసాయం అని అదే అసలు సిసలు అయిన ఆరోగ్యకర వ్యవసాయం అనే అవగాహనతో ముందుకెళ్లాల్సిన తరుణం ఇది. ఎన్నోరకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల చెట్లు, ఔషధ మొక్కలు, చిరుధాన్యాలు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, పండించడం వ్యవసాయానికి అనుబంధం కావాలి. చిన్న,సన్నకారు రైతులు ఒక ఎకరం నుండి ఐదు ఎకరాల వ్యవసాయ భూములున్న అనుబంధంగా ఉన్నవారు సమూహాలుగా, సహకార బృందాలుగా గ్రామగ్రామాన ఏర్పడి మోనో కల్చర్ వదిలి బహుళ పంటల వ్యవసాయానికి నాంది పలికితేనే రైతులు అప్పుల బంధవిముక్తులై తామే అప్పులిచ్చే స్థితికి ఎదగొచ్చు. తమ వ్యవసాయానికి అనుబంధంగా కోళ్లు, గొర్రెలు, మేకలు, బర్రెలు, చేపల పెంపకం చేపడితే సరిసంపదలు రైతుల వశమవుతాయి. ప్రతీరైతు సముదాయం ఒక మినీ సూపర్ మార్కెట్ అవుతుంది. ప్రజాసమూహాలు ఆరోగ్యంగా ఉంటాయి. పర్యావరణం కాలుష్యనియంత్రణలో ఉంటుంది. అనేక లాభాలు సేంద్రీయ వ్యవసాయం ద్వారా కలుగుతాయి. కావాల్సింది రైతుల్లో సమష్టికృషి, సహకార భావన, ఐకమత్యభావన మూడున్నర దశాబ్దాల క్రితపు గతకాల వ్యవసాయ వైభవాన్ని గుర్తు చేసుకొని ఈతచెట్లు, తాటిచెట్లు పెంచుతూ నీరా తాగుతూ సమాజానికి తాగిస్తే, మద్యపాన బంధవిముక్తి కలిగిస్తే పల్లెలన్నీ ఆరోగ్యంగా ఆహ్లాదంగా జీవనం కొనసాగిస్తూ దేశ అభివృద్ధికి తోడ్పడతాయి. అరటి, అల్లనేరెడు, నేరేడు, జీడి, సపోటా, జామ, నిమ్మ, దానిమ్మ, సంత్ర, కొబ్బరి, మునగ, బొప్పాయి. చింత, మామిడి, వెలగ, సీతాఫలం, రామసీతాఫలం, లక్ష్మణఫలం మొదలగు సవాలక్ష పండ్ల చెట్లతోపాటు తీగజాతి, ఇతర అనిరకాల కూరగాయలు, ఆకు కూరలు, దుంపకూరలు పండించడం వలన రైతు ఆదాయానికి కొదువ ఉండదు. కావాల్సింది రైతులకు సమూహాలుగా ఏర్పడాలనే చిత్తశుద్ధి, కలిసి ఐకమత్యంగా పనిచేయడం అనే పట్టుదల. రసాయనాలు ఉపయోగిస్తేనే పంటలు పండుతాయి అనే పరమ చెత్త మూర్ఖపు ఆలోచనకు స్వస్తిపలకాలి. ఆకులలములు, చెర్లమట్టి, కుంటమట్టి, ఒర్రెలమట్టి, పశువులపేడ, గొర్రెరువు, కోడెరువు అసలు సిసలైన ఎరువులని గ్రహించి అనవసర పెట్టుబడుల బరువుకు దూరం కావాలి. సేంద్రీయ వ్యవసాయమే అన్ని విధాలా శ్రేయస్కరం. అది లేకుంటే మానవ జాతి అధోగతి. ●

# 'నారీశక్తి వందన్' మహిళలకు ముందడుగు



పరిమి శ్యామలా రాధాకృష్ణ

అభివృద్ధికి మారుపేరైన అమెరికాలో స్త్రీలు ఓటు హక్కును సంతరించుకోవడానికి 144 సంవత్సరాలు పట్టిందట! ఆ విషయానికొస్తే మన భారత మహిళలకు అనేక ప్రపంచ దేశాలలో కన్నా ముందే ప్రభుత్వం ఓటుహక్కుపై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినందుకు స్త్రీలు గర్వపడాలి. అలనాడు భారతీయ, బ్రిటిష్ ఉభయులూ కాలోనియాల్ శాసన సభ్యులు ప్రాంఛైజీని విస్తరించాలన్న ప్రతిపాదనలను ప్రతిఘటించారట. వారు ఓటు వ్యతిరేకులు. డాక్టర్ ఫోర్బ్స్ ప్రకారం ' ప్రజా వ్యవహారాల్లో మహిళలన్యూనత, అసమర్థత గురించి మాట్లాడారు. స్త్రీలకు ఓటు వేయడం వల్ల భర్తలు, బిడ్డలను నిర్లక్ష్యం చేస్తారని కొందరు అభిప్రాయపడ్డారట. 1935 నాటికి వయోజన జనాభాలో ఐదవ వంతు మంది మహిళలకు ఓటు హక్కు విస్తరించారట. ఆస్తిగల స్త్రీ, వితంతువు, జవాను భార్య ఇలా కొందరే ఓటు హక్కుదార్లు. ఓటు హక్కు మాట అటుంచి యుఎన్ నివేదిక భారతదేశానికి 148వ ర్యాంకు ఇచ్చినది. 542 సభ్యుల దిగువ సభలో 64 స్థానాల్లో మాత్రమే ఉన్నారు. ఓటు హక్కు మాట అటుంచి ఇంతటి అధునాతన పార్లమెంటు భవన ప్రారంభానికి, ప్రథమ పౌరురాలు ముర్ముగార్ని మరిచిపోయారంటే అది ప్రొటోకాల్ సహించదు సుమా! దాంపత్యవ్యాకరణం! అంటూ అంతుపట్టని కొందరు వ్యాఖ్యలు. కుటుంబ పొదరిల్లుకు మహిళ భావాల హరివిల్లు! అమ్మప్రేమ ముందు కొండకూడా చిన్నదైనది. ప్రేమకు పెన్నిధి అమ్మ. ఆ అమ్మకూడా మహిళేగా! ఆమెకు బ్రహ్మరథం పట్టమనికాదు. ఆమెకు ఉచిత స్థానం, సాధికారత ప్రేమాభిమానాలు, బాల్యాన్ని, జీవితాన్ని కోల్పోతున్న చిన్నారి బాలికల ఉద్ధరణకు బాలికా బచావో చేయూతనివ్వండి! ఈ బాలికలే రేపటి భారతమాతకు ముద్దు మహిళలుకాదా? వారిని మహిళలుగా ఎదగనివ్వండి. అన్ని రంగాల్లో వారికందించిన చిరురిజర్వేషన్ ద్వారా అన్నిరంగాల్లో మేధావులుగా, సృజన నైపుణ్యాలతో వారు మెరికలవ్వనీయండి. దేశాభ్యుదయానికి ముఖ్యంగా గ్రామీణ మహిళాభ్యుదయానికి పురుషులుగా మీ వంతు మీరు అన్నయ్యలుగా, స్వార్థరహితులుగా నిలబడండి. సమిష్టి కృషే సంజీవని.కాదా? సమతా, సౌభ్రాతృత్వం, సమతుల్యత, సహనం, సత్‌తత్వం, పరతత్వాలను కమ్మివేయక మీలోని సంకుచితపొరలను ఇన్ని దశాబ్దాల తరువాత అయినా మీ మహిళా లోకానికి సహృదయంతో అవకాశమివ్వాలి. తొలిసారిగా బిల్లును 1927లో పెట్టారు. అటల్‌బిహారీ వాజ్‌పేయిగారి రోజుల్లో ఈ రిజర్వేషన్ బిల్లు ప్రయత్నాలు జరిగి కలగా కాలంతో కల్లలైపోయింది. మోడీగారు ఈ కాల సాకారరూప కల్పనకు, మహిళాలోకానికి అధికారం కల్పించే పనికి తనను ఒక పనిముట్టుగా భగవంతుడు వాడుకున్నాడా అన్నట్లు తమ ప్రభుత్వం హుందా అడుగు ముందుకు వేసిన చారిత్రాత్మక క్షణం నూతన పార్లమెంటు భవనంలో అదికూడా ప్రథమ కార్యక్రమంగా భారతావని నారీమణుల కోసం సరికొత్త ద్వారం తెరుస్తూ మేము నారీశక్తివందన్ అధినియం ద్వారా మనదేశం ప్రజాస్వామ్యమని మరొక్కసారి ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత తమకు దక్కిందని మోడీగారు అన్నారంటే అతిశయోక్తికాదు. ఏకగ్రీవ ఆమోదానికి మహిళల మంతా పురుషసమాజానికి అభివందనాలు. అలనాడే ఈ బిల్లును ప్రవేశపెట్టి తమ సోదరీమణులకు సాధికారితనిచ్చి, రెండు చక్రాలు లేనిదే బండి సవ్యతగా సాఫీగా నడవడానికి అనుకూలం కాదని ఆనాడే మహిళల ప్రాతినిధ్యానికి తమవంతు ప్రయత్నించిన కీర్తిశేషులు, పివి నరసింహారావు, రాజీవ్‌గాంధీ గార్లకు నివాళులు. దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ మహిళ రిజర్వేషన్ బిల్లు గురించి మంచి ప్రోత్సాహకమైన అహంకార రహితంగా మంచి ఆలోచనలతో సరైన అవగాహనతో సామాన్య ప్రజానీకానికి ఉపయుక్తమయ్యేలా ప్రతిపాదనలు చేసినప్పుడు, మంచిని ఆయా రాష్ట్రాలను అనుకరించడం అందరికి, దేశానికి ముఖ్యంగా ఇంతటి మేలు వరాన్ని మహిళలకు అందించినప్పుడు ఎన్నికల సీజన్ అన్నట్లు కాకుండా సోదరసోదరీమణులం భారతీయులం అని లక్ష్యంగా మనవంతు మచ్చలేని మకుటాయమాన సేవలలో జీవం ఉండేలా, మనమేది చేసినా ఏదో పొందాలనే ఉద్దేశ్యంతోకాక, హృదయపూర్వకంగా సంకల్ప బలంతో వైఫల్యాలకు కృశించక, నీరసించక, మన పురుష ప్రపంచం మనకు చేదోడువాదోడుగా వెంటనడవగా సమిష్టిశక్తి దేశశాంతి, సమైఖ్యతలకేగాక, విశ్వశాంతికి అని ముందుకు సాగాలి. ●

# దేశ ప్రగతికి ఊతమివ్వనున్న సెమీకండక్టర్స్ పరిశ్రమ



యేచన్ చంద్రశేఖర్

నాటి ఆది మానవుని నుండి నేటి ఆధునిక మానవుని వరకు ఎడతెరిపి లేకుండా తన మేధస్సుకు పదును పెడుతూ, ఒకనాడు అసాధ్యమనుకున్న దానిని సుసాధ్యం చేస్తూ నూతన ఆవిష్కరణలను సృష్టిస్తూనే ఉన్నాడు. మానవుని ఈ నిర్విరామ కృషి ఫలితంగానే 1940వ దశకంలో ఎలక్ట్రానిక్స్ శకానికి అంకురార్పణ జరిగిందనుకోవచ్చు. ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగాన్ని విస్తరించేందుకు విశేషమైన సంభావ్యత కలిగిన కొత్త పరికరాల శ్రేణిలో మొదటిది అనదగ్గ ట్రాన్సిస్టర్స్‌ను 1947లో జాన్ బార్డీన్ ఇతర పరిశోధనా సిబ్బందికి చెందిన విలియం బి. షాక్లీలు కొనుగొన్నారు. ట్రాన్సిస్టర్‌లు, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌ల వంటి తదుపరి పరిణామాలతోపాటు స్ఫటికాకార ఘన పదార్థాలతో రూపుదిద్దుకునే సెమీకండక్టర్స్ అందుబాటులోకి వచ్చాయి. నిరంతర పరిశోధనలతో ఈ రంగం కొత్త పుంతలు తొక్కుతూ 1980 మధ్య నాటికి చవకైన మైక్రో ప్రాసెసర్‌లకు తెరలేపడంతో ప్రోగ్రామబుల్ మైక్రోవేవ్ ఓవెన్‌లు, థర్మోస్టాట్‌లు, వాషింగ్ మెషిన్లు, డ్రైయర్‌లు, సెల్ఫ్‌ట్యూనింగ్ టెలివిజన్లు, సెల్ఫ్‌ఫోకస్ కెమెరాలు, వీసిఆర్‌లు, వీడియోగేమ్‌లు, టెలిఫోన్లు, ఆన్సరింగ్ మెషీన్లు, సంగీత వాయిద్యాలు, గడియారాలు, భద్రతా వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయి. అంతేకాక వాణిజ్యం, పరిశ్రమలు, ప్రభుత్వ, ఇతర రంగాల్లో కూడా మైక్రోఎలక్ట్రానిక్స్‌ల ప్రవేశంతో రిటైల్ స్టోర్‌లలో ఆటోమేటిక్ టెల్లర్ మెషీన్‌లు, పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్స్ నుండి ఆటోమేటెడ్ ఫ్యాక్టరీ అసెంబ్లీ సిస్టమ్స్, ఆఫీస్ వర్క్‌స్టేషన్ల వరకు మైక్రోప్రాసెసర్ ఆధారిత పరికరాలు విస్తరించాయి. గత 50ఏళ్లలో సెమీకండక్టర్ టెక్నాలజీతో జరిగిన పరిణామాలు ఎలక్ట్రానిక్ పరికరాలను సూక్ష్మంగా, వేగంగా, మరింత విశ్వసనీయంగా మార్చాయి.ప్రపంచవ్యాప్తంగా నేడు మన పాలపుంతలో ఉన్న నక్షత్రాల సంఖ్యకుసమానంగా ఉంటే దాదాపు 100 బిలియన్ల ఇంటిగ్రేటెడ్ డిజైన్‌పై దృష్టి సారించే కంపెనీలను 'కల్పిత' అని, తయారీపై దృష్టి సారించే కంపెనీలను 'ఫౌండ్రీస్' అని అలాకాక రెండు కార్యకలాపాలను నిర్వహించే సంస్థలను ఇంటిగ్రేటెడ్ డివైస్ మ్యానుఫ్యాక్చరర్స్ లేదా ఐఎమ్‌డిలు అని అంటారు. సెమీకండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్, ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్‌లు సంయుక్తంగా చేపట్టిన ఒకఅధ్యయనం ప్రకారం దేశీయంగా 67వేలమంది కాకుండా విస్తృత అమెరికా ఆర్థిక వ్యవస్థను పరిగణనలోనికి తీసుకుని 2030నాటికి 1.4 మిలియన్ల సెమీకండక్టర్స్ నిపుణులు, కంప్యూటర్ శాస్త్రజ్ఞులు, ఇతర ఇంజినీర్ల కొరత ఏర్పడనున్నట్లు అంచనా వేసింది.ఇండీడ్ జాబ్‌పోర్టల్ సమాచారం ప్రకారం 2019-2023 మధ్యకాలంలో దేశంలో ఈ రంగంలో ఏడు శాతం ఉద్యోగావకాశాలు పెరిగినట్లు తెలిసింది. ప్రత్యేకించి ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కెమికల్, మెటీరియల్స్ ఇంజినీరింగ్ పట్టభద్రులకు సెమీకండక్టర్స్‌లో డిమాండ్ ఉంటుంది.స్టాటిస్టా అంచనా ప్రకారం భారత్‌నుండి ప్రతి సంవత్సరం దాదాపు 25లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సులలో తమ పేర్లనమోదు చేసుకుం



టుండగా ప్రపంచవ్యాప్తంగా ఇంజినీరింగ్‌పట్టా అందుకుంటున్న వారిలో దాదాపు 25 శాతం భారతీయులు కావడం విశేషం. ఈ ప్రత్యేకతను అవకాశంగా మలచుకుని మన ఇంజినీర్లకు పరిశ్రమలో సుశిక్షితులైన నిపుణులతో శిక్షణ అందించగలిగితే ప్రతిభావంతులైన ఇంజినీర్లు ఉద్భవించి తమ నైపుణ్యంతో ఈ కొరతను తీర్చవచ్చు. సెమీకండక్టర్స్ లేదా చిప్స్ తయారీలో డిజైనింగ్, టెస్టింగ్, ప్యాకేజింగ్ వరకు ప్రతిదశలోనూ అత్యంత నైపుణ్యం గల వ్యక్తులు అవసరం. చిప్స్ డిజైనింగ్ పరిశ్రమ నిపుణుల అంచనా ప్రకారం భారత దేశంలోప్రస్తుతం చిప్ డిజైనింగ్, డెవలప్‌మెంట్ విభాగాలలో దాదాపు లక్షా ఇరవైఐదువేల బ్యాచిలర్స్, మాస్టర్స్ లేదా పిహెచ్‌డి పూర్తి చేసిన ఇంజినీర్లు పనిచేస్తున్నారు. సాధారణంగా డిజైనింగ్ కార్యకలాపాలు నిర్వహించే సంస్థల్లో పనిచేయడానికి ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ లేదా ఎలక్ట్రానిక్స్‌లో బిటెక్, విఎల్‌ఎస్ఐ డిజైన్‌లో ఎంటెక్ లేదా సెమీకండక్టర్ టెక్నాలజీ, మెటీరియల్స్ సైన్స్ లేదా కెమికల్ ఇంజినీరింగ్‌లో పిహెచ్‌డి వాంఛనీయం. ఈ రంగంలో పనిచేసే వ్యక్తులు విభిన్న సాంకేతికతలకు సంబంధించిన అంశాలపై విధులు నిర్వర్తించవలసి ఉండడంతో కేవలం ఏదో ఒకకోర్సు పూర్తిచేసి నెట్టుకురావాలంటే సాధ్యమయ్యే పనికాదు. బిటెక్ లేదా ఎంటెక్‌స్థాయిలో ఏర్పడిన ప్రాథమిక అవగాహనతో ఉద్యోగ నిర్వహణతోపాటు అనుభవం గడిస్తూ కాలానుగుణంగా తమ నైపుణ్యానికి మెరుగులుదిద్దుకోవాల్సి ఉంటుందని స్వతంత్ర సెమీకండక్టర్ల అభిప్రాయం. వేగంగామారుతున్న అవసరాలకు అనుగుణంగా నిపుణులు అందుబాటులో లేకపోవడంతో ఈ రంగంలోని సంస్థలు మేధో వలసను అరికట్టడంతోపాటు తమ ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపర్చడానికి శిక్షణార్థంభారీ మొత్తాన్ని వెచ్చిస్తుంటాయి. అమెరికాలోని ఒకప్రముఖ సెమీకండక్టర్ సంస్థ, తమ సంస్థలోని వందలాదిమంది ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడం కోసం ప్రతియేటా 1.40 మిలియన్ డాలర్ల విద్యాసహాయాన్ని అందిస్తుంది. భారత్‌లో పరిశోధన, అభివృద్ధిని విస్తరించడానికి అమెరికాకుచెందిన మైక్రోచిప్ టెక్నాలజీ ఇన్కార్పొరేటెడ్ సుమారు 300 మిలియన్ డాలర్లు, అడ్వాన్స్ మైక్రో డివైజ్ వచ్చే ఐదేళ్లలో 400 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నాయి. కనీసం పది మిలియన్ డాలర్ల ప్రారంభపెట్టుబడితో 'ఇండియా యుఎస్ గ్లోబల్ ఛాలెంజెస్ ఇన్స్టిట్యూట్' ఏర్పాటు కోసం కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్‌టెక్నాలజీ, అసోసియేషన్ ఆఫ్ అమెరికన్ యూనివర్సిటీస్‌ల మధ్యకుదిరిన అవగాహన ఒప్పందాన్ని వారు స్వాగతించారు.దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్‌పూర్తి చేసుకుంటున్న దాదాపు25లక్షల మందికిగాను కేవలం మూడులక్షలమందికి మాత్రమే అధికజీతాలు గల ఉద్యోగాలు లభిస్తున్నతరుణంలో దేశంలో సెమీకండక్టర్ పరిశ్రమకు ఇతోధికంగా ప్రోత్సాహాలు అందించి, ప్రత్యేకించి ప్రతియేటా ఇంజినీరింగ్ పట్టాపుచ్చుకుంటున్న లక్షలాది మందికి ఉపాధికల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం యూనివర్సిటీలు కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నాయి.వచ్చే రెండునుండి ఐదుసంవత్సరాలలో డిజైన్, తయారీ,శిక్షణ,నైపుణ్యం, సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ కెమికల్స్ అండ్‌మెటీరియల్స్ ఇంజినీరింగ్, ప్యాకేజింగ్, టెస్టింగ్‌లకు సంబంధించిన పెద్ద సంఖ్యలో ఉద్యోగావకాశాలు ఏర్పడనుండడంతో మనదేశం ఈరంగంలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా విద్యార్థులకు ప్రణాళికబద్ధమైనశిక్షణ అందించగలిగితే ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమకు నిపుణులైన మానవ వనరులను అందించి తన ఆధిపత్యాన్ని చాటుకోవడంతోపాటు రోజురోజుకు పెచ్చుమీరుతున్న నిరుద్యోగ సమస్యను కూడా అధిగమించవచ్చు. అయితే భారత్‌లో ఈ సాంకేతికపరమైన అంశాలను బోధించే అధ్యాపకులకు పరిశ్రమలో పనిచేసిన ప్రత్యక్షఅనుభవం లేకపోవడం ప్రతికూలాంశమని పరిశ్రమప్రముఖుల అభిప్రాయం. అందుచేత ఈ డొమైన్‌లో బోధించే అధ్యాపకులకు యుద్ధప్రాతిపదికన విస్తృతమైన అవగాహన కల్పించి వారిని సుశిక్షితులుగా తీర్చిదిద్దడం తక్షణ కర్తవ్యమే కాక పెను సవాలు కూడా. ●

# బీహార్‌లో దారుణ ఘటన

## మహిళను వివస్త్రను చేసి నోట్లో మూత్రం పోయించిన వ్యక్తి



**పాట్నా, సెప్టెంబరు 25:** తీసుకున్న అప్పు తిరిగి చెల్లించినా అదనపు వడ్డీ ఇవ్వ లేదని దళిత మహిళపై ఓ వ్యక్తి అత్యంత అమానవీయంగా ప్రవర్తించాడు. ఆమెను వివస్త్రను చేసి దాడి చేశాడు. ఆమె నోట్లో మూత్రం పోయించాడు. ఈ అమానుష ఘటన బీహార్ రాజధాని పాట్నాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పాట్నా జిల్లా మోసిమ్‌పూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త స్థానికంగా పలుకుబడి ఉన్న ప్రమోద్‌సింగ్ వద్ద కొన్ని నెలల క్రితం రూ.1500 అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బును వడ్డీతో సహా తిరిగి చెల్లించినా అదనపు వడ్డీ ఇవ్వాల్సిందేనని ప్రమోద్‌సింగ్ డిమాండ్ చేశాడు. అందుకు వారు అంగీ కరించలేదు. దీంతో ఆ దంపతులపై కోపం పెంచుకున్న ప్రమోద్ గతవారం సదరు మహిళకు ఫోన్ చేసి బెదిరించాడు. అదనపు వడ్డీ ఇవ్వకపోతే గ్రామంలో నగ్నంగాఊరేగిస్తానని బెదిరించాడు.దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రమోద్ అతడి అనుచరులతో కలిసి మహిళ ఇంటికి వెళ్లాడు. ఆమెను బలవంతంగా తన ఇంటికి తీసుకెళ్లి ఆమెపై దాడి చేశాడు. మహిళను వివస్త్రను చేసి కర్రలతో కొట్టించాడు. అక్కడితో ఆగకుండా తన కుమారుడితో మహిళ నోట్లో మూత్రం పోయించాడు. అక్కడినుంచి తప్పించుకున్న బాధిత మహిళ మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రధాన నిందితులైన ప్రమోద్‌సింగ్, అతడి కుమారుడు పరారీలో ఉన్నారని,వారి కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు. బాధిత మహిళ ప్రస్తుతం గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని పోలీసులు వెల్లడించారు.



# 'జీతం తీసుకోని మీరు..రోజుకు అన్ని లక్షలు ఎలా ఖర్చు చేశారు'

## మమత స్పెయిన్ పర్యటనపై కాంగ్రెస్

**కోల్‌కతా, సెప్టెంబరు 25:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పెయిన్ పర్యటనపై ఆ రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి విమర్శలు గుప్పించారు. ముర్షిదాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో డెంగీ కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, అయినా సిఎం ప్రజల సమస్యను అర్థంచేసుకోలేకపోతున్నారని అధిర్ ఆరోపించారు. 'అక్టోబరు, నవంబరు నెలల్లో డెంగీ కేసులు పెరిగే అవకాశం ఉంటుందని మేం ముందుగానే ప్రభుత్వాన్ని హెచ్చరించాం. అయినా ప్రభుత్వం ప్రజల పట్ల నిర్లక్ష్యం వహిస్తోంది. ఒకవైపు ప్రజలు డెంగీ, నిరుద్యోగ సమస్యలతో బాధపడుతుంటే, మరోవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి స్పెయిన్ పర్యటనకు వెళ్లారు. ప్రజల సమస్యను ఆమె అర్థం చేసుకోలేకపోతున్నారు' అని విమర్శించారు. 'మమత బెనర్జీ జీతం తీసుకోరని మేం విన్నాం. మరి మాడ్రిడ్‌లో ఉన్న విలాసవంతమైన హోటల్‌లో రోజుకు రూ.మూడు లక్షలు ఖర్చు చేశారు. మీకు ఇది ఎలా సాధ్యమైంది? ఈ పర్యటనపై ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేశారో తెలపండి? ఈ పర్యటన ఫలితంగా పెట్టుబడి పెట్టేందుకు ఒక్క పారిశ్రామికవేత్తనైనా రాష్ట్రానికి తీసుకువచ్చారా?' అని అధిర్ ప్రశ్నించారు.

## తొలిసారి ఓటు వేయనున్న 93 యేళ్ల వృద్ధుడు..



**రాయ్‌పూర్, సెప్టెంబరు 25:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో ఛత్తీస్ గఢ్‌లో అరుదైన పరిణామం చోటు చేసుకుంది. నక్సల్ ప్రభావిత జిల్లా కాంకర్‌లోని భైంసాకన్హర్ గ్రామంలో 93 యేళ్ల వృద్ధుడు తొలిసారి తన ఓటును నమోదు చేసు కున్నారు. దాంతో ఆయన త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అర్హులై ఉండి, ఓటర్ల జాబితాలో లేని వారిని చేర్చేందుకు జిల్లాయంత్రాంగం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో భాగంగా 93యేళ్ల షేర్ సింగ్ హెడ్కో ఇంటికి అధికారులు వెళ్లారు. ఇంతవరకు ఆయనకు ఓటు హక్కులేదని తెలుసుకొని ఆశ్చర్యపోయారు. ఓటు హక్కు కోసం సింగ్ సమ ర్పించిన పత్రాల్లోని లోపాల వల్లే ఇంతకాలం ఆయన పేరు చేరలేదని తెలుస్తోంది. ప్రస్తుతం అన్ని ప్రక్రియలు పూర్తిచేసి, ఆయన పేరు చేర్చారు. ఈ విషయం తెలిసిన తర్వాత నుంచి హెడ్కో ఓటు వేసేందుకు ఉత్సాహంగా ఉన్నారని కుటుంబ సభ్యు లు తెలిపారు. అయితే ఆయన వయసురీత్యా సరిగా మాట్లాడలేకపోతున్నారని చెప్పారు. అలాగే ఇతర జిల్లాలైన అంతాగఢ్, భానుప్రతాపూర్ జిల్లాలోని పలువురు వృద్ధుల పేర్లను కూడా తాజాగా జాబితాలోచేర్చారు.దీనిపై ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ కాంకర్ జిల్లాకలెక్టర్ ప్రియాంకాశుక్లా అభినందించారు.ఇది చెప్పుకోదగ్గ పరిణామమని వ్యాఖ్యానించారు.


## ఘోర రోడ్డు ప్రమాదం..ఐదుగురి మృతి




**భోపాల్, సెప్టెంబరు 25:** మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వెళ్తోన్న ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సోమవారం తెల్లవారుజామున ఉమారియా జిల్లాలోని ఘున్‌ఘటి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో విషయం తెలు సుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసు కున్నారు. అనంతరం దర్యాప్తు ప్రారంభించారు. మృతులంతా ప్రభుత్వ ఉద్యోగులే అని గుర్తించారు. అందరూ పుట్టినరోజు వేడుకకు కారులో వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగిందని నిర్ధారించారు. ఈ ప్రమాదంలో వారు ప్రయాణిస్తున్న కారు నుజ్జునుజ్జైందని తెలిపారు.

## వాట్సాప్ ఛానెల్‌కు 50 లక్షల మంది ఫాలోయర్లు

# ప్రత్యేక మెసేజ్ పోస్టు చేసిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఇటీవలే చానెల్ పేరుతో కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. రాజకీయ నాయకుల నుంచి సెలబ్రిటీల వరకు, వ్యాపార సంస్థల నుంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెల్స్ వరకు ప్రతి ఒక్కరు తమకు సంబంధించిన అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు ఫాలోవర్స్‌తో ఛానెల్ ద్వారా షేర్ చేసుకోవచ్చు. ఈ ఫీచర్ పరిచయం చేసిన కొద్ది రోజుల్లోనే దీన్ని ఉపయోగించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రధాని మోడీ కూడా ఇటీవలె వాట్సాప్ ఛానెల్‌లో ఖాతాను ప్రారంభించారు. కొద్దిరోజుల్లోనే ఆయ న్ను 50 లక్షల మంది అనుసరించడం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధా ని ప్రత్యేక మెసేజ్‌ను పోస్ట్ చేశారు. వాట్సాప్ ఛానెల్‌తో మీరంతా నాతో అనుసంధానమైనందుకు ఎంతో గొప్పగా భావిస్తున్నాను. నిరంతరం మీరు అందిస్తున్న మద్దతుకు కృతజ్ఞతలు. ఈ మాధ్యమం ద్వారా మన సంభాషణలు కొనసాగిస్తున్నందుకు ఆనందంగా ఉంది. భవిష్యత్తులో మరిన్ని అంశాల గురించి మనం మాట్లాడుకుందాం అని ప్రధాని మోడీ వాట్సాప్ ఛానెల్‌లో మెసేజ్‌ను పోస్ట్ చేశారు. మరోవైపు పలువురు సెలబ్రిటీలు సైతం వాట్సాప్ ఛానెల్‌లో ఖాతాలను ప్రారంభించారు. బాలీవుడ్ నటి కత్రినాకైఫ్‌ను 1.3 కోట్ల మంది అనుసరిస్తుండగా, 60 లక్షల మంది ఫాలోవర్లతో అక్షయ్ కుమార్ రెండో స్థానంలో ఉన్నారు. ఇండియన్ క్రికెట్ టీమ్‌ను 80 లక్షల మంది, స్టార్స్ స్పోర్ట్స్‌ను 50 లక్షల మంది అనుసరిస్తున్నారు.

# యుపిలో విద్యార్థిపై చెంపదెబ్బలు

## సీనియర్ ఐపిఎస్ అధికారితో దర్యాప్తునకు ఆదేశించిన 'సుప్రీం'



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** ఉత్తరప్రదేశ్‌లో ఓ ఉపాధ్యాయురాలు మతపరమైన వ్యాఖ్యలతోపాటు తోటి విద్యార్థులతో మరో వర్గానికి చెందని విద్యార్థికి చెంప దెబ్బలు కొట్టించిన ఘటన ఇటీవల తీవ్ర దుమారం రేపిన విషయం విది తమే. ఈఘటనపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. దీనిపై సోమవారం విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ కేసులో యుపి పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుబట్టింది. ఆ ఘటనపై సీనియర్ ఐపిఎస్ అధికారి నేతృత్వంలో దర్యాప్తు జరిపించాలని ఆదేశించింది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా ఖుబ్బాపుర్ గ్రామంలో గత నెల ఓ స్కూల్‌లో ఉపాధ్యాయురాలు రెండో తరగతి విద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించారు. హోంవర్క్ చేయకపోవడంతో ఆ విద్యార్థికి తోటి విద్యార్థులతో చెంపదెబ్బలు కొట్టించారు. మతపరమైన వ్యాఖ్యలుచేశారు. ఈ ఘటనకు సంబంధించిన విడియో వైరల్ కావడంతో ఇది కాస్తా తీవ్ర వివాదాస్పదమైంది. దీంతో ముజఫర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు ఈ ఘటనపై సుప్రీం కోర్టులో కేసు నమోదైంది. దీనిపై తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం, యుపి ప్రభుత్వం, రాష్ట్ర పోలీసులపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఈ ఆరోపణలు నిజమైతే, ఓ టీచర్ విధించిన అత్యంత దారుణమైన పనిష్‌మెంట్ ఇదే అవుతుంది. ఇది చాలా తీవ్రమైన కేసు, ఆందోళకరం. రాష్ట్ర మనస్సాక్షిని కదిలించాలి. టీచర్ ఓవర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రవర్తించారు. విద్యార్థులకు బోధించాల్సింది ఇలాగేనా? నాణ్యమైన విద్యను అందించడం ఇదేనా? దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి' అని ధర్మసనం వ్యాఖ్యా నించింది. ఇక ఈ కేసులో నమోదైన ఎఫ్‌ఐఆర్‌లోనూ లోపాలు ఉన్నట్లు సుప్రీంకోర్టు గుర్తించింది.' బాధిత విద్యార్థి తండ్రి చేసిన ఆరోపణలను ఎఫ్‌ఐఆర్‌లో నమోదు చేయలేదు. కేసు నమోదు కూడా ఆలస్యంగా జరిగింది' అని న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. దీనిపై దర్యాప్తునకు సీనియర్ ఐపిఎస్ అధికారిని నియమించాలని యుపి ప్రభుత్వాన్ని ఆదేశం చింది. ఇక బాధిత విద్యార్థి చదువు బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వమే చూసు కోవాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా బాధిత విద్యార్థి, అతడిని చెంప దెబ్బలు కొట్టిన పిల్లలకు కౌన్సెలింగ్ ఇప్పించి ఆ నివేదికను సమర్పించాలని సూచించింది. అనంతరం ఈ కేసు విచారణను అక్టోబరు 30వ తేదీకి వాయిదా వేసింది. ఈ ఘటనపై సదరు ఉపాధ్యాయురాలు తొలుత స్పం దిస్తూ ఇందుకు తానేం సిగ్గుపడడం లేదని చెప్పడం విశేషం. ఆ తర్వాత తన తప్పును అంగీకరించిన ఆమె, తాను దివ్యాంగురాలినని, అసైన్‌మెంట్ పూర్తి చేయకపోవడంతో విద్యార్థి వద్దకు తాను వెళ్లలేక విద్యార్థులతో చెంపదెబ్బ వేయించానని పేర్కొన్నారు. అయితే ఏ మతాన్ని ఉద్దేశిస్తూ తాను వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు.

# మంచి చేయాలంటే రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం లేదు

## కేంద్రమంత్రి సింధియా కుమారుడు మహానార్యమన్ సింధియా



**భోపాల్, సెప్టెంబరు 25:** మంచి పనులు చేయాలంటే రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం లేదంటూ కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య కుమారుడు మహా నార్యమన్ సింధియా రాజకీయ ప్రవేశంపై తాజాగా స్పందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక వ్యక్తి సమాజంలో మార్పులను ఖచ్చితంగా తీసుకురాగలడు అందుకు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం లేదు. మహా త్మాగాంధీ భారత్, దక్షిణాఫ్రికాలో రాజకీయేతర విప్లవాన్ని ఒంటరిగానే ప్రారంభించారు. కొన్ని సందర్భాల్లో సమాజంలో మార్పులు తీసుకురావా లంటే రాజకీయాలు ఒక మాధ్యమైనప్పటికీ మంచి పనులు చేయాలంటే దానికి రాజకీయాలను ఎంచుకోవాల్సిన అవసరంలేదు. ప్రస్తుతం రాజకీ యాల్లోకి వచ్చే ఆలోచన లేదు. మధ్యప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కావాలని మా తండ్రి మద్దతుదారులు ఆశిస్తున్నారు. ఆశాభావంతో ఉండటం ప్రతి ఒక్కరి హక్కు.అయితే ఈ రాజకీయ అం శాలపై చర్చించడానికి ఇష్టపడను. ప్రస్తుతం నాకు ఆసక్తి ఉన్న పనిపైనే దృష్టిపెడు తున్నాను అని అన్నారు. గ్వాలియర్ డివిజన్ క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, మధ్యప్రదేశ్‌క్రికెట్ అసోసి యేషన్ సభ్యుడిగా మహానార్యమన్ సింధియా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి క్రికెట్ లీగ్‌ను ప్రారంభించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ లీగ్ ప్రారంభానికి సంబంధించిన విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటిస్తానని ఆయన పేర్కొన్నారు.

# అధికారం కోసమే బతకడం లేదు: దేవెగౌడ భావోద్వేగం!



**బెంగళూరు, సెప్టెంబరు 25:** కావేరి జలాల పంపిణీ విషయంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య ఎంతోకాలంగా వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నీటి ఎద్దడి, పంటల పరిస్థితిపై నిపుణుల కమిటీతో అధ్యయనం చేయించాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీకి మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ లేఖ రాశారు. బెంగళూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన జెడి అధినేత ఓ సందర్భంలో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న నీటి పరిస్థితిపై అధ్యయనం చేసేందుకు ఓ నిపుణుల బృందాన్ని పంపించాలని కేంద్రాన్ని కోరుతున్నా. రాజకీయాలకోసమో, అధికారం కోసమో నేను బతకడంలేదు. రాష్ట్ర ప్రజలను రక్షించేందుకే ఉన్నాం. మా పార్టీ కూడా అందుకే ఉంది అని హెచ్‌డి దేవెగౌడ భావోద్వే గంతో పేర్కొన్నారు. ఇక్కడి ప్రభుత్వం తమిళనాడుకు నీటిని విడుదల చేయడాన్ని తప్పుపట్టిన ఆయన రాష్ట్రప్రభుత్వం ప్రజల జీవితాలతో ఆడుకుం టుందన్నారు. కావేరి జలాల పంపిణీ విషయంలో రెండు రాష్ట్రాలకు సం బంధం లేకుండా బయట ఏజెన్సీని ఏర్పాటు చేసేలా కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖను ఆదేశించాలని మోడీకి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. కావేరి జలాల విడుదల విషయంలో ఇటు కర్ణా టకతో పాటు తమిళనాడు లోనూ నిరసనలు కొనసాగుతున్నాయి. తమిళనాడుకు నీటిని విడుదల చేయడాన్ని నిరసిస్తూ కర్ణాటకలోని రైతు సంఘాలు ఆందోళన చేపట్టాయి. మొన్నటి వరకు మండ్యకే పరిమితమైన ఆందోళనలు తాజాగా రాష్ట్రమంతటా విస్తరించాయి. కావేరి బేసిన్‌లో ఈ సీజన్‌లో సరైన వర్షాలు లేకపోవడంతో రిజర్వాయర్లన్నీ నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయని కన్నడ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సెప్టెంబరు26న బెంగళూరు బంద్‌కు పిలుపు నిచ్చాయి. మరోవైపు తమకు అవసరమైన నీటిని విడుదల చేసి తమ పం టలను రక్షించాలంటూ తమిళనాడు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.


# కావేరి వివాదం: రేపు బెంగళూరు బంద్



**బెంగుళూరు, సెప్టెంబరు 25:** కర్ణాటక, తమిళనాడు మధ్య మరోసారి కావేరీ జల వివాదం రాజుకుంటోంది. నీటి విడుదలకు అనుకూలంగా, వ్యతిరేకంగా ఇరు రాష్ట్రాలకు చెందిన రైతులు ధర్నాలు, నిరసనలు చేపడుతున్నారు. నీటి పంచాయతీ సుప్రీంకోర్టుకు చేరింది. తమిళనాడుకు 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కావేరి బోర్డు ఆదేశించింది. దీనిపై కన్నడిగులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడుకు నీరు విడుదల చేయవద్దని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ రైతులు నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ది కావేరీ వాటర్ మెనేజ్‌మెంట్ అథారిటీ ఆదేశాలకు వ్యతిరేకంగా కన్నడ అనుకూల సంస్థలు సెప్టెంబరు 26న బెంగళూరు బంద్‌కు పిలుపునిచ్చాయి. మరో 15 రోజులపాటు 5,000 క్యూసెక్కుల చొప్పున నీటిని కావేరీ బేసిన్ నుంచి తమిళనాడుకు విడుదల చేయాలంటూ ఇచ్చిన ఆదేశాలపై ఈ నెల 26న నిర్ణయం తీసుకుంటామని కర్ణాటక ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో కన్నడ అనుకూల సంఘాలు, సంస్థలు బంద్‌ను చేపడుతున్నాయి. కర్ణాటక ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయనున్నాయి. రాజధాని బెంగుళూరుతో పాటు కర్ణాటక వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. దీనిపై ఆయా సంఘాలు తమ నిర్ణయాన్ని ప్రకటించనున్నాయి. కర్ణాటక వాటర్ కన్జర్వేషన్ కమిటీ ప్రెసిడెంట్ కురుబుర్ శంతకుమార్ ఆధ్వర్యంలో ఈ బంద్ జరుగుతోంది. స్కూళ్లు, కాలేజీలు, ఐటి కంపెనీలు, ఫిల్మ్ చాంబర్ బంద్‌కు మద్దతుగా 26న సెలవు ప్రకటించాలని కోరారు. టౌన్‌హాల్ నుంచి ఎస్బీ ఎం సర్కిల్ వరకూ భారీ ప్రదర్శన చేపట్టనున్నారు. ఈ బంద్‌కు బిజెపి, జెడిఎస్, ఆమ్ ఆద్మీ పార్టీలు మద్దతు ప్రకటించాయి. ఓలా ఊబర్ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ కూడా అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో విమానాశ్రయ క్యాబ్ సేవలపై ప్రభావం పడనుంది. బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్, కర్ణాటక స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ సైతం బంద్‌కు మద్దతు పలికాయి. బంద్‌కు కర్ణాటక ఫిల్మ్ ఇండస్ట్రీ సంఘీభావం ప్రకటించింది. అయితే, ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్స్, మెడికల్ షాపులు, అత్యవసర సర్వీసులు, ప్రభుత్వ కార్యాలయాలు, మెట్రో సర్వీసులు యధావిధిగా నడుస్తాయి. ప్రైవేట్ పాఠశాలలు సైతం తెరుచుకోకున్నాయి. బంద్‌కు సంఘీభావంగా విద్యార్థులు నల్లబ్యాడ్జీలు ధరిస్తారని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి తెలిపారు. దుకాణాలు, కమర్షియల్ కాంప్లెక్సులు, పరిశ్రమలు, వీధి వ్యాపారులు, హోటల్స్, రెస్టారెంట్లు, థియేటర్లు, మాల్స్, మల్టీప్లెక్స్‌లు మూసివేస్తారు.

# ఖాకీ దుస్తుల్లో ఎవరొచ్చినా కరిచేలా శునకాలకు ట్రైనింగ్

## తనిఖీల్లో పోలీసులకు భయానక అనుభవం



తిరువనంతపురం, సెప్టెంబరు 25: అనుమానిత డ్రగ్ డీలర్ ఇంట్లో ఆకస్మిక తనిఖీ చేపట్టిన పోలీసులపై ఒక్కసారిగా శునకాలు దాడి చేశాయి. ఖాకీ దుస్తులు ధరించిన వారిని గాయపరిచేలా వాటికి శిక్షణ ఇచ్చినట్లు తెలుసుకుని వారు ఖంగుతిన్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం మాదకద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంతో కేరళలోని కొట్టాయంలో ఓ వ్యక్తి ఇంట్లో పోలీసులు ఆకస్మికతనిఖీలు చేపట్టారు. ఆ బృందంలో ఘటనా స్థలానికి సమీపంలోని పోలీసు స్టేషన్‌కు చెందిన సిబ్బంది కూడా ఉన్నారు. సోదాల నిమిత్తం ఇంట్లోకి వెళ్లిన వారిపైకి ఒక్కసారిగా శునకాలు దూసుకెళ్లాయి. అనుమానిత డ్రగ్ డీలర్ ఇంట్లో అన్ని కుక్కలు ఉంటాయని ఊహించలేదు.అవి హింసాత్మకంగా ప్రవర్తిస్తాయని అనుకోలేదు. దాంతో మేం సరిగా సోదాలు చేయలేకపోయాం అని కొట్టాయం ఎస్పీ వెల్లడించారు. అలాగే అధికారులు కుక్కల దాడి నుంచి తమనుతాము రక్షించుకునే సమయంలో నిందితులు చక్కా జారుకున్నారని తెలుస్తోంది. అదృష్టవశాత్తూఏ ఒక్క అధికారి కూడా గాయపడలేదని ఎస్పీ తెలిపారు. అలాగే ఘటనా స్థలం నుంచి 17 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అంతేగా కుండా నిందితుడి గురించి కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక సమాచారం మేరకు నిందితుడు అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అతడు ఒక డాగ్ ట్రైనర్‌గా చెలామణి అవుతున్నాడు. ఖాకీ దుస్తులు ధరించిన వారిని కరిచేలా కుక్కలకు ట్రైనిం గ్ ఇచ్చాడు. అంతకు ముందు శునకాలను అదుపు చేయడం ఎలా? వంటి విషయాల గురించి విశ్రాంత బిఎస్‌ఎఫ్ అధి కారి వద్ద శిక్షణ పొం దాడు. అయితే ప్రత్యేకం గా ఖాకీ దుస్తులు ధరిం చిన వారిని గాయపర చడం గురించి ప్రశ్నలు అడగడంతో అతడిని గెంటేశారు. కానీ ప్రస్తుతం ఉంటున్న ఇంట్లో డాగ్ ట్రైనర్‌గా అందరికీ పరిచయం కావడంతో ఆ ప్రాంతవాసులు అతడింట్లో శునకాలను వదిలివెళ్లేవారు. అందుకోసం ఒక్కో శునకానికి రోజుకు వెయ్యి రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు అని ఎస్పీ తెలిపారు. అలాగే ఘటన సమయంలో అతడి వద్ద 13 శునకాలు ఉన్నా యని, వాటిని యజమానులకు అప్పగించామని వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ డ్రగ్ రాకెట్ వెనుక ఎవరెవరు ఉన్నారో గుర్తించనున్నామని చెప్పారు.

# బిలాస్‌పూర్, రాయ్‌పూర్ ట్రైన్‌లో ప్రయాణించిన రాహుల్‌గాంధీ



**రాయ్‌పూర్, సెప్టెంబరు25:** మొన్నటికి మొన్న రైల్వే హమాలీ అవతారం ఎత్తిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తాజాగా సాధారణ వ్యక్తిలా ట్రైన్‌లో ప్రయాణించారు. పార్టీ నేతలతో కలిసి ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ నుంచి రాయ్‌పూర్ వరకు ఇంటర్ సిటీ రైల్లో ప్రయాణం చేశారు. తోటి ప్రయాణికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా పలువురు రాహుల్‌తో ఫొటోలు దిగేందుకు, ఆటోగ్రాఫ్ తీసుకునేందుకు ఆసక్తి కనబరిచారు. అంతకుముందు ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన గృహ నిర్మాణాలకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ కుల గణన నిర్వహించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గడిచిన కొన్ని నెలల్లో రాష్ట్రంలో 2,600 రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసిందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుయ్యబట్టారు. సమావేశం అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్, రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు కుమారి సెల్జా కలిసి రైల్లో ప్రయాణించారు.ఇందుకు సంబంధించిన చిత్రాలను కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో పంచుకుంది.

# మరో మహమ్మారి ముప్పు: బ్రిటన్ శాస్త్రవేత్తలు



**లండన్, సెప్టెంబరు 25:** ప్రపంచానికి డిసీజ్ ఎక్స్ రూపంలో మరో మహమ్మారి ముప్పు పొంచి ఉందని ఆరోగ్యరంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా మహమ్మారి తరహాలో డిసీజ్ ఎక్స్ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిపై ప్రభావం చూపిస్తుందని బ్రిటన్ వ్యాక్సిన్ టాస్క్‌ఫోర్స్‌కు నాయకత్వం వహిస్తున్న డేమ్ కేట్ బింగ్‌హామ్ చెప్పారని డైలీ మెయిల్ తన కథనంలో పేర్కొంది. కరోనా మహమ్మారి కంటే డిసీజ్ ఎక్స్ ప్రజలపై ఏడు రెట్లు అధిక ప్రభావం చూపిస్తుందని ఆమె వెల్లడించారు. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా మరో కొత్త మహమ్మారిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఎంతో కాలంగా సూచిస్తూనే ఉంది. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న వైరస్‌లు వేగంగా రూపాంతరం చెందుతున్నాయి. వాటన్నింటినీ మానవాళికి ముప్పుగా భావించలేం. కానీ వాటిలో కొన్ని మనుషులపై తీవ్ర ప్రభావం చూపించవచ్చు. వేలకొద్దీ వైరస్‌లు ఉన్న 25 వైరస్ కుటుంబాలను శాస్త్రవేత్తలు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. వాటిలో ఏదైనా వైరస్ మహమ్మారిగా రూపాంతరం చెందవచ్చు. అయితే జంతువుల నుంచి మనుషులకు వ్యాప్తిచెందే వైరస్‌లు ఈ జాబితాలోలేవు. కరోనా మహమ్మారి సోకిన వారిలో ఎక్కువ మంది వైరస్ బారి నుంచి బయటపడగలిగారు. కానీ డిసీజ్ ఎక్స్ మాత్రం ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మందిపై ప్రభావం చూపిస్తుంది అని డేమ్ కేటన అభిప్రాయపడ్డారు. డిసీజ్ ఎక్స్‌ను ఎదుర్కొనేందుకు బ్రిటన్ శాస్త్రవేత్తలు ఇప్పటికే వ్యాక్సిన్ అభివృద్ధి చేసే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. సుమారు 200మంది శాస్త్రవేత్తలు విల్ట్‌షైర్‌లోని పోర్ట్‌డౌన్ లేబొరేటరీలో జంతువుల నుంచి మనుషులకు వేగంగా వ్యాపించే వైరస్‌లను అడ్డుకునేందుకు వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలుస్తోంది.



# ఒడెస్సా పోర్టులో రష్యా భారీ విధ్వంసం!

**కీవ్, సెప్టెంబరు 25:** ఉక్రెయిన్‌కు ఉన్న ఏకైక ప్రధాన పోర్టు అయిన ఒడెస్సాపై రష్యా విరుచుకుపడింది. ఈ దాడిలో పోర్టు, ధాన్యం నిల్వ గోదాములు, ఓ హోటల్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. రష్యా ఆధీనంలోని క్రిమియా నౌకాదళ స్థావరం ప్రధాన కార్యాలయంపై ఉక్రెయిన్ క్షిపణి దాడి చేసిన కొన్ని రోజుల్లోనే ఇది చోటు చేసుకోవడం గమనార్హం. మొత్తం 12 కల్బిర్ క్షిపణులు, 19 డ్రోన్లు, రెండు ఒనెక్స్ సూపర్ సోనిక్ క్షిపణులను ప్రయోగించింది. వీటిల్లో కల్బిర్ క్షిపణులను సబ్‌మెరైన్లు, నౌకలపై నుంచి ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వర్గాలు వెల్లడించాయి. వీటిల్లో అత్యధిక శాతాన్ని తాము కూల్చివేశామని కీవ్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ దాడిలో ఒడెస్సా నౌకాశ్రయంలోని ఆహార ధాన్యాల గోదావులు, ఇతర పోర్టు మౌలిక వసతులు ఈ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయి. ధాన్యపు ఒప్పందం అమలుకు అవసరమైన పరికరాలు, ప్రదేశాలు దెబ్బతిన్నాయని ఉక్రెయిన్ వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా ఒనెక్స్ క్షిపణులు పోర్టును బాగా దెబ్బతీసినట్లు సమాచారం. కాకపోతే ప్రాణనష్టం నుంచి ఉక్రెయిన్ తప్పించుకొంది. ఈ దాడుల్లో ఓ హోటల్ కూడా తీవ్రంగా దెబ్బతింది. నల్లసముద్రంలోని అంతర్జాతీయ జలాలు కాకుండా పొరుగు దేశాల జలాల్లో నుంచి మాత్రమే ధాన్యం రవాణా చేసేలా మార్గాలను ఉక్రెయిన్ ప్రస్తుతం పరీక్షిస్తోంది. ఇందుకోసం నాటో సభ్యదేశాలైన బల్గేరియా, రొమానియా తీరాలను వాడుకుంటోంది. ఈ మార్గంలో రవాణా చేసిన తొలి రెండు షిప్‌మెంట్‌లు తాజాగా తుర్కియే చేరుకొన్నాయి. ప్రపంచ ఆహార సరఫరా వ్యవస్థల్లో ఉక్రెయిన్, రష్యా రెండూ కీలకమైనవే. మరోవైపు ఉక్రెయిన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను తాము కూల్చేసినట్లు రష్యా ప్రకటించింది. వీటిల్లో కొన్ని క్రిమియా దిశగా దూసుకొచ్చాయని పేర్కొంది.

# భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం: చైనా రాయబారి



**బీజింగ్, సెప్టెంబరకు 25:** ఆసియా క్రీడల్లో భాగంగా కొందరు భారత్ ఆటగాళ్లకు చైనా వీసాలతో పాటు అక్రిడిటేషన్ నిరాకరించడంపై ఇరుదేశాల మధ్య మరోసారి వివాదం మొదలైంది. దీనిపై భారత్ నిరసన తెలియచేసింది. చైనా ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యలకు పాల్పడిందని ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల సంబంధాలపై కోల్‌కతాలోని చైనా రాయబారి ఝూ లియూ ఆసక్తి కర వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం భారత్-చైనాల మధ్య సంబంధాలు స్థిరంగా ఉన్నాయని అన్నారు.ముఖ్యమైన అంశాలపై ఇరుదేశాల నాయకులు చర్చించి ఏకాభిప్రా యాన్ని అమలు చేసేందుకు, ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరి చేందుకే, సుస్థిర అభివృద్ధి భాగస్వామ్యానికి భారత్‌తో చర్చలకు చైనా సుముఖంగా ఉంది. ప్రపంచ అభివృద్ధి, శాంతి కోసం భారత్ సహా పొరుగు దేశాలతో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధం. ఈ భాగస్వామ్యం భారత్-చైనా ప్రజలతో పాటు ప్రపంచానికి మేలు చేకూరుస్తుంది' అని కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో లియూ వెల్లడించారు. అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులకు వీసా తిర స్కరణ గురించి మాట్లాడుతూ, ఇది ద్వైపాక్షిక సమస్య. ఆసియా క్రీడలు మన అందరి కోసం..మనమంతా ఓ కుటుంబం. ఈ అంశంపై వారు చైనా రాయ బార కార్యాలయాన్ని సంప్రదించాలి' అని లియూ తెలిపారు.

# కెనడాలోని ఖలిస్థానీ ఉగ్రవాదికి..లష్కరేతో సంబంధాలు?



**ఒట్టావా, సెప్టెంబరు 25:** ఖలిస్తానీ అంశంతో భారత్, కెనడా మధ్య ఉద్రిక్తలు కొనసాగుతున్న వేళ, కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కెనడాలో ఉంటున్న ఖలిస్తానీ ఉగ్రవాది అర్షదీప్ దల్లాకు లష్కరే తొయిబా ఉగ్ర ముఠాతో సంబంధాలున్నట్లు తెలుస్తోంది. పంజాబ్‌లో ఉన్న హిందూ నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరపాలని అర్షదీప్ కుట్రలు పన్నుతున్నాడని ఢిల్లీ పోలీసులు గుర్తించినట్టు పలు కథనాలు వెలువడ్డాయి. ఇద్దరు అనుమానిత ఉగ్రవాదుల కోసం ఢిల్లీ పోలీసులు చేపట్టిన దర్యాప్తులో భాగంగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ యేడాది జనవరిలో ఢిల్లీలోని జహంగీర్‌పురిలో ఆయుధాలు లభ్యమయ్యాయి. అనంతరం తనిఖీలు చేపట్టిన పోలీసులు ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను అరెస్టుచేశారు. వారిని విచారించిన పోలీసులు జులైలో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ దర్యాప్తులో సంచలన విషయాలు బయటపడుతున్నాయని ఆ ఛార్జిషీట్‌లో పేర్కొన్నట్లు సమాచారం. అరెస్టయిన అనుమానిత ఉగ్రవాదుల్లో ఒకడు, తాను అర్షదీప్ దల్లాతో టచ్‌లో ఉన్నట్లు అంగీకరించినట్లు తెలిసింది. పంజాబ్‌లో ఉగ్ర కార్యకలాపాలకు సిద్ధమవుతున్న దల్లా, తనకు సూచించిన విధానంలో చెప్పినట్లు పోలీసులు తమ ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు.

# నూతన కెవైసి నిబంధనలతో తెలంగాణ పౌరులకు నష్టం

- ప్రవాస తెలంగాణీయుల ప్రయోజనాల రక్షణకు నిబంధనలను పునఃసమీక్షించండి
- కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌కు మంత్రి గంగుల కమలాకర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** ఆహార భద్రత కార్డుల్లో కేవైసి నిబంధనల కారణంగా తెలంగాణ పౌరులకు వారి ప్రయోజనాలు నష్టపోతున్నారని, ఈ మేరకు వాటిని పరిరక్షిస్తూ కేంద్రం కేవైసి నిబంధనలను పునః సమీక్షించాలని కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్‌ను రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్‌కోరారు. ఈ మేరకు ఒక లేఖ రాశారు. కొత్త నిబంధనల కారణంగా ప్రజల్లో తీవ్రఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి అన్నారు. అయితే దేశం మొత్తం పరిస్థితులకు తెలంగాణ పరిస్థితులకు గల వైవిధ్యం విభిన్నమైంది. పెద్ద సంఖ్యలో గల్ఫ్, ఇతర దేశాలతో పాటు దేశంలో ముంబాయి, భీవండి తదితర ప్రాంతాలకు పెద్ద ఎత్తున వేలాది మంది వసలు పోయిబతికే దౌర్భాగ్య పరిస్థితులు తలెత్తాయన్నారు. ఈ దుస్థితిని రూపుమాపడానికి ముఖ్యమంత్రి కెసిఆర్ సారధ్యంలో సుదీర్ఘ పోరాటం చేసిన తెలంగాణాను సాధించుకున్నామని లేఖలో పేర్కొన్నారు.

సాధించిన తెలంగాణా దేశంలోనే అన్ని రంగాల్లో నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుకుంటున్నాము. ఇప్పటికే సాగునీరు, తాగునీరు, పరిశ్రమల ఏర్పాటు తదితర కీలక రంగాల్లో గణనీయమైన వృద్ధిని సాధించి మౌళిక వసతులతో సహా అన్ని రంగాల్లో దేశానికి మార్గనిర్దేశకత్వం వహిస్తున్నామన్నారు. ఈ కృషితో ప్రస్తుతం వలసలను అరికట్టడంతో పాటు గతంలో వలసపోయిన తెలంగాణ ప్రజలు పెద్ద ఎత్తున తిరిగి స్వరాష్ట్రం రావడానికి ప్రోత్సహమిస్తున్నామన్నారు.

అయితే దశాబ్దాల వందత్వాన్ని కేవలం తొమ్మిదేళ్ల స్వల్ప సమయంలో పూర్తిగా రూపుమాపడం ఎంతటి కష్టసాధ్యమో పాలకులుగా మీరు తెలియజనికాదన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కేవైసి నిబందనల వల్ల ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ఉమ్మడి జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర ప్రాంతాల ప్రజలు గల్ఫ్ దేశాలతో పాటు ఇతర చోట్ల, దక్షిణ తెలంగాణ ఉమ్మడి జిల్లాలైన మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ తదితర ప్రాంతాల ప్రజలు బొంబాయి తదితర చోట్ల పెద్ద సంఖ్యలో బతుకులు వెళ్లదీస్తున్నారన్నారు. వీరి ప్రయోజనాలు కాపాడడానికి నిర్విరామంగా కృషి చేస్తుందన్నారు. ప్రజల ప్రయోజనాలు కాపాడమే ప్రభుత్వాల అంతిమ ప్రయోజనమైనందున ప్రవాస తెలంగాణ ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకు మానవీయ దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఖచ్చితంగా పునః సమీక్షించాలంటూ లేఖలో పేర్కొన్నారు.

ప్రస్తుత కేవైసి నిబంధనల వల్ల దూర ప్రాంతాల నుంచి రాలేక ఇబ్బందులు పడుతున్న తెలంగాణ ప్రజానీకం ప్రయోజనాల్ని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వం ఖచ్చితంగా కాపడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరూ ఎలాంటి ఆందోళనకు గురికావొద్దన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం అదేరీతిలో ప్రజలకు భరోసా కల్పించాలని, ఆహార భద్రత కార్డుల కేవైసి నిబంధనలను పునః సమీక్షించాలన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# కిషన్‌రెడ్డి కుట్ర వల్లే ఎమ్మెల్సీ ఫైల్ తిరస్కరణ

## బిజెపికి ఓ న్యాయం.. బిఆర్‌ఎస్‌కు మరో న్యాయమా?

### బలహీన వర్గాల వారిని అణిచివేసే కుట్ర ఇది

### గవర్నర్ తీరుపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కుట్ర వల్లే ఎమ్మెల్సీ ఫైల్‌ను తెలంగాణ గరవ్నర్ తిరస్కరించారని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం పొందిన ఎమ్మెల్సీ అభ్యర్థులు కుర్రా సత్యనారాయణ, దాసోజు శ్రవణ్ ఎలాంటి సామాజిక సేవ చేయలేదంటూ వీరు రాజకీయ నాయకులని పేర్కొంటూ గవర్నర్ తిరస్కరించడం ఎంతవరకు సమంజసమని మంత్రి ప్రశ్నించారు. తమిళనాడు బిజెపి అధ్యక్షురాలైన తమిళిసై రాజకీయాల నుంచి నేరుగా గవర్నర్ కాలేదా అని అన్నారు. బిజెపికి ఓ న్యాయం బిఆర్‌ఎస్ పార్టీకి మరో న్యాయమా అని ఆయన నిలదీశారు. గవర్నర్ చర్య సమాఖ్య స్పూర్తికి విఘాతం అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో బలహీన వర్గాలకు చెందిన వారిని అణిచివేసే కుట్ర ఇదని పేర్కొన్నారు. ప్రధాని బిసి అయినా బిసిలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. బిసిలను అణిచివేసేందుకు బిజెపి ఇలాంటి నిర్ణయాలను తీసుకుంటున్నదన్నారు. బిజెపిలోఉండి రాజకీయం చేస్తే మాత్రమే పవిత్రమా? ఇతర పార్టీల వారు రాజకీయాలు చేస్తే అపవిత్రం అయిపోతుందా అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కక్షపూరితంగా తెలం గాణలోని బడుగు బలహీన వర్గాల వారిని ఎదగనీయకుండా కుట్ర చేస్తున్నారని అందుకే ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కుర్రా సత్యనారాయణ, ఎంబిసి అయిన దాసోజు శ్రవణ్, ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను గవర్నర్‌కు చెప్పి నిలుపుదల చేయించారని విమర్శించారు. మహిళా బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం దేశంలో 58 శాతం ఉన్న బిసిల రిజర్వేషన్ బిల్లును కూడా ప్రవేశపెట్టాలని, త్వరలో తెలంగాణ వస్తున్న ప్రధాని మోడీకి చెప్పి బిసి బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు

# అసదుద్దీన్ కేరళ నుంచి పోటీ చేస్తాడా?

### పిసిసి మాజీ చీఫ్ వి.హనుమంతరావు సవాల్

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ కేరళలో పోటీ చేస్తారా అని పిసిసి మాజీ చీఫ్ వి.హనుమంతరావు సవాల్ చేశారు. సెక్యులర్ భావ జాలం కలిగిన రాహుల్‌గాంధీ ఎక్కడి నుంచైనా పోటీచేసి గెలిచే అవకాశం వుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నీవాక మతతత్వవాదివి.. ఆయనకు నీకు పోలిక ఎక్కడ అని ఆయన ప్రశ్నించారు. రాహుల్‌గాంధీని హైదరాబాద్‌లో పోటీ చేయమని అసదుద్దీన్ అనడం ఒక డ్రామా అని ఆయన అభివర్ణించారు. సామాజిక న్యాయం కోసం రాహుల్‌గాంధీ కృషి చేస్తున్నారని ఆయన ఔన్నత్యం ముందు విచ్చిన్నకారులు తలదించుకోవాలని అన్నారు. భారత్ జోడోయాత్రతో ప్రేమను పంచారని ద్వేషం వద్దని రాహుల్ ప్రజలను చైతన్యం చేస్తూ దేశంలో సంచరించారని గుర్తు చేశారు.

**మోడీ మెప్పు కోసం అసదుద్దీన్ వ్యాఖ్యలు: టిపిసిసి ఉపాధ్యక్షుడు నిరంజన్**

రాహుల్ గాంధీ హైదరాబాద్‌లో పోటీ చేయాలని సవాల్ చేస్తున్నావ్ కానీ ఆయన ఇక్కడ నుంచి పోటీ చేస్తే అసదుద్దీన్ నీకు ఓటమి తప్పదు అని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ హెచ్చరించారు. సోమవారం గాంధీ భవన్‌లో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ గల్లీ కుక్క గల్లీలో మొరిగినట్లు మోదీ మెప్పుకోసం రాహుల్‌ను సవాల్ చేస్తూ వ్యాఖలు చేశారని దుయ్యబట్టారు. బాబ్రీ మసీదు కూల్చినపుడు ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్‌సింగ్ ప్రభుత్వం ఉందని అసద్ గుర్తు చేసుకోవాలని హితవు చెప్పారు. బిజెపి మెప్పుకోసం అసద్ పాకులాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వల్ల మీరు అన్ని రకాల లబ్ధిపొందారి ఎత్తిపొడిచారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రతో ప్రేమను పంచారు ఆయన ముస్లిం ఓట్లు కూడా పొందుతారు. పాతబస్తీ అభివృద్ధికి ముస్లిం అభివృద్ధికి మీరు ఏం చేశారో వివరిస్తారా అని నిరంజన్ నిలదీశారు. అసద్, ఎంఐఎం కాంగ్రెస్‌కు వ్యతిరేకి కావొచ్చు కానీ ముస్లిం ప్రజలు మాత్రం కాంగ్రెస్, ఇందిరా, రాజీవ్ రాహుల్ సోనియా అభిమానులు అని అన్నారు.

# పండిట్ దీన్‌దయాళ్ లక్ష్యం అట్టడగువర్గాల అభ్యున్నతే

- ఆయన మరణం ఇంకా మిస్టరీగానే మిగిలిపోయింది: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** దేశంలో అట్టడుగు వర్గాలకు సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయడం, వారిని వృద్ధిలోకి తీసుకు రావాలన్నదే పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యయ్ లక్ష్యం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యయ జయంతి సందర్భంగా ఆయనకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాన ఉన్న వ్యక్తులకు, సమాజంలో నిర్లక్ష్యానికి గురైన పేదవాల్లకు ప్రభుత్వ పథకాలలో తొలి ప్రయోజనం చేకూరాలని అంత్యోదయ విధానాన్ని రూపొందించిన మహానీయుడు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిస్వార్ధంగా ప్రజలకు సేవలందించాలని పిలుపునిచ్చారు. భారతీయ జన సంఘం వ్యవస్థాపనకులు, పండిట్‌మరణం ఇంకా మిస్టరీగానే మిగిలిపోవడం బాధకరం అన్నారు. దేశంలో ప్రజలు, రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకస్తానాన్ని సంపాదించిన గొప్ప వ్యక్తి అన్నారు. విద్యార్థులు, బడగు బలహీన వర్గాలు, మహిళలు, ఇలా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యం అన్నారు. నరేంద్రమోడి ప్రభుత్వం దీన్ దయాల్ ప్రవచించిన అంత్యోదయ సిద్ధాంతాన్ని ఆచరణలో పెడుతూ, వారి ఆశయాలకు పునరంకితమైన పనిచేస్తుందన్నారు. పేద ప్రజలకు మేలు జరిగేలా ఉజ్వల యోజన ద్వారా పేదలకు గ్యాస్, జన్ ధన్ ఖాతాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదవారికి ఇండ్లు, స్వచ్ఛ్ భారత్ మిషన్ ద్వారా టాయిలెట్ల నిర్మాణం చేపడుతుందన్నారు. మారుమూల ప్రాంతాలకు దీన్‌దయాల్ గ్రామ జ్యోతి యోజన ద్వారా ప్రతి గ్రామానికి కరెంటు సరఫరా, ప్రతి ఇంటికి తాగునీటి సదుపాయాన్ని కల్పిస్తూ దేశంలోని ప్రతి ఒక్కరికి మేలు జరిగేలా సేవలందిస్తోందన్నారు. దీన్‌దయాల్ సిద్ధాంతాలకు అనుగుణంగా ఆశయాలకు అనుగుణంగా నరేంద్రమోడి ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించి ఆచరణలో చూపెడుతుందన్నారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ అనే నినాదంతో దీన్ దయాల్ ఆలోచనలకు అనుగుణంగా భారత ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందకెళ్తోందన్నారు. దీన్ దయాల్ ఆశయాలకు అనుగుణంగా, క్రమశిక్షణ గల కార్యకర్తలుగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలమంతా పనిచేస్తామన్నారు. అవినీతికి వ్యతిరేకంగా, కుటుంబ రాజకీయాలకు తావివ్వకుండా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేలా ముందుకెళ్తామన్నారు.

# వ్యాపారంగా విద్య, వైద్యం

## 'యూనివర్సిటీ' సినిమాను ఆదరించండి..

### నటుడు, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** దేశంలో విద్యా వైద్య కేంద్రాలు వ్యాపార కేంద్రాలుగా మారాయని, ప్రముఖ సినీనటుడు, దర్శక నిర్మాత ఆర్.నారా యణ మూర్తి అన్నారు. తాను నటించి దర్శకత్వం వహించి రూపొందించిన 'యూనివర్సిటీ' సినిమా ప్రమోషన్‌లో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వం కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని ఎంవీఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తాను సామాజిక చైతన్యం కోసమే సినిమాలు తీస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి నిర్వహించే పరీక్షల్లో ప్రశ్నాపత్రాలు లీకేజీ, చూచి రాతలు జరుగుతు న్నాయని చెప్పారు. అక్టోబర్ 13న విడుదలయ్యే యూనివర్సిటీ చిత్రాన్ని అందరూ చూసి ఆదరించాలని కోరారు.

# జిఓ 142ను రద్దు చేయాలి

## కలెక్టరేట్ల ముందు పోరాట కమిటీ ధర్నాలు

### కలెక్టర్లకు సమ్మె నోటీసుల అందజేత

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** వైద్య, ఆరోగ్య శాఖలోని జీవో 142ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ కార్యాలయాల ముందు డాక్టర్లు, పారామెడికల్ ఉద్యోగులు ధర్నాలు చేశారు. జీవో 142ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ .. రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలోని డాక్టర్లు, పారామెడికల్ ఉద్యోగుల యూనియన్స్ అసోసియేషన్స్‌ల అధ్వర్యంలో ఏర్పడిన జీవో 142 రద్దు పోరాట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు చేసినట్టు పోరాట కమిటీ నాయకులు తెలిపారు. 33 జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు చేసి జిల్లా కలెక్టర్లకు జీవో 142 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె నోటీసులను ఇచ్చినట్టు రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. కలెక్టర్ కార్యాలయాల ముందు జరిగిన ధర్నా కార్యక్రమాల్లో స్టీరింగ్ కమిటీ సభ్యులు సాయిరెడ్డి, యాద నాయక్, శ్యాంసుందర్, వెంకటేశ్వర రెడ్డి, నెహ్రూచంద్, రాబర్ట్ బ్రూస్ తదితరులు పాల్గొన్నారు. వైద్య, ఆరోగ్య రంగానికి గొడ్డలిపెట్టులాంటి జీవో 142ను వెంటనే రద్దు చేయాలని పోరాట కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానవ వనరుల హేతుబద్ధీకరణ అనేది జనాభా ప్రాతిపదికన ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించడం కోసం చేయాలన్నారు. కానీ ప్రభుత్వం ఈ జీవోలో అలా చేయలేదని మండిపడ్డారు. ఈ జీవో అమలైతే వైద్య ఆరోగ్య శాఖలో 4వేల పోస్టులు రద్దయ్యే ప్రమాదం ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం భేషజాలకు పోకుండా వెంటనే జీవో 142ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగంలో అపారమైన అనుభవం ఉన్న క్షేత్రస్థాయిలో పనిచేసిన వారి నుంచి వివరాలను తీసుకోకుండానే జీవోను రూపొందించారని తెలిపారు. ప్రజలకు, వైద్యులకు ఇబ్బందికరంగా ఉన్న జీవో 142ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మాణంపై నెలకొన్న ప్రతిష్టంభన

## రెవెన్యూ శాఖ అధికారుల ఎన్నికల విధులతో ముందుకు కదలని భూసేకరణ

### పైపులైన్, విద్యుత్‌లైన్ల తరలింపు ఖర్చు కేంద్రానిదే అంటున్న రాష్ట్రం

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** రీజినల్ రింగు రోడ్డు విషయంలో కేంద్ర రాష్ట్ర మధ్య ప్రతిష్ఠంభన నెలకొంది. విద్యుత్, టెలికాం, వాటర్‌పైపులైన్ తరలింపు వ్యయం విషయంలో కేంద్రం, రాష్ట్రం మీదంటే మీదని ఒకరిపై ఒకరు నెట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. రీజినల్ రింగ్‌రోడ్డు మార్గంలో విద్యుత్‌వైరు,టెలికాం కేబుళ్ళు, తాగునీటి పైపులైన్ల తరించాల్సిన ఆవశ్యకత ఏర్పడుతున్నది. రీజనల్ రింగురోడ్డు ఉత్తరంవైపు రీజనల్ రింగురోడ్డుతో ధ్వంసమయ్యే మౌళిక వసతులు పునస్థాపితం చేయడానికి సుమారు రూ.190 కోట్ల రూపాయలు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా ఇంజనీర్లు వేశారు. 158 కిలోమీటర్లు నిడివి కలిగిన ఈ రహదారికోసం 4600 ఎకరాలు సేకరించాల్సి వుంది. రెవెన్యూ అధికారులు ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొంటుడటంతో ఆశించిన వేగంతో భూసేకరణ పనులు ముందుకు సాగటంలేదు. భూసేకరణ ఒక కొలిక్కి వచ్చేలోగా కేబుళ్ళు,పైపులైన్లు తొలగించి పునస్థాపితం చేయాల్సిన అవసం వుంది. విద్యుత్, టెలికాం కేబుళ్ల పైపులైన్లు తొలగించడం బాధ్యత రాష్ట్రప్రభుత్వం మాత్రమే అని ఖరాఖండిగా కేంద్రం వాదిస్తున్నది. కేంద్రం ఈ బాధ్యత తీసుకోవాలని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అంటున్నది. రహదారిపై ఉన్న విద్యుత్‌వైర్లు, టెలికాం తీగలు,తాగునీటి పైపులైన్లు తరలించే బాధ్యత కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ నిబంధలన ప్రకారం రాష్ట్రప్రభుత్వం ఆర్‌అండ్‌బి శాఖ భరించాల్సి వుంటుంది. అయితే రీజినల్ రింగ్ రోడ్డుకోసం జరిగే భూసేకరణలో 50 శాతం ఖర్చును భరించేందుకు రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే ఒప్పుకొంది. ఇపుడు మౌళిక వసతులు షిఫ్టింగ్ బాధ్యతను స్వీకరించలేమని రాష్ట్రప్రభుత్వం అంటున్నది. అయితే కేంద్ర ప్రభుత్వం ఇందులో కూడా 50శాతం భారం మోయాలని రాష్ట్రప్రభుత్వంను కోరుతున్నది.హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో కేంద్ర,రాష్ట్రప్రభుత్వం విద్యుత్ టెలికాం కేబుళ్ల తరలింపు వ్యయంపై చర్చలు అనేక పర్యాయాలు జరిగాయి. అయితే మళ్లీ మరో దఫా చర్చించాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించుకున్నాయి.

# తప్పతాగి మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త వీరంగం

**చేర్యాల, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** చేర్యాలలోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వచ్చిన మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త అంకుగారి శ్రీధర్‌రెడ్డి సోమవారం తప్పతాగి ఓ వ్యక్తిపై ఇష్టారాజ్యంగా వ్యవహిరించాడు. ఆ మైకంలో వీరంగం సృష్టించాడు. దీంతో ఆగ్రహానికి గురైన స్థానికులు దాడికి ప్రయత్నించడంతో జారుకున్నాడు. మున్సిపల్‌లో కూడా ఇదే తీరు ప్రవర్తిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాను అధికారపార్టీకి చెందిన వ్యక్తినని చెప్పుకుని పట్టణంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వ్యక్తి చేర్యాల మున్సిపాలిటికి చెడ్డపేరు తేవడమే కాకుండా, పార్టీకి చీధపురుగేనని చెబుతున్నారు.

# ఇండియన్ మోటోజిపి విన్నర్‌గా మార్కో బెజ్జెకి

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** భారత్‌లో తొలిసారిగా జరిగిన ఆరంభ ఎడిషన్ ఇండియన్ ఆయిల్ -మోటో జిపి ఇండియన్ గ్రాండ్ ఫ్రీ రేస్‌లో మూని విఆర్ 46 దుకాటి రేసింగ్ జట్టు రైడర్ మార్కో బెజ్జెకి (ఇటలీ) ఛాంపియన్‌గా నిలిచాడు. గ్రేటర్ నోయిడాలోని బుద్ద్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో జరిగిన రేసులో బెజ్జెకి అందరికంటే వేగంగా 13ల్యాప్‌లను 36నిమిషాల 59.157 సెకన్లలో పూర్తిచేసి టైటిల్ గెలుచుకున్నాడు. ఆరంభం నుంచి ప్రమాక్ దుకాటి టీమ్‌రైడర్ జార్జ్ మార్టిన్ (స్పెయిన్) తో నుంచి అతనికి గట్టిపోటీ ఎదురైంది. చివరకు మార్కోనే టైటిల్‌గెలుచుకున్నాడు. జార్జ్‌మార్టిన్ రెండోస్థానం సాధించగా ..మెన్‌స్టర్ యమహాకు చెందిన ఫ్రాన్స్ రైడర్ ఫాబియో క్వార్టారో మూడోస్థానం సొంతం చేసుకున్నాడు. ఈసీజన్ ఛాంపియన్‌సిప్ లిడర్ ఫ్రాన్సె స్కో బగ్నాయా మరో ఎనిమిది నెలలు మిగిలి ఉండగా క్రాష్ అయ్యాడు. కాగా ఈవిజయంతో మోటో జిపి రైడర్ల ఛాంపియన్‌షిప్‌లో బెజ్జెకి తన అగ్రస్థానం కైవసం చేసుకున్నాడు. రేసు తర్వాత అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ అతను ఈప్రదేశం, ట్రాక్ తనకు చాలానచ్చిందని తెలిపారు. ఈవిషయాన్ని అభిమానులతో కలిసి పంచుకోవాలని అనుకుంటున్నట్లు చెప్పాడు. వారికి మన మనసులో స్థానం ఉంటుందన్నారు.

# వర్సిటీ కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి

## విధులు బహిష్కరించిన కాంట్రాక్ట్ అధ్యాపకులు

### తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ జెఎసి

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాల యాల్లో పనిచేస్తున్న 1445 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ డిమాండ్ చేసింది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విధులను బహిష్కరించి సమ్మె ప్రారంభించినట్టు జేఏసీ నేతలు తెలిపారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో సోమవారం కాంట్రాక్ట్ అధ్యాపకులు విధులను బహిష్కరించి సమ్మె చేసినట్టు జేఏసీ ఛైర్మన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధన తెలిపారు. గత 143 రోజులుగా వివిధ రూపాల్లో యూనివర్సిటీల్లో నిరసన కార్యక్రమాలను చేశామని అయినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇప్పటికే అనేకసార్లు యూనివర్సిటీ అధికారులను, ప్రభుత్వ అధికారులను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితోపాటు.. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రిని కూడా కలిసినట్టు వారు తెలిపారు. ఎంత మందిని కలిసి ఎన్ని రకాలుగా అభ్యర్థించినప్పటికీ ఫలితం లేకపోవడంతో సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులు సమ్మె చేస్తున్నట్టు జేఏసీ నాయకులు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, గుజ్జ కృష్ణ తదితరులు

# రాజకీయాలకు అతీతంగా బిసిలు ఐక్యం కావాలి

## ఎంపి ఆర్.కృష్ణయ్య, బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం

### నేటి బిసి సంఘాల సమావేశం అక్టోబర్ మొదటివారానికి వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో బిసి బిల్లుపెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా కల్పించాలని అందుకు బిసిలంతా రాజకీయాలకు అతీతంగా ఐక్యం కావాలని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎం.పి ఆర్.కృష్ణయ్య ,బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ తెలిపారు. ఈ మేరకు విద్యానగర్‌లోని బిసిభవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 26న (మంగళవారం)జరిగే బిసిసంఘాల సమావేశం వినాయక నిమజ్జనాలు, మీలాద్‌ఉన్‌నబీ ఉత్సవాల కారణంగా అక్టోబర్ మొదటివారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా బిల్లుపెట్టాలని ప్రతిపాదించారు. అలాగే మహిళా బిల్లులో బిసి,ఎస్సి,ఎస్టీ మహిళలు సబ్‌కోటా కల్పించాలని కోరారు. మహిళా బిల్లులో బిసిమహిళలకు ప్రాధాన్యత కల్పించకపోతే మహిళాబిల్లుకు సార్ధకత లేదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలు, సామాజిక వర్గాలకు వారివారి జనాభా ప్రకారం రాజకీయ రంగంలో ప్రాతినిధ్యం కల్పించాలని కానీ మనదేశంలో 56శాతం ఉన్న బిసిలకు ఇంత వరకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకుండా అణచిపెట్టారన్నారు. ప్రపంచంలో అనచివేత, వివక్షతకు గురైన అన్ని వర్గాలనే గుర్తించి వాటా ఇచ్చి ఇతర అభివృద్ధి చెందిన వర్గాలతో సమానంగా అభివృద్ధి చేస్తే ..మనదేశంలో మాత్రం పీడిత కులాలను ఇంకా అణచివేయాలని చూస్తున్నారన్నారు. ఈసమావేశంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగేందర్‌గౌడ్, టి.రాజ్‌కుమార్, బిసి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లిన ముగ్గురు మహిళలు, బాలుడు మృతి

**మనోహరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లిన ముగ్గురు మహిళలు, ఒక బాలుడు మృతి చెందిన సంఘటన మనోహరాబాద్ మండలం రంగాయపల్లిలోని ఊరచెరువులో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం గ్రామానికి చెందిన చంద్రయ్య కుటుంబం బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమీప బంధువులైన అంబర్‌పేట్‌కు చెందిన లక్ష్మి (30), బాలమణి (30), వారి కుమారుడు చరణ్ (8)లు వచ్చారు. చంద్రయ్య కూతురు లావణ్య (19)తో కలిసి ఉదయం ఊరచెరువుకు బట్టలు ఉతకడానికి వెళ్లారు. ఈ క్రమం లో బాలమణి కుమారుడు చరణ్ ప్రమాదశాత్తు చెరువులో పడగా తల్లి బాలమణి కుమా రుని కోసం చెరువులోకి దిగి నీటిలో మునిగింది. ఇది గమనించిన లావణ్య, లక్ష్మి ఒకరి తరువాత ఒకరు చెరువులోదిగి నీటమునిగి మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు చెరువు వద్దకు వెళ్లి ముగ్గురు మహిళల మృతదేహాలను వెలికి తీశారు. చరణ్ మృతదేహం కోసం చెరువులో గాలిస్తున్నారు. తూప్రాన్ డిఎస్పీ యాదగిరిరెడ్డి, సిఐ శ్రీధర్, మనోహరాబాద్ ఎస్ కరుణాకర్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యం

## ప్రతియేటా రూ. 500 కోట్లతో నాణ్యమైన మందులు

### టిఎస్‌ఎంఎస్‌ఐడిసి చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యాన్ని తీసుకువచ్చిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కిందని టిఎస్‌ఎంఎస్‌ఐడిసి చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను మరింత బలో పేతం చేస్తున్నామని ప్రతిసంవత్సరం 500కోట్ల రూపా యలను నాణ్యమైన మందులకు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని ఆయన అన్నారు. ఫార్మా సిస్టులు, నర్సులు అందిస్తున్న సేవలు మరువలేనవని ,వీరిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన అన్నారు. సోమ వారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆడిటోరియంలో తెలం గాణ ప్రభుత్వ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఫార్మసిస్ట్‌డే వేడుకలను నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వంద మల్టీనేషన్ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చు కుందని అన్ని ఆసుపత్రుల్లో మూడు నెలలకు సరిపడ మందులను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఆన్‌లైన్ విధానాన్ని అందబాటులోకి తీసుకువచ్చామని, ఫార్మాసిస్టులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 33జిలాల్లో మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ప్రభుత్వ ఆసుపత్రుల సంఖ్య కూడా పెరగుతుందని దీనికి షార్మాసిస్టులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 824 రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నామని, ఎక్కడ కూడా మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీవర్ ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ కె.శంకర్, అసిస్టెంట్ డ్రగ్ కంట్రోల్ రామకిషన్, ప్రభుత్వ ఫార్మా సిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు బత్తిని సుదర్శన్‌గౌడ్, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రాబర్ట్ బ్రూస్, ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు



సోమవారం సాయంత్రం నిరసన తెలుపుతున్న బిజెపి నేతలు

## ట్యాంక్‌బండ్‌పై ఆందోళనలు

### పోలీసులు అడ్డుకొనడంపై నిరసనలు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలు అడ్డుకోవద్దంటూ భాగ్యనగర్ గణేష్ ఉత్సవసమితి నేతలు విన్నవించినప్పటికీ ట్యాంక్‌బండ్‌పై గణేష్ నిమజ్జనాలు ప్రశ్నార్థకంగా మారాయి. తరతరాలుగా ట్యాంక్‌బండ్‌పైనే నిమజ్జనాలు చేస్తున్నాం ఇప్పుడూ ఇక్కడే చేస్తామని భక్తులు అంటున్నప్పటికీ, హైకోర్టు ఆదేశాల మేరకు ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ నేతలు కొందరు ట్యాంక్‌బండ్‌పై గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రయత్నించటంతో పోలీసులు అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. తర తరాలుగా మా తాత ముత్తాతల నుండి ఇక్కడే చేస్తున్నాం, ఇప్పుడూ ఇక్కడే చేస్తామంటూ వారు పట్టుపట్టటంతో పోలీసులకు బీజేపీ నేతలకు వాగ్వివాదం జరిగింది. హైకోర్టు స్టే ఉండగా చేయటానికి వీలు లేదని పోలీసులు అనుమతించకపోవటంతో వారు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీనితో అక్కడ కొంత ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకోవటంతో పోలీసులు వారిని దోమలగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించి, పరిస్థితి అదుపులోకి తెచ్చారు. మూడు నాలుగు రోజులలో దాదాపు జరగబోయే నిమజ్జనానికి నగరంలోని పలు ప్రాంతాల నుండి దాదాపు 15 వేల వరకు విగ్రహాలు ట్యాంక్‌బండ్‌పైకి వచ్చే అవకాశం ఉంది. ఒకవైపు హైకోర్టు స్టే, మరోవైపు ట్యాంక్‌బండ్‌పైనే నిమజ్జనాలు చేస్తామంటున్న భక్తులు, ఎటూ తేల్చి చెప్పని ప్రభుత్వంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. వినాయకచవితి మర్నాటి నుండే ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలు చేసేందుకు విగ్రహాలు వస్తూ ఉంటాయి, ఈ క్రమంలో హైకోర్టు స్టేతో ట్యాంక్‌బండ్‌పై క్రేన్‌లు ఏర్పాటు చేయకపోవటంతో నిమజ్జనాలు పోలీసులకు ఒక సవాల్‌గా మారింది.



## కాంగ్రెస్‌లో చేరికకు 'కుంభం' సిద్ధం

### ఆయన ఇంటికి వెళ్లి బుజ్జగించిన రేవంత్

**భువనగిరి, ప్రభాతవార్త :** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేసి ఇటీవలనే ముఖ్యమంత్రి కేసిఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తిరిగి సొంత గూడు అయిన కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధమయ్యారు. ఆయనను పార్టీలో చేర్చుకోడానికి టీపీసీసీ ఛీఫ్ రేవంత్‌రెడ్డి స్వయంగా హైద్రాబాద్‌లోని అనిల్‌కుమార్‌రెడ్డి ఇంటికి చేరుకుని చర్చలు జరిపారు. భువనగిరి అసెంబ్లీ కాంగ్రెస్ టిక్కెట్ ఆయనకు ఇస్తున్నట్లుగా రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లుగా తెలిసింది. అనిల్‌కుమార్‌రెడ్డి చేరిన నాటి నుండి ఆ పార్టీలో ఆయన తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వస్తారని అందరూ ఊహించిన విధంగానే పరిణామాలు జరుగుతున్నాయి. జూలై 24వ తేదీ ప్రగతిభవన్‌లో కేసిఆర్ చేతులమీదుగా కండువా కప్పుకుని టీఆర్ఎస్‌లో చేరిన రెండు నెలల అనంతరం కండువా మార్చి మూడు రంగుల కాంగ్రెస్ కండువాను మార్చుకోనున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరడం దాదాపు ఖరారు అయ్యింది. ఇక అధికారికంగా రాహూల్‌గాంధీ లేదా రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ సమక్షంలో చేరడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి ఇంటికి చేరుకుని చర్చలు జరిపి కాంగ్రెస్‌కు ఆహ్వానిస్తున్న నేపథ్యంలో తిరిగి అనిల్ కాంగ్రెస్ గూటికి చేరుతున్న కారణంగా భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు, ఆయన అభిమానులు బాణాసంచా పేల్చి సంబురాలు జరుపుకుంటున్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కోసం ఆశించిన వారంతా కూడా అనిల్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు.

## 10న కాంగ్రెస్ బిసి బహిరంగ సభ

### కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాక

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతుల జనాభా గణన పాలనలో భాగస్వామ్యం పెంపొందించేందుకు న్యాయమైన వాటా పొందటానికి అక్టోబర్ 10న షాదనగర్‌లో బహిరంగసభను ఏర్పాటు చేస్తున్నామని పిసిసి మాజీ అధ్యక్షుడు వి. హనుమంతరావు తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ కర్నాటక ముఖ్య మంత్రి సిద్దరామయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతారని హనుమంత రావు చెప్పారు.బిసి సబ్‌ప్లాన్ అమలు చేయాలని జనాభా దామాషాగా బడ్జెట్‌ను కేటాయించాలని ఆయన కోరారు.రాజకీయ ప్రాతినిధ్యం బిసిలకుపెంచాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ శాసనసభకు జరిగే ఎన్నికలలో బిసి అభ్యర్థుల సంఖ్య పెంచాలని హనుమంతరావు కోరారు.బిసి బహిరంగసభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఇన్ఫినిటీ లెర్న్‌బై శ్రీచైతన్య ద్వారా 2025 నాటికి రూ. 500 కోట్లు లక్ష్యం

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ 2023 ఫలితాల ఆధారిత అభ్యాసాన్ని అందించేదిగా భారతదేశ ఏకైక ఎడ్‌టెక్ ఫ్లాట్‌ఫామ్ అయిన ఇన్ఫినిటీ లెర్న్ బైశ్రీచైతన్య, ఎడ్‌టెక్ పరిశ్రమలో అత్యంత ఆశాజనకమైన స్టార్టప్‌గా తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటూ తన అద్భుత ఆర్థిక విజయాన్ని ప్రకటించడానికి గర్విస్తోంది. (సిరీస్ ఏ ఫండింగ్‌కు ముందు కూడా పీఏటీ(పన్ను తర్వాత లాభం) తటస్థంగా మారిన మొదటి కంపెనీ. మార్చి 31, 2022తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆడిట్ చేయబడిన ఆర్థిక ఫలితాలు అన్ని అంచనాలను మించిపోయాయి. శ్రేష్టత పట్ల తన తిరుగులేని నిబద్ధతను ప్రదర్శించాయి. వాటిలో ముఖ్యాంశాలు. ఇన్ఫినిటీ లెర్న్ 2021-22లో అద్భుతమైన వృద్ధిని ప్రదర్శిస్తూ 2022-23కి ఆడిట్ చేయబడిన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది.

కార్యకలాపాల ద్వారా కంపెనీ ఆదాయం 2021-22లో కేవలం 2.3 కోట్లుగా ఉండిన మొత్తంతో పోలిస్తే 2022-23లో రూ. 100 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో వ్యయాలలో కేవలం రెండింతలు పెరుగుదలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఇది మరింత ఆకర్షణీయంగా మారింది. రాబడి మరియు వ్యయస్థాయిలు రెండింటిలోనూ ఆకట్టుకునే పనితీరు 2022-23లో గత సంవత్సరంలో రూ. 37 కోట్ల నష్టంతో పోలిస్తే పీఏటీ స్థాయి బ్రేక్ ఈవెన్‌కు దారితీసింది. ఇదంతా రెండు సంవత్సరాల కార్యకలాపాలలోనే సాధ్యపడింది. ఇన్ఫినిటీ లెర్న్ బై శ్రీచైతన్య వ్యవస్థాపక సీఈవో ఉజ్వల్ సింగ్ ఈ ఫలితాలపై వ్యాఖ్యానిస్తూ ఎప్పుడూ అభివృద్ధి చెందుతున్న ఎడ్‌టెకన రంగంలో ముందుకు వెళ్తూ, ఇన్ఫినిటీ లెర్న్ ఈ సంవత్సరం అద్భుతమైన వృద్ధిని సాధించింది. రెండు ఏళ్లలోనే మేము ఉత్కృష్టత దిశగా మా అంకిత భావాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్లడమే కాకుండా, బాధ్యతాయుత వృద్ధిలో విజేతగా నిలిచాము. జాతీయంగా, అంతర్జాతీయంగా విద్యార్థులకు ప్రయోజనం కలిగించేలా విద్యాపరమైన అంతరాలను తొలగించగలిగాము.

# మైనంపల్లి చేరికతో కాంగ్రెస్‌లో జోష్

### బిఆర్ఎస్‌కు షాకిచ్చేందుకు సిద్ధమవుతున్న అసమ్మతి నేతలు

### మంత్రి హరీశ్‌రావు బుజ్జగింపులకు తలొగ్గని మైనం

### 27వ తేదీ తరువాత విడతల వారీగా చేరికలకు ఏర్పాట్లు



కాంగ్రెస్ పార్టీ జెండా ఇన్‌సెట్-మైనంపల్లి హనుమంతరావు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడంతో కాంగ్రెస్‌లో చేరుతారని వస్తున్న ఊహాగానాలకు సోమవారం మైనంపల్లి చెక్ పెట్టారు. అందరూ ఊహించిన విధంగానే తాను, తన కుమారుడు మైనంపల్లి రోహిత్ ఢిల్లీలో పెద్దల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరనున్నట్లు ప్రకటించారు. మైనంపల్లి కాంగ్రెస్ పార్టీలో చేరుతారని వార్తలు వచ్చినప్పటికీ ఆయనకు రెండు టికెట్ల హామీ ఇస్తేనే పార్టీలో చేరుతారని, కానీ ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ఒకే కుటుంబంలో రెండు టికెట్‌లు కేటాయించదని, దీంతో మైనంపల్లి చేరికకు బ్రేక్ పడుతుందని భావించారు. కానీ సోమవారం మైనంపల్లి హనుమంతరావు స్వయంగా ప్రకటించడంతో ఇక ఆయన చేరిక లాంఛనమే కానుంది. ఈ నెల 27వ తేదీ వరకు ముహుర్తాలు ఉన్నాయని, అంతలోపే తాను కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మైనంపల్లి కాంగ్రెస్‌లో చేరికతో మల్కాజ్‌గిరితో పాటు మెదక్ నియోజవర్గంలో రాజకీయ వేడి రాజుకుంటుంది. మల్కాజ్‌గిరిలో ఆయన చేరికను స్వాగతిస్తున్నప్పటికీ మెదక్ నియోజకవర్గంలో కొంత ఇబ్బంది కలిగే పరిస్థితులు నెలకొంటున్నాయి. కానీ మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అభ్యర్థి ఎవరైనా కలిసిగట్టుగా పనిచేసి గెలిపించాలనే నినాదం వినిపిస్తుంది. అంతేకాకుండా మైనంపల్లి రాకను పార్టీ పెద్దలు స్వాగతిస్తున్నామని చెప్పడంతో మైనంపల్లి అనుచరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో కొత్త జోష్ నెలకొంది.

**బిఆర్ఎస్‌కు షాకిచ్చేందుకు సిద్ధమవుతున్న అసమ్మతి నేతలు**

మైనంపల్లి హనుమంతరావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతుండటంతో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ అసమ్మతి నేతలు, మైనంపల్లి అనుచరులు సైతం బీఆర్ఎస్‌కు షాక్ ఇస్తూ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా మెదక్ నియోజకవర్గంలో గత కొంత కాలంగా స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కొసగని ద్వితీయ శ్రేణి నేతలు కిమ్మనక ఉన్నప్పటికీ మైనంపల్లి రాకతో ఆయనతో కలిసి పనిచేసి పద్మ ఓటమికి కృషి చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ అసమ్మతి నేతలు పద్మాదేవేందర్‌రెడ్డి ఓటమికి ఎలాంటి పరిస్థితులు అయినా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. దీంతో బీఆర్ఎస్ అసమ్మతి నేతలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన మెదక్ పట్టణంలో గత కొంత కాలంలో మైనంపల్లి రోహిత్ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ద్వితీయ శ్రేణి నేతలు పాపన్నపేట మండలంలోని మాజీ జెడ్పీటీసీ బాలాగౌడ్, ఎంపీపీ చందన, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ప్రశాంత్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ త్యార్ల రమేష్‌గుప్త, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఏడుపాయల చైర్మన్‌తో పాటు మండల పరిధిలోని బీఆర్ఎస్ నేతలు, వారి అనుచరులు, చిన్నశంకరంపేట మండలంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గంట నరేందర్, సంకాపూర్ తండా సర్పంచి రాజాసింగ్, వారి అనుచరులతో పాటు దాదాపు మండల పరిధిలోని 29 గ్రామ పంచాయితీల్లో ఉన్న 70 శాతం మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మైనంపల్లి వెంట నడిచే అవకాశం ఉంది. అదేవిధంగా రామాయంపేటలో మండల పార్టీ యూత్ అధ్యక్షులు శ్రీకాంత్ సాగర్, ఎస్టీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ మెగావత్ పండు రాథోడ్, వార్డు సభ్యులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, బీఆర్ఎస్ యువజన నాయకులతో పాటు పెద్దఎత్తున కార్యకర్తలు మైనంపల్లి వెంట కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం. 27న మైనంపల్లి హనుమంతరావు, రోహిత్‌లు అధికారికంగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న అనంతరం నియోజకవర్గాల్లోని గ్రామాల వారీగా పెద్దఎత్తున పార్టీ చేరికలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో మెదక్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉంది.

## గణేశ నిమజ్జనానికి విద్యుత్ శాఖ సిద్ధం

### ఎస్పీడిసిఎల్ సిఎండి రఘుమారెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి తమ సంస్థ సిద్ధమైందని ఎస్పీడీసీఎల్ సిఎండి జి రఘుమారెడ్డి తెలిపారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ నెల 28వ తేదీన నిర్వహించే గణేశ్ విగ్రహాల శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగినేందుకు తగు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ట్యాంక్‌బండ్ కంట్రోల్ రూంలను సోమవారం ప్రారంభించిన తదుపరి ఆయన మాట్లాడుతూ గణేశ్ నిమజ్జన కార్యక్రమంంలో అదనపు విద్యుత్ లోడ్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా అందుకు అనుగుణంగా 500 కెవిఏ ట్రాన్స్‌ఫర్మర్లు 30, 315 కెవిఏ ట్రాన్స్‌ఫర్మర్లు 32, 160 కెవిఏ ట్రాన్స్‌ఫర్మర్లు 27తో పాటు, దాదాపు 100 కిలో మీటర్ల మేర 11 కెవి ఎల్‌టి కేబుల్, పోల్స్, కండక్టర్లు వంటి వాటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో నిర్వహించే నిమజ్జన కార్యక్రమంలో విద్యుత్ సరఫరా తీరుతెన్నులను డైరక్టర్ జె శ్రీనివాసరెడ్డి, నగరంలో మిగిలిన చోట్ల ఇతర డైరక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. అలాగే ఇతర జోనల్, సర్కిల్ పరిధిల్లో చీఫ్ జనరల్ మేనేజర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు గణేశ్ నిమజ్జన కార్యక్రమాలకు విద్యుత్ సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరక్టర్లు టి శ్రీనివాస్‌రెడ్డి, సిహెచ్ మదన్‌మోహన్‌రావు, జి పర్వతం, ఎస్ స్వామిరెడ్డి, జి గోపాల్, చీఫ్ జనరల్ మేనేజర్లు ఎల్ పాండ్య, కే నరసింహస్వామి, ఎస్ఇలు పి బ్రహ్మాం, నర్సింహులు తదితర అధికారులు పాల్గొన్నారు.



## డీలిమిటేషన్‌లో దక్షిణాదికి సీట్లు తగ్గితే బలమైన ప్రజాఉద్యమం

### ప్రజావేదికలపై దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తే ఊరుకోమని మంత్రి కెటిఆర్ స్పష్టీకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 25:** డీలిమిటేషన్(పునర్విభజన)పై దక్షిణాది రాష్ట్రాల ఆందోళనను కేంద్ర ప్రభుత్వం వినాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కోరారు. దక్షిణ భారతదేశంలో సీట్లు తగ్గితే బలమైన ప్రజా ఉద్యమం వస్తుందని ఆయన హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రజలంతా భారతీయులుగా, ఉత్తమ పనితీరు కనబరిచే రాష్ట్రాల వాసులుగా గర్వపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్ దేశ అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక, దక్షిణాది రాష్ట్రాల గొంతును అణచివేయాలని చూస్తే మౌనం వహించేది లేదని మంత్రి కెటిఆర్ తేల్చి చెప్పారు. దేశంలోని ప్రజాస్వామిక వేదికపై మన ప్రజల గొంతుకలను, ప్రాతినిధ్యాన్ని అణచివేస్తే మనం మూగ ప్రేక్షకులుగా ఉండమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విషయాలను వింటుందని, న్యాయం గెలుస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఓ జాతీయ పత్రిక ప్రచురించిన డీలిమిటేషన్‌కు సంబంధించిన స్టోరీని మంత్రి కెటిఆర్ ట్విట్టర్ వేదికగా ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు. కథనంలో పేర్కొన్న గణాంకాలే నిజమైతే ప్రజా ఉద్యమం తప్పదని ఆయన స్పష్టం చేశారు. అయితే, దేశంలో ప్రస్తుత జనాభాను పరిగణలోకి తీసుకొని పార్లమెంట్‌లో నియోజకవర్గాల పునర్విభజన జరిపితే ఉత్తరాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరగనుండగా... దక్షిణాది రాష్ట్రాల్లో భారీగా స్థానాలు కోల్పోనున్నాయి. తాజా అంచనాల ప్రకారం ఉత్తరాది రాష్ట్రాలకు అదనంగా దాదాపు 32 స్థానాలు కలిసి వస్తుండగా... సౌత్ ఇండియాకు చెందిన ఆయా రాష్ట్రాలు దాదాపు 24 స్థానాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక తమిళనాడులో ప్రస్తుతం 39 పార్లమెంట్ స్థానాలు ఉండగా, డీలిమిటేషన్ తర్వాత అవి 31కి తగ్గుతాయి. తెలంగాణ, ఏపీ, కేరళ నుంచి 8 స్థానాలు, కర్ణాటక రెండు స్థానాలు కోల్పోనుంది. అటు మధ్యప్రదేశ్‌లో(29 నుంచి 33 వరకు) నాలుగు, రాజస్తాన్‌లో(25 నుంచి 31 వరకు) 6, బిహార్‌లో(40 నుంచి 50 వరకు) 10, ఉత్తరప్రదేశ్‌లో(80 నుంచి 91 వరకు) 11 స్థానాలు అదనంగా పెరిగే అవకాశం ఉంది. జనాభా ప్రాతిపదికన.. దేశంలో, రాష్ట్రాల్లో చట్టసభల నియోజకవర్గాల సంఖ్య, పరిధులను నిర్ణయించే ప్రక్రియనే డీలిమిటేషన్ అంటారు. మారుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకని ఎప్పటికప్పుడు ఈ మార్పులు, చేర్పులు చేసుకునేలా రాజ్యాంగం ఇచ్చిన వెసులుబాటు డీలిమిటేషన్.

## సర్కారియా కమిషన్ ప్రకారం తమిళిసై గవర్నర్‌గా ఉండకూడదు: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 25:** దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించడం దారుణమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉన్న అత్యంత వెనకబడిన వర్గాలకు చెందిన వారిద్దరూ... బిఆర్ఎస్ సభ్యులుగా ఉన్నందునే అనర్హులనడం కరెక్ట్ కాదని మంత్రి వ్యాఖ్యానించారు. అలాంటప్పుడు తమిళనాడు బిజెపి అధ్యక్షురాలిగా చేసిన తమిళిసై... తెలంగాణ గవర్నర్‌గా ఎలా ఉంటారని మండిపడ్డారు. పార్టీ అధ్యక్షురాలిగా ఉన్న వ్యక్తికి రాష్ట్ర గవర్నర్‌గా ఇవ్వచ్చా అని ప్రశ్నించారు. సర్కారియా కమిషన్ ప్రతిపాదనల ప్రకారం గవర్నర్ పదవిలో తమిళిసై ఉండవద్దు కదా అని మంత్రి పేర్కొన్నారు. బిజెపికి చెందిన గులాం అలీ ఖతాను రాష్ట్రపతి కోటాలో రాజ్యసభకు పంపలేదా అని ప్రశ్నించారు.

## సత్యేంద్రజైన్ మధ్యంతర బెయిల్ పొడిగింపు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ నేత సత్యేంద్ర జైన్‌కు గతంలో ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను సుప్రీం కోర్టు మరోసారి పొడిగించింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ మధ్యంతర బెయిల్‌ను అక్టోబర్ తొమ్మిదవ తేదీ వరకు పొడిస్తూ సుప్రీం ధర్మాసనం సోమ వారం ఆదేశాలు జారీ చేసింది. మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన జైన్‌కు మొదట మే నెల 26వ తేదీ వరకు వైద్యపరమైన బెయిల్‌ను మంజూరు చేయడం తెలిసిందే.

## కొత్త పార్లమెంటు వేదికగా మహిళలకు మోసం

### అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీతా డిసౌజా

**హైరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** మహిళా రిజర్వేషన్ బిల్లుతో భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం కొత్త పార్లమెంటు వేదికగా మహిళలను మోసం చేసిందని తక్షణం జరిగే ఎన్నికల్లో అమలు చేయడానికి వీలు లేని ఈ బిల్లును పాస్ చేయడానికి ఎందుకు ప్రత్యేక పార్లమెంటు సెషన్ పెట్టారని ఏఐసిసి జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నెట్టాడిసౌజా విమర్శించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షరాలు సునీతారావ్‌తో కలిసి సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ నారీ శక్తీ వందన్ బిల్లు 2034కు ముందు అమలు చేయడంకు సాధ్యం కాదు అని ఆమె అన్నారు. పంచాయతీరాజ్ స్థానిక సంస్థలలో మహిళా బిల్లును అమలు చేసిన ఘనత రాజీవ్‌గాంధీకే వుందని అన్నారు.

## చంద్రబాబు పిటిషన్లపై విచారణను ..

≫ నివేదికను సీఐడీ అధికారులు సీల్డ్ కవర్‌లో న్యాయస్థానానికి అందజేసారు.మరో అయిదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేసారు.తొలుత బెయిల్ పిటిషన్‌పై విచారించాలని చంద్రబాబు తరపు న్యాయవాదులు కోరారు.ముందుగా కస్టడీ పిటిషన్‌ను విచారించాలని సీఐడీ న్యాయవాదులు అభ్యర్థించారు.ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం విచారణను మంగళవారానికి వాయిదా వేసింది,చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సోమవారం ఉదయం సీఐడీ న్యాయవాది ఏసీబీ కోర్టులో కౌంటర్ దాఖలు చేసారు.కౌంటర్‌లో సవరణలు చేసి ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశిస్తూ మధ్యాహ్నానికి వాయిదా వేసారు.తరువాత న్యాయమూర్తి విచారణను ప్రారంభించిన సందర్భంలో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై ముందు విచారణ కొనసాగించాలని కోరారు.

అయితే సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న దశలో ఏలా బెయిల్ పిటిషన్‌పై ముందుగా నిర్ణయం తీసుకుంటామని న్యాయమూర్తి తెలిపారు.ఆ తరువాత న్యాయమూర్తి సీఐడీ కస్టడీ అంశంపై ఉభయ పక్ష న్యాయవాదుల వాదనలను విన్నారు.ఈ కేసుతో పాటు,చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పైన విచారణ మంగళవారానికి వాయిదా పడింది.స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో నేరాభియోగాలు ఎదుర్కొంటున్న చంద్రబాబును ఏసీబీ కోర్టు ఆదేశాల మేరకు సీఐడీ కస్టడీకి తీసుకుంది.

న్యాయవాదుల సమక్షంలో రాజమండ్రి సెంట్రల్ జైలు రెండు విచారణ నిర్వహించి ఆయనను వర్చువల్‌గా ఏసీబీ కోర్టు ఎదుట హాజరు పర్చింది.ఏసీబీ కోర్టు ఆయన రిమాండ్‌ను మరో 11 రోజుల పాటు పొడిగించింది.ఈ నేపథ్యంలో సీఐడీ ఆయనను మరో అయిదు రోజులు కస్టడీకి కోరింది.ఆయన రెండు రోజులపాటు కస్టడీ జరిపిన విచారణ సహకరించలేదని కోర్టుకు తెలిపింది.ఇదే సమయంలో కస్టడీ పిటిషన్ పొడిగింపు అంశంపై సీఐడీ వాదనకు చంద్రబాబు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు.ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.ఈ క్రమంలో విచారణను ఏసీబీ కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది.



నియామకపత్రం అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

## ప్రజల దీవెనలు పొందగలిగే అదృష్టం ఫార్మసిస్టులకే

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

### 310 మంది ఫార్మసిస్టులకు నియామకపత్రాల అందజేత

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** ఫార్మసిస్టుగా ప్రభుత్వ ఉద్యోగం దొరకడమొక అదృష్టంతోపాటు నేరుగా ప్రజలకు సేవచేసే అవకాశం లభిస్తుందని, వందలమందికి డాక్టర్లు వ్రాసిన మందుల వివరాలు అర్థమయ్యేరీతిలో చెప్పితే సంతోషంతో దీవెనలు, ప్రేమాభిమానాలు చూపిస్తారని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థికశాఖల మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అంతర్జాతీయ ఫార్మాసిస్టుల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖల మంత్రి హరీష్‌రావు, డా. జి.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాస్, డా. కె.రమేష్‌రెడ్డి తదితరులతో కలిసి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ కమిసన్ ద్వారా ఎంపికైన తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ కుటుంబంలో చేరబోతున్న 310మంది ఫార్మాసిస్టులకు అభినందనలు తెలుపుతూ నియామకపత్రాలను, ప్లేస్ ఆఫ్ పోస్టింగ్ ఆర్డర్లను అందజేసి సంతోషాన్ని వ్యక్తపరుస్తూ వైద్య ఆరోగ్యశాఖలోకి స్వాగతం సుస్వాగతమన్నారు. వైద్యఆరోగ్యశాఖలో ఎంతోమంది నియామకాలు చేశాం కానీ ఫార్మాసిస్టుల నియామకంలో జాప్యం ఏర్పడిందని, నేడు మీ నియామకంతో ఉన్న కొరత తీరడంతోపాటు ఫార్మసీలు కూడా బలోపేతమవుతాయని విశ్వసిస్తున్నాన న్నారు. మంచిగా పనిచేసి ప్రజలకు సేవలుచేస్తూ వారి ప్రేమా భిమానాలు పొందుతూ ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని హరీష్‌రావు సూచించారు.

## దేవాదాయ శాఖకు త్వరలో కొత్త వెబ్‌సైట్

### భూముల వివాదాలు, కేసుల విచారణ, తీర్పుల వివరాలన్నీ ఇందులోనే

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ దేవాదాయ శాఖ త్వరలో కొత్త వెబ్ సైట్ అందుబాటులోకి తీసుకు రానుంది. రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ప్రధాన దేవాలయాలతో పాటు మిగతా అన్ని దేవాలయాల భూముల వివరాలను ఇందులో పొందుపర్చనున్నారు. అంతేకాకుండా ఈ శాఖ సుదీర్ఘ కాలంగా భూములకు సంబంధించి ఎదుర్కొంటున్న వివిదాలతో పాటు, కేసుల విచారణ, తీర్పులకు సంబంధించిన పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం కానున్నాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5162 దేవాలయాలు ఉండగా, వీటిలో యాదాద్రి, భద్రాచలం, వేములవాడ, జోగులాంబ, గణేష్ దేవాలయాలు ప్రధాన దేవాలయాలుగా విరాజిల్లుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని పలు దేవాలయాల పరిధిలోని వాణిజ్యపరంగా ఎంతో డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో వందలాది ఎకరాలు ఉన్నాయి. ఇవే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాలలో వందలాది దేవాలయాలు భక్తుల విశ్వాసానికి నెలవై ఉన్నాయి. తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన దేవుని మాన్యాల ఆక్రమణలు, ట్రస్ట్ బోర్డులు, హక్కుదారుల వివాదాల కేసులన్నీ ఈ ట్రైబ్యునల్‌లో నమోదవుతున్నాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా దేవాలయాల భూములు అన్యాక్రాంతం అవుతున్న విషయంపై పాలకులు ఆరా తీయడంతో పాటు వాటిని తిరిగి దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు.


## కొత్తవారు వచ్చినా పాతవారి ప్రాధ్యాత తగ్గదు: మధుయాష్కీ

### మల్కాజిగిరి డిసిసి అధ్యక్షుడు 'నందికంటి'ని బుజ్జగింపు

**హైరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కాంగ్రెస్‌లో చేరికకు మార్గం సుగమం అయింది. సోమవారం మల్కాజిగిరి డిసిసి అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ నివాసంకు సీనియర్ నేతలు సిఎల్‌పి నాయకుడు భట్టీ విక్రమార్క, తెలంగాణ శాసనసభ ఎన్నికల ప్రచారకమిటీ చైర్మన్ మధుయాష్కి, వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమాం గౌడ్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి చేరుకొని ఆయనను బుజ్జగించారు. నందికంటి ఇంటిలో నివాసం అనంతరం ఎమ్మెల్యే మైనంపల్లి ఇంటికి శ్రీధర్‌ను తీసుకొని సీనియర్ నాయకులు వెళ్ళారు.అక్కడ తెలంగాణ ప్రచారమిటీ చైర్మన్ మధు యాష్కి మాట్లాడుతూ కొత్తవారు పార్టీలోకి వచ్చినా పాతవారి ప్రాధాన్యత తగ్గదని అన్నారు. సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క ఇంటికి ఉదయం టిపిసిసి బిసి నేతలు వెళ్ళి వినతి పత్రం అందించారు. భట్టివిక్రమార్కను టిపిసిసి మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ తదితరులు కలిసి ఆదివారం గాంధీ భవన్‌లో జరిగిన ఓబిసి సమావేశం తీర్మానాలు వివరించారు.

# యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా 'మ్యాడ్'

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తెలుగు చిత్ర సీమలో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటి.. విభిన్న చిత్రాలను అందిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నఈ నిర్మాణ సంస్థ ఇపుడొక యూత్‌ఫుల్ అండ్ క్రేజీ ఎంటర్‌టైనర్ ' మ్యాడ్'తో అలరించటానికి వస్తోంది... ఈచిత్రం పూర్తిగా యువ తారాగణంతో రూపొందింది.. హారిక సూర్యదేవర ఈచిత్రంతో నిర్మాతగా పరిచయం అవుతున్నారు.. సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.. ఈచిత్రంతో కళ్యాణ్ శంకర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.. ఈ వినోదాత్మక చిత్రంలో సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ శ్రీ గౌరీ



ప్రియారెడ్డి అవంతిక సనీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా నిర్మాతలు ఈ సెన్సే షనల్ క్రేజీ ఎంటర్‌టైనర్‌ను అక్టోబర్6న విడుదల చేయనున్నట్టు ప్రకటిం చారు. ఇప్పటికే ఈసినిమా నుంచి విడుదలైన టీజర్, పాటలు, ఇతర ప్రచార చిత్రాలు ఆకట్టుకుని సినిమాపై ఆసక్తినిపెం చేశాయి... ఈ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌కి ఫోర్ సినిమాపై సాయిసౌజన్య సహనిర్మాతగా వ్యవహ రిస్తున్నారు.. బీమ్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ మాలి ఎడిటింగ్ బాధ్య తలు నిర్వహిస్తున్నారు.. క్రేజీయెస్ట్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ మ్యాడ్ చిత్రం యువతను విశేషంగా ఆకట్టుకుని, బ్లాక్‌బస్టర్ అందుకోవటం ఖాయమని నిర్మాతలు నమ్మకంగా ఉన్నారు.

# ప్రేక్షకుల ఆదరణకు ధన్యవాదాలు

## -'రుద్రం కోట' సక్సెస్‌మీట్‌లో నటి జయలలిత

సీనియర్ నటి జయలలిత సమర్పకురాలిగా వ్యవహరిస్తూ ఓ కీలకపాత్రలోనటించిన చిత్రం 'రుద్రం కోట'.. ఏఆర్‌కె విజువల్స్ పతాకంపై రాము కోన దర్శకత్వంలో అనిల్ ఆర్కా కండవల్లి ఈచిత్రాన్నినిర్మించారు.. అనీలన, విభీష, అలేఖ హీరోహీరోయిన్లుగా నటించారు.. ఈచిత్రం ఈనెల22న స్క్రీన్ మాక్స్ సంస్థ ద్వారా 200 థియేటర్లకు పైగా విడుదలై పాజిటివ్ టాక్‌తో రన్ అవుతోంది.. ఈసందర్భంగా తాజాగా ఫిలిం ఛాంబర్‌లో టీమ్ సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది... చిత్ర సమర్పకురాలు, నటి జయలలిత మాట్లాడారు.. ఈచిత్రాన్ని ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు అన్నారు. విడుదలైన అన్ని ఏరియాల నుంచి మంచి స్పందన వస్తోం దన్నారు.. కథ, కథనాలతోపాటు సంగీతం, దర్శకత్వం,నటీనటుల పెర్ఫామెన్స్ ,నా పాత్ర చాలా



ప్రతి అంశం గురించి ఆడియెన్స మాట్లాడుతున్నారని అన్నారు. చూడనివారు మా చిత్రాన్ని చూసి ఇంకా పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నానని అన్నారు. దర్శకుడు రాము కోన మాట్లాడుతూ, జయలలితగారు ఎంతో సపోర్ట్‌చేశారన్నారు. మా టీం అంతా చాలా కష్టపడిందన్నారు.. ఆ కష్టానికి తగ్గ ఫలితం ఈ రోజు మాకు దక్కిందన్నారు.. అందరికీ థియేటర్స్ దొరకటం పెద్ద సమస్యగా మారిందన్నారు. మా చిత్రం అలాంటి సమస్యలేకుండా స్క్రీన్‌మాక్స్ వారు 200 థియేటర్లలో భారీగా రిలీజ్ చేశారని అన్నారు. గుంటూరులోని కొన్ని థియేటర్లను సందర్శించినట్టు తెలిపారు. మంచి స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ విభీష, హీరో అనిల్ మాట్లాడారు.

# ప్రపంచంలో రైతుకు మొదటిస్థానం ఇవ్వాలనే.. 'మగపులి'

ఎంబిడబ్ల్యుడిఏ సమర్పణలో సమర సింహారెడ్డి, ఆక్సా ఖాన్ జంటగా తెలుగు శ్రీను దర్శకత్వంలో నారాయణస్వామి నిర్మిస్తున్న చిత్రం 'మగపులి'.. (ఫార్మర్ ఈజ్ ది ఫస్ట్ సిటిజన్ ఆఫ్ ది వరల్డ్ అనేది ట్యాగ్‌లైన్).. ఈచిత్రం ప్రారంభోత్సవం సోమవారం హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లోజరిగింది.. పూజా కార్యక్రమాల అనంతరం హీరో,. హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ నటుడు సుమన్‌క్లాప్ ఇచ్చారు. రైతు టి.రంగడు కెమెరా స్విచ్చాన్ చేశారు. అనంతరం యూనిట్ మీడియాతో మాట్లాడింది. చిత్ర దర్శకుడు తెలుగు శ్రీను మాట్లాడుతూ, ఇది నాకు నాల్గవ సినిమా అన్నారు. నిర్మాత నారాయణస్వామికి నేను చెప్పిన కథ




నచ్చగానే ఈ సినిమా చేద్దామన్నారని, అందుకు వారికి ధన్యవాదాలు అన్నారు.. ప్రస్తుతం దేశంలో నిరుద్యోగం, రైతుల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, అలాగే రైతులు పండించిన పంటను ప్రజలకు చేరవేయటంలో డ్రైవర్లు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని అన్నారు. అందుకే నిరుద్యోగులు, రైతులు, డ్రైవర్లు, రాజకీయ నాయకులపై ఈ సినిమా ఉంటుందన్నారు.. నిరుదోయగ సమస్యల వలన చాలా మంది వెనుకబడి ఉన్నారని, రాజకీయ నాయకులు కూడ ఉన్నవారే పదవులు అనుభవిస్తూ నెక్స్ట్ జనరేషన్‌కు ఛాన్స్ ఇవ్వకపోవటం వలనే నిరుద్యోగ సమస్య వస్తోందనే కాన్సెప్ట్‌తో ఈసినిమాను తీస్తున్నామన్నారు. మా సినిమలోనటిస్తున్న సీనియర్ హీరో సుమన్, బాహుబలి ప్రభాకర్, రఘు బాబు, సుధ గార్లకు ధన్యవాదాలు అన్నారు. అక్టోబర్ మొదటి వారం లో షూటింగ్‌స్టార్ట్ అవుతుందన్నారు. మూడు షెడ్యూల్స్‌లో కంప్లీట్ చేసి త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామని అన్నారు. సీనియర్ నటుడు సుమన్ మాట్లాడుతూ, దర్శకుడు చెప్పిన కథపై నాకు చాలా ఇంట్రెస్ట్ కలిగిందన్నారు. నిరుద్యోగ సమస్యపై సినిమా తీయటం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హీరోసమర సింహారెడ్డి, హీరోయిన్ అక్సా ఖాన్ తదితరులు మాట్లాడారు.

# 'చంద్రముఖి-2' అందరికీ నచ్చుతుంది

స్టార్ కొరియోగ్రాఫర్, యాక్టర్, ప్రొడ్యూసర్, డైరెక్టర్ రాఘవ లారెన్స్ హీరోగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ టైటిల్ పాత్రలోనటించిన భారీ బడ్జెట్ మూవీ 'చంద్రముఖి-2'. అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించారు. ఈచిత్రాన్ని సీనియర్ దర్శకుడు పి. వాసు తెరకెక్కించారు.. తెలుగు, తమిళ,హిందీ, మలయాళ భాషల్లో

## ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రాఘవ లారెన్స్

పాన్‌ఇండియా మూవీగా ఈనెల 28న విడుదల కానుంది.. తెలుగు రాష్ట్రాల్లో చంద్రముఖి2ను శ్రీలక్ష్మీ మూవీస్ బ్యానర్‌పై రిలీజ్ చేస్తున్నారు.. ఈసందర్భంగా తాజాగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను యూవి మీడియా నిర్వహించింది.. రాఘవలారెన్స్ మాట్లాడుతూ, రెబల్ తర్వాత నాకు డైరెక్షన్ ఏసే టైం కుదరలేదని, ఇలా చంద్రముఖి2 సినిమాతో మీ ముందుకు వస్తున్నానని అన్నారు. తెలుగు ప్రేక్షకులు ఏమీ ఆశించకుండా ప్రేమిస్తుంటారని తెలిపారు. నేను ఎపుడూ దేవుడ్ని చూడలేదని, ఈ ప్రేమ పేరే దేవుడని అనుకుంటున్నానని అన్నారు.. నేను డ్యాన్స్ కంపోజ్ చేసిన ప్రతి హీరో అభిమాని నాకు ఫ్యాన్ అయ్యారన్నారు.. నాకు చాన్స్ ఇచ్చి హీరోలందరికీ థాంక్స్ అన్నారు.. ఈసినిమా విషయానికొస్తే.. ఫస్ట్ థాంక్స్ సూపర్‌స్టార్ రజనీకాంత్‌గారికి చెప్పాలనాననరు.. ఆయన నటించిన చిత్రంలో నేను నటించానని అన్నారు. వాసు గారు కథ చెప్పారని, నేను చేయొచ్చాఅని అడిగానని అన్నారు. ఆల్‌దిబెస్ట్



అని చెప్పారనాననరు. నా లైఫ్‌లో నేను ఈ ముగ్గురునీ మర్చిపోలేనని అన్నారు.రజనీకాంత్‌గారు లేకపోతే నేనుడ ఇక్కడ ఉండేవాడినన కాదన్నారు. మెగాస్టార్ చిరంజీవిగారు లేకపోతే మీ అభిమానం నాకు దక్కేది కాదన్నారు. డైరెక్షన్ చాన్స్ నాగార్జున గారు ఇచ్చారన్నారు.. నిర్మాత ఎన్వీప్రసాద్ మాట్లాడుతూ,లైకా నాకు సొంత బ్యానర్ లాంటిదన్నారు. చంద్రముఖి2 సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నామని తెలిపారు.. ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందన్నారు. పి.వాసు మాట్లాడుతూ, మాకు ఈ సినిమాను ఇచ్చిన లైకా ప్రొడక్షన్స్ వారికి ధన్యవాదాలు అన్నారు.. నా సినిమాలోపనిచేసిన అందరికీ థాంక్స్ అనాననరు. మా నాన్న పీతాంబరం గారు లేకపోయి ఉంటే మేం ఇక్కడ ఉండేవాళ్లం కాదన్నారు. మా గాడ్‌ఫాదర్ ఎన్టీఆర్‌గారే మాకు అన్నీ ఇచ్చారన్నారు. మొదటి పార్ట్‌కు విద్యాసాగర్ గారుచేశారని, రెండోపాటకు కీరవాణిగారురావటం మా అదృష్టం అన్నారు. కార్యక్రమంలో కంగనా రనౌత్, ఎంఎం కీరవాణి, మహిమా నంబియార్,రైటర్ చైతన్య ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

**విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందిన చిత్రం పెదకాపు1, ద్వారకాక్రియేషన్స్ బ్యానర్‌పై మిర్యాల రవీందర్‌రెడ్డి ఈచిత్రాన్ని నిర్మించారు.. ఈనెల 29న ఈచిత్రం విడుదల కానుంది.. ఈనేపథ్యంలోహీరోయిన్‌గా నటించిన ప్రగతి శ్రీవాస్తవ మీడియాతో మాట్లాడారు.**

vaartha.com



## ఛాలెంజింగ్ రోల్ చేశా.

**కథ విన్నపుడు ఎలా అన్పించింది?**

కథను శ్రీకాంత్‌గారు చెప్పినపుడు చాలా నచ్చింది. మొదటి నుంచి చివరి వరకు మంచి సస్పెన్స్‌తో చాలా క్యాచీగా అన్పించింది. పెదకాపు కథ చాలా ఆసక్తికరంగా ఉంటుంది

**ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు?**

పెదకాపు నాకు రీ ఇంట్రడక్షన్ అని చెప్పాలి... ఇంతకుముందు మను చరిత్ర అనే సినిమాచేశాను. తర్వాత కోవిడ్ వచ్చింది..దీంతో ముంబైకి వచ్చేవాను.. తర్వాత ఈసినిమా కోసం ఆడిషన్ ఇచ్చి సెలక్ట్ అయ్యా.

**మీ పాత్ర ఎలా ఉంటుంది?**

పెదకాపులోనా పాత్ర చాలా కీలకంగా ఉంటుంది.. నా పాత్రే కాదు ఇందులో ఉండే అన్ని పాత్రలు కథలో కీలకంగా ఉంటాయి.. దర్శకుడు శ్రీకాంత్ గారి గత చిత్రాలు చూశాను.. ఆయన సినిమాల్లో హీరోయిన్ పాత్రలుచాలా బలంగా ఉంటాయి.. ఇందులో కూడ నా పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది.

**షూటింగ్ సమయంలో మీరు ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?**

పెద్దగా సవాళ్లు లేవనేచెప్పాలి.. ఎందుకంటే ముందే వర్క్‌షాప్ చేశాం.. మందుగానే రీసెర్చ్ చేసుకున్నాం. మంచి టీం కుదిరింది..దర్శకుడు ప్రతి పాత్ర విషయంలో ముందే క్లారిటీగా చెప్పారు. ఆ పాత్ర ఏంచేస్తుందో తెలుసు కాబట్టి అందులో జీవించే అవకాశం దొరింది.. డైరెక్షన్ టీం చాలా హార్డ్‌వర్క్ చేసింది. .

**విరాట్ కర్ణతో వర్క్‌చేయటం ఎలా అన్పించింది?**

విరాట్ కర్ణ చాలా సపోర్టివ్ కోస్టార్.. ఈసినిమాలో తన పాత్ర ప్రయాణం అద్భుతంగా ఉంటుంది.. ఆ పాత్రలో అందరూ కనెక్ట్ అవుతారు.. తనపెర్ఫామెన్స్ బ్రిలియంట్‌గా ఉంటుంది.

**ఒక నటిగా మీకు స్ఫూర్తి ఎవరు?**

సమంతగారి సినిమాలు ఇష్టం.. అలాగే తాప్సీగారు చేసిన కొన్ని సినిమాలుకూడ ఇష్టం.. చాలా మంచి కథలు ఎంపిక చేసుకుంటారు.. అలాగే త్రిషగారి సినిమాలు కూడ ఇష్టం.

**తెలుగులో ఏ హీరోతో వర్క్‌చేయాలని అనుకుంటున్నారు?**

చాలా మంది ఉన్నారు.. ముగ్గురు పేర్లు చెప్పాలంటే. వరుణ్‌తేజ్ గారితో వర్క్ చేయాలని ఉంది.. అలాగే రామ్‌చరణ్, ప్రభాస్‌గారితో వర్క్‌చేయాలనిఉంది.

**కొత్తగా చేస్తున్న సినిమాలు?**

'గంగం గణేశా' చేస్తున్నా... అలాగే మరికొన్ని కథలు వింటున్నాను.

# 'బర్మా' ప్రారంభం



టీవీ షోస్‌లో తన అద్భుతమైన నటనతో బుల్లితెర ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న నటుడు రక్ష్ రామ్,.ఎంతో ఆసక్తిగా ఎదురుచూసునతన్న యాక్షన్ థ్రిల్లర్ బర్మాతో వెండితెరకు ఎంట్రీ ఇస్తున్నారు. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈచిత్రం పాన్‌ఇండియాగా విడుదల కానుంది. చేతన్‌కుమార్ బర్మాకు దర్శకత్వం వహిస్తున్నారు. బర్మా ముహూర్తం వేడుక బసవం గుడిలోని దొడ్డ గణపతి ఆలయంలో వైభవంగా జరిగింది. అశ్విని పునీత్ రాజ్‌కుమార్ క్లాప్ అందించారు..రాఘవేంద్ర రాజ్‌కుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు.. యాక్షన్ ప్రిన్స్ ధృవ సర్జా తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. ఆదిత్య మీనన్, దీపక్‌శెట్టి ఇతర కీలకపాత్రల్లో నటిస్తున్నారు. అక్టోబర్‌లో ప్రొడక్షన్‌లోకి వెళ్లనుంది.

# మరోవైవిధ్యమైన కథాంశంతో..



స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్‌రాజు, శిరీష్ ఓవైపు శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ హీరోల తో సినిమాలు చేస్తూనే మరోవైపు దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్‌పై డిఫరెంట్ చిత్రాలను రూపొందిస్తున్నారు.. తాజాగా దిల్‌రాజు నిర్మాతగా, దర్శకుడు రవి కిరణ్ కోలా ఈసినిమా తెరకెక్కనుంది.. మరోవైవిధ్యమైన కథాంశంతో తెలుగుప్రేక్షకులను మెప్పించటానికి దిల్‌రాజు, శిరీష్, రవి కిరణ్ కోలా సిద్ధమవుతున్నారు.. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన వివరాలను ప్రకటిస్తామని యూనిట్ సభ్యులుతెలిపారు.

# పొలిటికల్ సెటైరికల్ 'జనం'

విఆర్‌పి క్రియేషన్స్ పతాకంపై శ్రీమతి పి.పద్మావతి సమర్పణలో సుమన్, అజయ్‌ఘోష్, కిషోర్, వెంకటరమణ, ప్రగ్య నైనా ప్రధానపాత్రల్లో నటిస్తున్న చిత్రం జనం... వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు.. ఈచిత్రం ట్రైలర్‌ను సోమవారం ఫిలిం చాంబర్‌లో విడుదల చేశారు.. నటుడు సుమన్, అజయ్‌ఘోష్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సాయి వెంకట్, దర్శకుడు వి.సముద్ర, దర్శక,నిర్మాత పసుపులేటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. సుమన్ మాట్లాడుతూ,



ఒంగోలులోషూటింగ్ జరిపామనాననరు. నేటిభారతం కోవలో వస్తున్న చిత్రమన్నారు. నటి సుజాత, దర్శక, నిర్మాత పసుపులేటి వెంకటరమణ తదితరులు ప్రసంగించారు. ప్రగ్న గౌతమ్, సుజాత, జయవాణి, ఆదిత్య నాగేంద్ర, క్రిష్, లక్కీ,సింధు, రిషిత తదతరులు నటిస్తున్నారు.

# సందీప్ కిషన్ కొత్త చిత్రం ప్రారంభం

హీరో సందీప్‌కిషన్ విభిన్న తరహా చిత్రాలతోతన వైవిధ్యం కనబరుస్తూ తెలుగుతోపాటు తమిళంలో నూ మంచి ఫాలోయింగ్‌ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఊరుపేరు భైరవకోన చిత్రం చేస్తున్న ఆయన ఆ బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం 26 చేయటానికి సైన్ చేశారు. మాయవన్ బ్లాక్‌బస్టర్ తర్వాత హీరో సందీప్, దర్శకుడు సివి కుమార్ ఈచిత్రం కోసం మరోసారి కలిసి పనిచేస్తున్నారు.. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై.లి సమర్పణలో రాంబ్రహ్మం సుంకర ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తునాననరు. కిశోర్ గరికపాటి ఎగ్జిక్యూటివ్



ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.. మాయవన్ వరల్డ్ నేపథ్యంలో సాగే సైన్‌ఫిక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది.. మాయవన్‌కి సీక్వెల్ కానుంది.. సూపర్‌విజన్‌తోఒక సామాన్యుడి ఘర్షణ కథగా ఉండనుంది.. సోమవారం లాంఛనంగా పూజా కార్యక్రమాలతో సినిమా ప్రారంభమైంది.. తొలి సన్నివేశానికి దామోదర్ ప్రసాద్ క్లాప్ ఇచ్చారు. వెంకట్ బోయనపల్లి కెమెరా స్విచ్చాన్ చేశారు.. తొలిషాట్‌కు జెమినీ కిరణ్ దర్శకత్వం వహించారు.. నవంబర్‌లోసినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని మేకర్స్‌తెలిపారు. టైటిల్ ఇంకా ఫిక్స్ చేయలేదు..ప్రముఖ తారాగణం నటిస్తోంది.. మరిన్ని వివరాలను త్వరలోవెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు.

# న్యూజిలాండ్‌లో 'కన్నప్ప' ప్రయాణం



ప్రామిసింగ్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్టు భక్తకన్నప్ప అడ్వెంచరస్ జర్నీ సోమవారం న్యూజిలాండ్‌లో ప్రారంభమైంది.. అవా ఎంటర్‌టైన్ మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై విష్ణు మంచు ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు.. మహాభారత్ సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించను న్నారు.. మంచు విష్ణు ఈసినిమాను భారీఎత్తున అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.. హై టెక్నికల్ వాల్యూస్‌తో కన్నప్ప సినిమా రాబోతోంది.. ఈమూవీలో ప్రభాస్ కూడ ఓ ముఖ్యపాత్రలో నటిస్తు న్నారు.. పరుచూరి గోపాల కృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ రచయి తలు.. ఈ సినిమా షూట్‌కు సంబంధించిన ప్రకటనను మంచు విష్ణు ట్వీట్ చేశారు.. తన డ్రీమ్ ప్రాజెక్టు కన్నప్పను తెరకెక్కించే క్రమంలో తోడ్పడుతున్న ప్రతి ఒక్కరికీ ఆయన థాంక్స్ చెప్పారు. న్యూజిలాండ్‌లోని అద్భుతమైన లొకేషన్లలో కన్నప్ప షూటింగ్‌ను ప్రారం భిస్తున్నామని, ఆ శివ పార్వతుల ఆశీస్సులతో ఏడేళ్ల నా శ్రమ, కల నిజం కాబోతోందని అన్నారు.. ఈసినిమా కోనసం గత ఎనిమిది నెలలుగా టీం అంతా కూడ నిద్రలేని రాత్రులు గడిపిందన్నారు.. ఏడేళ్ల క్రితం తనికెళ్ల భరణిగారు నాతో ఈ కన్నప్ప కాన్సెప్ట్ గురించి చెప్పినపుడే దానిస్థాయిఎలా ఉంటుందో ఊహించు కున్నానని అన్నారు.. ఆ తర్వాత ఈ కథలోకి ఎంతో మంది ప్రతిభావంతమైన నిపుణులుచేరారని పేర్కొన్నారు. ఈచిత్రంలో చాలా మందిసూపర్‌స్టార్స్ నటించబోతున్నట్టు ప్రకటించారు. ఆ వివరాలన్నీ త్వరలో రివీల్ చేయబోతున్నామని తెలిపారు.

# '800' మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్

ప్రముఖ శ్రీలంకన్ క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా తెరకెక్కిస్తున్న చిత్రం '800'. ట్రైన్ మోషన్ పిక్చర్స్ సంస్థ నిర్మించింది.. మురళీధరన్ పాత్రలో మధుర్ మిట్టల్, మదిమలర్ పాత్రలో మహిమా నంబియార్ నటించారు.. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వం వహించారు. బుకర్‌ప్రైజ్ పురస్కార గ్రహీత షెహన్ కరుణతిలకతో కలిసి ఆయన స్క్రిప్టు అందంచారు. శ్రీదేవి మూవీస్‌అధినేత శివలెంక కృష్ణ ప్రసాద్ సమర్పిస్తున్నారు.. అక్టోబర్6న తెలుగు, తమిళ, హిందీ



భాషల్లో సినిమా విడుదలకానుంది.. ఈ సందర్భంగా వివిఎస్ లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా సోమవారం హైదరాబాద్‌లో '800' మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. వివిఎస్ లక్ష్మణ్ మాట్లాడుతూ, మైదానంలో మురళీధరన్ సాధించినది మాత్రమే కాదు. అతని జీవితం అంతా ఇన్‌స్పిరేషన్ అన్నారు. బాల్యంనుంచి రిటైర్ అయ్యే వరకు ఇపుడు కూడ ఇన్‌స్పైర్ చేస్తూనే ఉన్నారన్నారు. అంతటి గొప్ప మనసున్న వ్యక్తి ఈతరంకు రోల్ మోడల్ అన్నారు. ముత్తయ్య మురళీధరన్ మాట్లాడుతూ, హైదరాబాద్ తనకు స్పెషల్ అని, నేను ఐపిఎల్ నుంచి రిటైర్ అయ్యాక సన్‌రైజర్స్ హైదరాబాద్ టీంకు పనిచేయమని అడిగారని అన్నారు.నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్, మధుర్ మిట్టల్ తదితరులు మాట్లాడారు.

# ముఖాన్ని ఎలా కడుగుతున్నారు?



వాతావరణ కాలుష్యం, పోషకాహార లోపం, జంక్‌ఫుడ్, దుమ్మూధూళి.. మొటిమలు రావడానికి కారణాలెన్నో! తగ్గవు, తగ్గినా మచ్చల భయం. పోగొట్టుకోవడానికి ఎన్నో ఉత్పత్తులనూ ఆశ్రయిస్తుంటాం. బదులుగా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలు. సమస్యను పరిష్కరించుకోవచ్చు అంటున్నారు నిపుణులు. అవేంటంటే..

- రోజూ ఉదయం, రాత్రి పడుకునే ముందు రెండుసార్లు సహజ క్లెన్సర్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. మీ స్కిన్‌కి సరిపడేవి ఎంచుకుంటే మంచిది రసాయనాల గాఢత ఎక్కువ ఉండే సబ్బులను వాడకపోవడమే మంచిది.
- మేకప్ తొలగించకుండా నిద్రపోవద్దు. వీటికి మార్కెట్‌లో దొరికే మేకప్ రిమూవర్లను వాడొచ్చు. లేదంటే కొబ్బరినూనెతో అయినా తొలగించొచ్చు.
- గోరువెచ్చని నీటినే ముఖాన్ని కడగడానికి ఉపయోగించాలి. తువ్వాలు మెత్తగా, శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే చర్మం మీద దద్దుర్లు వంటివి ఏర్పడతాయి.
- ముఖాన్ని శుభ్రపరిచిన తర్వాత మీ చర్మతత్వానికి సరిపడే మాయిశ్చరైజర్‌ని తప్పక రాయాలి. ఇది మీ చార్మన్ని తేమగా ఉంచేందుకు సాయపడుతుంది. ❑

# గృహాశోభకు సింపుల్ చిట్కాలు..

ఇల్లు అందంగా ఉంటే మనకు ఆహ్లాదంగా ఉంటుంది. మరి ఉన్న సరంజామాని పొందిగ్గా అమర్చుకునేందుకు ఇంటీరియర్ డిజైనర్లు సూచిస్తున్న సలహాలు పాటించి చూడండి.

- కుర్చీలు, సోఫాలు లాంటివి స్టోరేజ్‌కి పనికొచ్చే తరహావి కొనండి. అప్పుడు చిన్న చిన్న వస్తువులు అందులోకి వెళ్లిపోయి కొంత ఖాళీ స్థలం మిగులుతుంది.
- వంటింటి కబోర్డ్స్‌లో ఉప్పుపప్పుల డబ్బాలు కావచ్చు. హాలు, డ్రాయింగ్ రూముల అరల్లో అలంకరణ వస్తువులూ బొమ్మలు కావచ్చు. ఒక దానికొకటి మ్యాచ్ అయ్యేలా చూసుకోండి అప్పుడే చూడముచ్చటగా ఉంటాయి.
- డైనింగ్ టేబులు పక్కనున్న గోడ మీద చెట్టుచేమల్లాంటి ల్యాండ్‌స్కేప్ చిత్రించండి. అద్వితీయం ఉంటుంది. అయితే కర్టెను, టేబుల్ క్లాత్, కార్పెట్ మొదలైనవి ఆ చిత్రానికి అనుకూలమైన రంగులవ్వాలి.



- ఈ తరం పిల్లలకి ఎన్ని దుస్తులున్నా తృప్తి లేక ఇంకా ఇంకా కొంటూనే ఉంటారు. మరి అవన్నీ భద్రపరచడానికి బీరువాలు, వార్డ్‌రోబ్‌లూ సరిపోవు కదా!కబోర్డ్స్ పక్కన రాడ్స్ ఏర్పాటు చేసుకుంటే దాంతో చాలా దుస్తులు అక్కడ హ్యాంగర్లకి తగిలించవచ్చు.
- రాక్స్‌లో పై వరసన కొన్ని హుక్స్ పెట్టిస్తే.. హ్యాండ్‌బ్యాగ్, షాపింగ్‌బ్యాగ్, బెల్టులు లాంటివి తగిలించవచ్చు. అడ్డు అనిపించవు. ❑

# డిప్రెషన్‌ను తగ్గిస్తుంది..



కొన్ని పదార్థాల్లో ఆలివ్ నూనెనే ఉపయోగించమంటారు ఆహార నిపుణులు. ఆనీ ఇతర నూనెల కంటే ధర ఎక్కువ కనుక కొందరు సంకోచిస్తారు. ఇంతకీ ఈ నూనె ఎందుకు మంచిదో, దీని ప్రత్యేకత ఏమిటో చూద్దాం. విటమిన్లు, ఖనిజాలు ఉన్న పోషకాహారమిది ఇందులో గుండెకు మేలు చేసే కొవ్వు ఉంది. అత్యంత ఆరోగ్య కొవ్వుగా దీన్ని వర్ణిస్తారు. ఈ నూనె ఉపయోగించేవారిలో రక్తపోటు అదుపులో ఉంటుంది. రక్తపాళాలు పనితీరు మెరుగవుతుంది. సాధారణ నూనెకు బదులు ఆలివ్ నూనె ఉపయోగించే వారిలో గుండె జబ్బులు చాలా తక్కువని అధ్యయనాల్లో తేలింది. మధు మేహాన్ని నివారిస్తుంది. కీళ్లనొప్పులను తగ్గిస్తుంది. దీనికి చేపనూనె జతచేస్తే సత్వర ప్రయోజనం ఉంటుంది. చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది. మచ్చలను మొటిమలను పోగొడుతుంది. ముడతలు పడకుండా కాపాడుతుంది. కాళ్ల పగుళ్లు తగ్గుతాయి. ఇందులోని ఇ-విటమిన్ రక్తం గడ్డ కట్టకుండా కాపాడుతుంది. కళ్ల కింద వలయాలు ఏర్పడనివ్వదు. యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉన్నందున రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఊబకాయం రాదు. ఇది యాంగ్జయిటీ, డిప్రెషన్లను కూడా తగ్గిస్తుంది. ఆలివ్ నూనె అల్జీమర్స్, కాన్సర్లకు వ్యతిరేకంగా పోరాడుతుందని చెబుతున్న శాస్త్రవేత్తలు ఈ అంశమై మరిన్ని పరిశోధనలు చేస్తున్నారు. ❑

# ఏ తోడూ లేని మహిళలకు అండగా..



తల్లిదండ్రుల్లేని ఓ అమ్మాయి.. భవిష్యత్తు గురించి బంగారు కలలు కనకూడదా? భర్తలేడు.. పిల్లలు ఉన్నా ఆదరించరు. అప్పుడు ఆ స్త్రీ ఎవరిపై ఆధారపడాలి? పెళ్లికాని మహిళలు జీవితాంతం నిస్సహాయంగా ఉండిపోవాల్సిందేనా? ఇలా ఏ తోడూ లేని మహిళలకీ, వాళ్ల పిల్లలకీ అండగా ఉండేందుకు తమిళనాడు ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. ఆ వివరాలను ఫ్యూచర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకు రాలు, ఈ కమిటీలో కీలక సభ్యురాలు కల్యాణంతి సచ్చిదానందం గూర్చి తెలుసుకుందాం..



వితంతు, ఒంటరి నిస్సహాయ మహిళలు ఎవరో ఒకరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిందే. అదీ లేనివారికి ఎన్జీవోలు కాస్త అండగా ఉంటున్నాయి. అయితే ఆ సంస్థలకు సరైన నిధులు అందకపోతే వాళ్లూ ఏం చేయలేకపోతున్నారు. దీంతో తల్లి దండ్రులని కోల్పోయిన.. వింతతు మహిళల పిల్లలు నేరాలకు పాల్పడతున్నారు. పట్టించుకునే వారు లేక మత్తు పదార్థాలకు బానిసవుతున్నారు. ఇలాంటి వారందరికీ ఒక దారి చూపించేందుకే.. గతేడాది సెప్టెంబరులో తమిళనాడు ప్రభుత్వం విడో, డెస్టిట్యూట్ విమెన్ వెల్ఫేర్ బోర్డుని ఏర్పాటు చేసింది. ఇందులో వివిధ రంగాల్లో పని చేసే నిపుణులు, ఎన్జీవో సారథులు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సహా 24 మంది కీలకపాత్ర పోషించారు. వీరంతా నిస్సహాయ స్త్రీలకు తోడుగా ఉండటంపై వివిధ ప్రణాళికలు తయారు చేశారు. ఈ తరహా బోర్డు ఏర్పడటం దేశంలోనే తొలిసారి.

**ఏ కష్టమొచ్చినా....** వివిధ ప్రజా పథకాల అమలు గురించి ప్రజలతో చర్చిస్తున్నప్పుడు చాలామంది ఒంటరి మహిళలు తమ కష్టాల గురించి చెప్పుకొచ్చారు. అలా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, సామాజిక సంక్షేమ, మహిళా సాధికారతశాఖ మంత్రి, ఈ కమిటీ ఛైర్మన్ పి.గీతాజీవన్‌ల సారథ్యంలో ఈ బోర్డు ఏర్పాటైంది. రాజ్యసభ ఎంపి కనిమొళి సోము, చెంగల్పట్టు ఎమ్మెల్యే వరలక్ష్మి, మహిళలు, పిల్లల నేర విభాగంలో పనిచేస్తున్న ఐపిఎస్ అధికారిణి కల్పనా నాయక్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండి ఇన్నోసెంట్ దివ్యతో పాటు సేవామార్గంలో నడుస్తున్న మహిళలు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

**ఫిర్యాదు అందగానే ......** ..వితంతు, నిస్సహాయ మహిళ నుంచి సాయం కావాలని ఫిర్యాదు అందగానే ఆమె అవసరాలకు అనుగుణంగా వివిధ శాఖల్ని అప్రమత్తం చేసేలా ఏర్పాటు చేస్తున్నాం. ముందు ఆమెకు ఆశ్రయం కల్పించడం, కౌన్సెలింగ్ నిర్వహించడం, అవసరమైతే చదువుకొనేలా చేయడం, అర్హతను బట్టి ఉద్యోగం చూపించడం, ఉపాధి అందుకోవడానికి కావాల్సిన శిక్షణ ఇవ్వడం, ఆమెకున్న అర్హతను బట్టి వివిధ పథకాల నుంచి సాయం అందేలా బోర్డు బాధ్యతలు తీసుకుంటుంది. వారి ఆరోగ్యం, వ్యక్తిగత భద్రత కూడా బోర్డు బాధ్యతే. నీడలేని వారికి వన్‌స్టాప్ విమెన్ కేంద్రాలు, హాస్టళ్లు, సేవా కేంద్రాల్లో చేర్పిస్తాం. ఒంటరి మహిళలు, వారి పిల్లలు చదువులు, ఇతరత్రా భరోసా ప్రభుత్వ ఖర్చుతోనే పూర్తవుతాయి. శాఖల సమన్వయంతో ఆ పిల్లల్ని రోల్‌మెడల్‌గా మార్చి వారు మరొకరికి సాయపడే స్థాయిలో ఉద్యోగం, ఉపాధి పొందేలా బోర్డు కార్యచరణ రూపొందిస్తోంది. ❑

## చెలి చిట్కా

కొంచెం నిమ్మరసాన్ని పాదాలకు రాసపి కాసేపయ్యాక స్నానం చేస్తే వాటికి పట్టిన మురికి దూరమవుతుంది. పాదాలు మృదువుగానూ మారతాయి.

# కిడ్నీ స్టోన్స్‌తో బాధపడుతున్నారా?



శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్, ఉప్పు, కాల్షియంను కిడ్నీలు వడబోసి బయటకు పంపిస్తాయి. కాల్షియం, మినరల్స్, యూరిక్‌ఆసిడ్ వంటి వాటి కలయిక వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడు తుంటాయి. కిడ్నీలో రాళ్లు చిన్నసైజులో ఉంటే అవి మూత్రం ద్వారా బయటపడిపోతాయి. అయితే పెద్ద సైజులో ఉండే రాళ్లు కిడ్నీలోనే ఉండి భరించలేని నొప్పిని కలగజేస్తాయి. అయితే జీవనశైలిలో మార్పులు చేసుకోడం ద్వారా కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా చూసుకోవచ్చు. 'కిడ్నీ స్టోన్స్' నుంచి బాధ తప్పించుకోవాలంటే....

**కిడ్నీ బీన్స్ :** వీటిని క్రమం తప్పకుండా తీసుకుంటే కిడ్నీలో రాళ్లు పొడి కావాల్సిందే కిడ్నీ బీన్స్‌ను నాన బెట్టి తరువాత ఉడికించుకుని ఇంగువ కలిపి తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ఉండే ఫైబర్ కిడ్నీ స్టోన్స్‌ను మూత్రం ద్వారా బయటకు విసర్జించేలా చేస్తుంది.

**ఆపిల్ సిడార్ వెనిగర్ :** ఇది కాల్షియం ఆక్సలేట్, ఇతర మినరల్స్ వల్ల ఏర్పడిన రాళ్లను ముక్కలు చేస్తుంది. భోజనానికి మందు ఒక టేబుల్‌స్పూన్ ఆపిల్ సిడార్ వెనిగర్ తీసుకుంటే కిడ్నీలో ఏర్పడిన రాళ్ల ముక్కలు మారి మూత్రం ద్వారా బయటకు పోతాయి.

**తులసి ఆకులు :** ఎండిన తులసి ఆకులను నీళ్లలో వేసి మరిగించి, ఆ నీటిని తాగినా ఫలితం ఉంటుంది. రోజూ మూడుసార్లు ఈ నీరు తాగితే రాళ్లు ఇట్టే కరిగిపోతాయి.

**దానిమ్మరసం :** రోజూ దానిమ్మ, నిమ్మరసం తాగినా ఫలితం ఉంటుంది. ❑

# విరామం తీసుకోవాల్సిందే..

ఇంటిపనీ, ఆఫీసుపనీ ఎంత సమర్థంగా నిర్వర్తిస్తున్నా.. అప్పుడప్పుడు అలసట, అసహనం తప్పకపోవచ్చు. ఇందుకు ఈ పొరపాట్లు కారణం కావొచ్చు.

- ఆఫీసు నుంచి ఇంటికొచ్చాక విశ్రాంతి పేరుతో సెల్‌ఫోన్లోనో, ఐపాడ్‌లోనో సినిమాలు చూసేందుకు ప్రాధాన్యం ఇస్తాం. ఆ ప్రభావం మన నిద్రపై పడుతుంది. మగత నిద్ర కాస్తా.. మర్నాడు బడలికను తెచ్చేస్తుంది. దాంతో ఆ ప్రభావం పనిపైనా పడుతుంది. అందుకే నిద్రపోయే ముందు కనీసం గంట ముందు.. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు దూరంగా ఉండటం అవాటు మార్చుకోవాలి.
- కార్యాలయంలో పనిచేసే బల్లపై, రకరకాల కాగితాలూ, పెన్నులూ, తినే పదార్థాలు, వంటివన్నీ పేర్చేస్తున్నారా? వన్నీ తెలియకుండానే మానసిక శక్తినిహరించేస్తాయంటున్నారు కొన్ని అధ్యయనాలు. కాస్త తీరిక చేసుకుని అన్నీ ఓ క్రమంలో పెట్టి చూడండి. చెత్తను తీసేయండి ఎంత ప్రశాంతంగా ఉంటుందో మీకే అర్థమవుతుంది.



- ఈరోజుల్లో కంప్యూటరుతోనే ఎక్కువ పనులు, మరి మీరు కూర్చున్న స్థలంలో వెలుతురు సరిగా ఉందో లేదో చూసుకున్నారా? తక్కువ వెలుగులో కూర్చుని పని చేయడం, జిగేల్‌మనేంత వెలుతురు ఉంచుకోవడం రెండూ పొరపాటే. వీటివల్ల నష్టాలు వెంటనే కనిపించకపోవచ్చు. కానీ కళ్ళు త్వరగాఅలసిపోతాయి. మీ సిస్టమ్ లైటింగ్ పరిశీలించుకోండి.
- ఆఫీసుకు వెళ్లింది మొదలు.. గంటల తరబడి కూర్చుని పనిచేస్తుంటాం. దానివల్ల బరువు పెరగడం ఒక్కటేకాదు. శక్తి కూడా తగ్గుతుంది. అందుకే అవకాశం వచ్చినప్పుడల్లా బరువు పెరగడం ఒక్కదే కాదు. శక్తి కూడా తగ్గుతుంది. అందుకే అవకాశం వచ్చినప్పుడల్లా విరామం తీసుకోండి. లేదంటే ఈ ప్రభావం మెదడుపై పడి క్రమంగా ఒత్తిడి మొదలవుతుంది. అలసలాట తప్పదు, ఐదు నిమిషాల విరామమైనా తీసుకుంటూ ఉంటే సాంత్వన దొరుకుతుంది. ❑

# మొటిమలను తగ్గించే చింతపండు..

వంటకాలకు పుల్లపుల్లటి రుచిని అందించే చింతపండు.. సౌందర్య పోషణలోనూ ఉపయోగ పడుతుందన్న విషయం చాలామందికి తెలిసుండదు. కానీ మొటిమలు, మచ్చలు.. వంటి చర్మ సమస్యల్ని తగ్గించడం దగ్గర్నుంచి ముఖ కాంతిని పెంచేదాకా.. అందాన్ని ఇనుమడింపజేసే శక్తి దీని సొంతం అంటున్నారు సౌందర్య నిపుణులు. ఈ క్రమంలో చింతపండుతో ఇంట్లోనే తయారుచేసుకొనే కొన్ని ఫేస్‌ప్యాక్స్ ఏంటో తెలుసుకుందాం.

**మొటిమలకు...** నిమ్మకాయంత పరిమాణంలో చింతపండును తీసుకొని దాన్ని పావుకప్పు



వేడినీటిలో వేసి కాసేపు నాననివ్వాలి. ఆపై దీన్నుంచి పిప్పిని వేరుచేయాలి. ఇందులోంచి టేబుల్ స్పూన్ గుజ్జును తీసుకోవాలి. దీనికి ఒక చెంచా ముల్తానీ మట్టి, కొద్దిగా రోజ్‌వాటర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపి ముఖానికి, మెడకు మాస్క్‌లా వేసుకోవాలి. పదిహేను నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒకేసారి ఎక్కువ మొత్తంలో చేసుకొని ఫ్రిజ్‌లో నిల్వ చేసుకోవచ్చు. ఈ ఫేస్‌ప్యాక్ తరచుగా వేసుకుంటూ ఉంటే మొటిమల సమస్య క్రమంగా తగ్గుముఖం పడుతుంది అంతేకాకుండా చర్మం కొత్త మెరుపును సంతరించుకుంటుంది.

**ప్రకాశవంతమైన చర్మం కోసం...** టేబుల్‌స్పూన్ చింతపండు గుజ్జును తీసుకొని దానికి అరచెంచా పసుపు కలపాలి. ఈ మిశ్రమాన్ని చర్మానికి రాసుకొని ఇరవై నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ మీ చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది.

**బ్లీచ్‌గానూ....** చింపతండు గుజ్జుకు అరటిపండు గుజ్జు, శెనగపిండిన జతచేసిపేస్ట్‌లా చేసుకోవాలి.దీనిని చర్మానికి పట్టించి ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. ఈ మిశ్రమం బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేసి చర్మాని శుభ్రం చేస్తుంది.

**స్క్రబ్‌గా...** చింతపండు గుజ్జును కొద్ది మొత్తంలో తీసుకొని దానికి టేబుల్‌స్పూన్ నిమ్మరసం, అరచెంచా బేకింగ్ సోడా, చెంచా పంచదార కలపాలి. ఈ మిశ్రమంతో శరీరాన్ని మృదువుగా మర్దన చేసుకొని పదిహేను నిమిషాల తర్వాత వేడినీటితో స్నానం చేయాలి. ఈ మిశ్రమం జిడ్డు చర్మం కలిగిన వారికి, మొటిమల సమస్యతో బాధపడే వారికి మంచి ఔషధంలా పనిచేస్తుంది.

**టోనర్‌గా...** రెండు చెంచాల చింతపండు రసాన్ని తీసుకొని.. దీనికి రెండు చెంచాల టీ డికాషన్‌ను కలపాలి. ముఖం కడుక్కున్న తర్వాత ఈ మిశ్రమంలో దూదిని ముంచి ముఖానికి రాసుకోవాలి. కాసేపటి తర్వాత చల్లటి నీటితో మరోసారి ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన అంశం ఏంటంటే చింపండును చర్మానికి నేరుగా రాసుకోకూడదు. దీనిని ఇతర పదార్థాలతో కలిపి మాత్రమే వాడాలి. అంతేకాదు. చింతపండును ఉపయోగించడం వల్ల కొంతమందిలో అలర్జీ వంటి దుష్ప్రభావాలు కూడా రావచ్చు. కాబట్టి ముందుగా ప్యాచ్ టెస్ట్ చేసిన తర్వాతే ఉపయోగించడం మంచిది. ❑

# వినాయకుడిని నిమజ్జనం ఎందుకు ?

ఆధ్యాత్మికం



భాద్రపదమాసంలో ఎటుచూసినా పచ్చదనమే కనిపిస్తుంది. ఆ ప్రకృతిలో తిరగడమే ఓ పండుగలా తోస్తుంది. సృష్టికి కారణమైన శక్తికి ప్రతిరూపంగా, ఆ వాతావరణం నిలుస్తుంది. ఆ శక్తిని తల్చుకుంటూ, తమ జీవితాలు ఎలాంటి ఆటంకాలూ లేకుండా ముందుకు సాగిపోవాలనుకుంటూ.. విఘ్నాధిపతి అయిన వినాయకుడిని కొలుచుకుంటాము. అదే వినాయక చవితి. వినాయక చవితి సంప్రదాయం యావత్తూ, ప్రకృతికి అనుగుణాగానే సాగుతుంది. నదులోను, వాగులలోనుదొరికే ఒండ్రుమట్టితో ఆ స్వామి ప్రతిమను రూపొందిస్తాము. ఏకవింశతిపత్రపూజ పేరుతో 21రకాల ఆకులతో ఆయనను కొలుస్తాము. ఇలా కొలుచుకున్న స్వామిని, ఆయనను పూజించిన పత్రితో సహా నిమజ్జనం చేస్తాము. సృష్టి, స్థితి, ఆయనే మూడు దశలూ ఈ పూజలో కనిపిస్తాయి. ఈ మూడింటికి విరుద్ధంగా పూజ సాగిందంటే.. అందులో ఏదో కృత్రిమత్వం మొదలైందనే అర్థం. వినాయకుడి పూజ కోసం మట్టి విగ్రహం, పత్రాలు ఉపయోగించడం వెనక మరో కారణం కూడా కనిపిస్తుంది. ఒండ్రు మట్టిలోనూ, పత్రాలలోనూ ఔషధ గుణాలు ఉంటాయి. గణపతికి చేసే షోడశోపచార పూజలో భాగంగా మాటిమాటికీ ఈ విగ్రహాన్ని, పత్రాలనూ తాకడం వల్లా.. వాటిలోని ఔషధ తత్వం మనకి చేరుతుంది పూజ ముగిసిన తర్వాత ఓ తొమ్మిది రోజుల పాటు ఆ విగ్రహాన్నీ, పత్రాలనూ ఇంట్లో ఉంచడం వల్ల.. చుట్టూ ఉన్న గాలిలోకి ఆ ఔషధ గుణాలు చేరతామయి. ఇలా తొమ్మిది రోజులపాటు విగ్రహాన్నీ, పత్రాలనీ ఇంట్లో ఉంచుకున్న తర్వాత దగ్గరలో ఉన్న జలాశయంలో నిమజ్జనం చేస్తాము. ఈ క్రతువులో ఎక్కడా ఎలాంటి శేషమూ మిగలదు. అంతేకాదు ! వినాయక చవితి నాటికి వర్షాలు ఊపదుకుంటాయి. వాగులూ, నదులూ ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటాయి. అలాంటి సమయంలో తీరం వెంబడి మట్టి విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల వరద పోటు తగ్గే అవకాశం ఉంటుంది. పైగా ఈ కాలంలో ప్రవహించే నీటిలో క్రిమికీటకాలు ఎక్కువగా ఉంటాయని అంటారు. నిమజ్జనంలో విడిచే పత్రితో నీరు కూడా క్రిమి రహితంగా మారిపోతుందన్నది పెద్దల మాట. అందుకేనేమో! నిమజ్జనం చేసే ఆచారం ఉన్న దసరా, బతుకమ్మ పండుగలు కూడా వర్షరుతువులోనే వస్తాయి. ఇదండీ నిమజ్జనం వెనుక ఉన్న విశేషం. అయితే ప్రకృతి పరమైన విశేషాలతో పాటు ఇందులో సామాజికాంశాలూ లేకపోలేదు. వాడవాడలా వినాయక చవితి విగ్రహాలు వెలసిన తర్వాత, ఇరుగూపొరుగూ కలిసి కోలాహలంగా ఈ వేడుకని జరుపుకోవడమూ చూడవచ్చు. మొహమాటాన్ని వీడి నలుగురితో ఆడుతూ పాడుతూ బంధాలని పెంచుకోవడమూ జరుగుతుంది. అయితే ఆ వేడుకలోని హోరు శృతి మించడం, ప్రతిష్ట కోసం భారీ రంగు విగ్రహాలని నీటిలో కలపడం.. నిమజ్జనం వెనుక ఉన్న ఉద్దేశాలని దెబ్బతీస్తున్నాయి. ప్రకృతిని కొలవడం, భక్తితో పూజించడం అన్న లక్ష్యాలని పక్కన పెట్టి ప్రకృతి వినాశనానికీ, ఆడంబరానికీ పెద్ద పీట వేస్తున్నాయి. ❑

# పిల్లల్లో జ్ఞాపకశక్తికి..

కొంతమంది పిల్లల్ని ఏం అడిగినా.. తెలియదు, మర్చిపోయా వంటి సమాధానాలు వస్తుంటాయి. మరి ఇలాంటి పిల్లలు చురుగ్గా ఉండి.. చకచకా సమాధానాలు చెప్పాలంటే ఏం చేయాలి?

- ఒమేగా-3, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లతో నిండిన ఆహారాన్ని ఇవ్వాలి. అలాగే పండ్లూ, కూరగాయాలూ, తృణ ధాన్యాలూ, గింజలూ, చేపలను భోజనంలో చేర్చండి. సమతుల్య ఆహారం మెదడును ఆరోగ్యంగా ఉంచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.
- పిల్లలకు తగినంత నిద్ర అందుతోందో లేదో చూసుకోండి. ఎందుకంటే జ్ఞాపకశక్తికీ, నిద్రకీ దగ్గర సంబంధం ఉంది. అలాగే పిల్లలు ఆటలాడు కొనేలా, వ్యాయామం చేసేలా వారిని ప్రోత్సహించండి. ఈ విధమైన శారీరక శ్రమ మెదడులో రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. పిల్లలు చురుగ్గా ఉండేలా చూస్తుంది.
- పజిల్స్, చెస్ వంటి జ్ఞాపకశక్తిని మెరుగుపరిచే ఆటల్లో చిన్నారుల్ని నిమగ్నం చేయండి. పుస్తకాలు చదివించి.. అందులో ప్రశ్నలు అడగండి. లేకపోతే వాళ్ల అర్థం చేసుకున్న దాన్ని ఒక కథలా చెప్పమనండి. ఆత్మ విశ్వాసం కూడా పెరుగుతుంది.
- కొన్ని విషయాలు ఎంత చెప్పినా అర్థం కావు. అలాంటప్పుడు బొమ్మలు వేసి చెప్పండి. యానిమేషన్ కథలుంటే చూపించండి. ఎందుకంటే కొందరు పిల్లలు చిత్రాల రూపంలో చూసిన విషయాన్ని ఎప్పటికీ మర్చిపోరు. అలాగే వాళ్లకి ఏమైనా ఒత్తిడి ఉందేమో తెలుసుకోండి. ఆ వయసులో ఒత్తిడేంటి అనుకోవద్దు. ఆ చిట్టిబుర్రకీ ఎన్నో సమస్యలుండొచ్చు. మాట్లాడి అదేం పెద్ద సమస్యకాదు. నాన్నా అని సరిద్దచెప్పండి. వాళ్ల ఆసక్తి చూపిస్తే ధాన్యం నేర్పించండి. ❑





# ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించిన టీమిండియా మహిళల జట్టు

**హాంగ్జౌ, సెప్టెంబరు 25:** ఆసియా క్రీడల్లో భారత క్రికెట్టు జట్టు సత్తా చాటింది. టి20 పోటీల్లో స్వర్ణపతకాన్ని సాధించింది. ఫైనల్స్‌లో శ్రీలంకను ఓడించి గోల్డ్‌మెడల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్స్‌లో శ్రీలంకను భారత మహిళల జట్టు 19 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసింది. తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలం జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 97 పరుగులు మాత్రమే చేసింది. భారత జట్టులో స్మృతి మంధాన 46 పరుగులు, జెమీమి రోడ్రిగ్స్ 42 రన్స్ చేశారు. శ్రీలంక జట్టులో హాసిని పెరీరా 25 రన్స్, నీలాక్షి డిసిల్వా 23 పరుగులు చేశారు.



# టీమిండియాకు నీ దిష్టి తగలకూడదు!

## మైకేల్ వాన్‌పై వసీం జాఫర్ సెటైర్లు

**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ ఓపెనర్ వసీం జాఫర్, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ మధ్య సోషల్ మీడియా వేదికగా జరిగే మాటల యుద్ధం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. భారత్, ఇంగ్లండ్ జట్ల ప్రదర్శనలపై కామెంట్స్ చేస్తూ ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు ఒకరిపై ఒకరు జోకులు వేసుకుంటారు. ఇక టిమిండియా అంటే మైకేల్ వాన్ విద్వేషంతో రగిలిపోతాడు. ఎప్పుడూ భారత జట్టుకు వ్యతిరేకంగా పోస్ట్‌లు పెడుతుంటాడు. వాటికి వసీం జాఫర్ దిమ్మతిరిగే కౌంటరిస్తాడు. ఈ ఇద్దరి సోషల్ మీడియా వార్‌ను ఫ్యాన్స్ తెగ ఎంజాయ్ చేస్తారు. అయితే కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న ఈ ఇద్దరూ భారత్, ఆస్ట్రేలియా సిరీస్ సందర్భంగా మరోసారి వార్తల్లో నిలిచారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య రెండో వన్డే సందర్భంగా మైకేల్ వాన్ ఆసక్తికర పోస్టు పెట్టాడు. ఎప్పుడూ భారత్‌కు వ్యతిరేకంగా పోస్టు పెట్టే వాన్ ఈ సారి మాత్రం అందుకు భిన్నంగా ట్వీట్ చేశాడు. స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా వంటి టాప్ క్లాస్ ప్లేయర్లు లేకపోయినా కెఎల్ రాహుల్ సారథ్యంలోని భారత జట్టు ఆసీస్‌పై మెరుగైన ప్రదర్శన చేస్తుందంటూ వాన్ కొనియాడాడు. శుభ్‌మన్‌గిల్, శ్రేయస్ అయ్యర్ సెంచరీలతో కదం తొక్కడంతో భారత్ భారీ స్కోరు చేయడం ఖాయమే అని అంటూ టీమిండియా 400 స్కోరు దిశగా అడుగులేస్తోందని కితాబిచ్చాడు. అంతటితో ఆగకుండా వన్డే ప్రపంచకప్ జట్టులో భారత్‌ను ఓడించే జట్టే విజేతగా నిలుస్తుందని జోస్యంచెప్పాడు. ఇక మైకేల్ వాన్ వరుస ట్వీట్లకు వసీం జాఫర్ తనదైన శైలిలో కౌంటరిచ్చాడు. అద్భుతంగా ఆడుతున్న టీమిండియాకు ఎవరి దిష్టి తగలొద్దు అనే అర్థం వచ్చేలా మిరప కాయలు, నిమ్మకాయ,బొగ్గుముక్క వేలాడదీసిన ఫొటోను వాన్‌షేర్ చేశాడు. ఈ పొటోకు భారత్, ఆస్ట్రేలియాఅనే హ్యాష్‌ట్యాగ్ జతచేశాడు. వసీంజాఫర్ ఇచ్చినకౌంటర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## వరల్డ్‌కప్‌కు ముందు టీమిండియాకు

# మరో శుభసూచకం

## ఈ సారి ట్రోఫీ పక్కాగా మనదే!

**ముంబయి:** ప్రపంచకప్‌కు ముందు టీమిండియాకు వరుస శుభసూచనాలు ఎదురవుతున్నాయి. 2011 వరల్డ్‌కప్ లాగా ఈ సారి కూడా మెగా టోర్నీ భారత్‌లోనే జరుగుతుండటం మొదటి శుభసూచకమైతే రెండోది టీమిండియా ఆటగాళ్ల అరివీర భయంకరమైన ఫామ్. ఈ రెంటితో పాటు భారత్‌కు తాజాగా మరో శుభసూచకం కూడా ఎదురైంది. అదేంటంటే ఈసారి భారత్ ప్రపంచ నంబర్ వన్‌జట్టుగా బరిలోకి దిగనుండటం ప్రపంచ నంబర్ వన్ జట్టైనంత మాత్రాన భారత్ వరల్డ్‌కప్ ఎలా గెలుస్తుందని చాలామందికి సందేహం కలగవచ్చు. అయితే ఐసిసి తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్‌వన్ వన్డే జట్టుగా అవతరించిన విషయం తెలిసిందే. వన్డేలతో పాటు భారత్ మూడు ఫార్మాట్లలోనూ టాప్ జట్టుగా కొనసాగుతుంది. ఆసీస్‌పై తొలి వన్డేలో విజయంతో భారత్ ఈ అరుదైన ఘనతను సాధించింది. వరల్డ్ నంబర్‌వన్ జట్టు హోదాలోనే భారత్ మూడు ఫార్మాట్లలోనూ టాప్‌జట్టుగా కొనసాగుతుంది. ఆసీస్‌పై తొలి వన్డేలో విజయంతో భారత్ ఈ అరుదైన ఘతనలను సాధించింది. వరల్డ్ నంబర్ వన్‌జట్టు హోదాలోనే భారత్ ప్రపంచకప్ బరిలోకి కూడా దిగనుంది. చరిత్రను ఓసారి పరిశీలిస్తే గత రెండు వన్డే వరల్డ్‌కప్‌ల్లో నంబర్‌వన్ జట్లుగా బరిలోకి దిగిన జట్లే జగజ్జేతలుగా ఆవిర్భవించాయి. 2015 వరల్డ్‌కప్‌లో నంబర్‌వన్ టీమ్‌గా బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ఐదోసారి వరల్డ్ చాంపియన్‌గా అవతరించగా 2019 వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్ కూడా నంబర్ వన్ వన్డే జట్టుగా బరిలోకి దిగి తమ తొలి వన్డే వరల్డ్‌కప్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది. అంతకుముందు 2003,2007 ఎడిషన్లలో కూడా ఆస్ట్రేలియా నంబర్‌వన్ వన్డే జట్టుగా వరల్డ్‌కప్ బరిలోకి దిగి టైటిల్ చేజిక్కించుకుంది. ఈ లెక్కన ఈసారి నంబర్‌వన్డే జట్టుగా రంగంలోకి దిగుతున్న భారత్, వన్డే ప్రపంచకప్‌కు ముచ్చటగా మూడోసారి ముద్దాడటం ఖాయమని అభిమానులు అనుకుంటున్నారు.






# విజయ్‌సేతుపతి కుటుంబాన్ని బెదరించారు

## ముత్తయ్య మురళీధరన్ వ్యాఖ్యలు

**చెన్నై:** దిగ్గజ క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని తెరకెక్కుతోన్న చిత్రం 800. ఎంఎస్.శ్రీపతి దర్శకుడు. అక్టోబర్ 6వ తేదీన ఇది విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మురళీధరన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. సినిమా విశేషాలను పంచుకున్నారు. అనంతరం ఆయన ఈ ప్రాజెక్టు నుంచి విజయ్‌సేతపతి వైదొలగడానికి గల కారణాన్ని వెల్లడించారు. 800 చిత్రాన్ని తెరకెక్కించాలని మేము ఎప్పుడో అనుకుఅనుకున్నాం. ఐపిఎల్ ఆడుతోన్న రోజుల్లో ఓ సారి మేము ఉన్న హోటల్‌లోనే విజయ్‌సేతుపతి సైతం బసచేశారు. షూట్ నిమిత్తం ఆయన ఆ హోటల్‌లో ఉండాల్సి వచ్చింది. దీంతో మా దర్శకుడు విజయ్‌సేతుపతితో నాకు మీటింగ్ ఏర్పాటు చేశాడు. దాదాపు అయిదు రోజుల తర్వాత రెండు గంటలపాటు ఆయన మాకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. నా ఆట తీరంటే తనకెంతో ఇష్టమని ఆయన నాతో చెప్పారు. ఈ క్రమంలోనే ముము 800 కథ గురించి ఆయనతో డిస్కస్ చేశాం. కథ విన్నాక ఆయన ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి కథలో నటించే అవకాశాన్ని తాను వదుకోనని తప్పకుండా భాగం అవుతానని చెప్పారు. మా మధ్య డీల్‌కూడా కుదిరింది. ఈ క్రమంలోనే తమిళనాడుకు చెందిన పలువురు వ్యక్తుల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడం, కుటుంబ సభ్యులు సైతం బెదిరింపులు ఎదుర్కోవడంతో ఆయన ఈ ప్రాజెక్టు నుంచి పక్కకు జరిగారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో 800 వికెట్లు తీసిన ఏకైక బౌలర్. శ్రీలంక ఆఫ్ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవిత కథతో తెరకెక్కిన చిత్రం 800. టైటిల్ పాత్రను మధుర్ మిత్తల్ పోషించారు. ఈ సినిమాలో ప్రధాన పాత్రధారుడిగా మొదట విజయ్ సేతుపతిని ఎంచుకున్నారు. దీనిపై పలువురు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయ్‌సేతుపతికి వ్యతిరేకంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. దీంతో ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు.



# కపిల్ దేవ్ కిడ్నాప్ .. వీడియో వైరల్

**న్యూఢిల్లీ:** భారత దిగ్గజ క్రికెటర్, వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ కపిల్ దేవ్ కిడ్నాప్‌కు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వైరల్‌గా మారింది. ఈ వీడియోను చూసిన అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. కపిల్‌దేవ్ నిజంగా కిడ్నాప్ అయ్యారా? అని ప్రశ్నిస్తున్నారు. భారత్ మాజీ క్రికెటర్, బిజెపి ఎంపి గౌతమ్ గంభీర్ సైతం ఇదే ప్రశ్న వేసాడు. కపిల్ దేవ్ కిడ్నాప్‌కు సంబంధించిన వీడియోను ట్వీట్‌చేసిన గంభీర్ ఎవరికైనా ఈ వీడియో క్లిప్ వచ్చిందా? ఇందులో ఉన్నది కపిల్ దేవ్ కానుకుంటున్నా. ఆయన సురక్షితంగా ఉన్నారని భావిస్తున్నా అని క్యాప్షన్‌గా రాసుకొచ్చాడు. ఈ వీడియోలో ఇద్దరు వ్యక్తులు కపిల్‌దేవ్‌ను చేతులు వెనక్కు కట్టి, నోటికి బట్ట కట్టి లాక్కెళ్తున్నారు. వెనక్కు చూసిన కపిల్‌దేవ్ ఏవో సైగలు చేస్తూ కనిపించాడు. అయితే ఈ వీడియో ఓ అడ్వర్టైజ్‌మెంట్ కోసం చిత్రీకరించారని కొందరు అంటుంటే ఇది మార్ఫింగ్ వీడియో అని మరికొందరు కామెంట్ చేస్తున్నారు. కపిల్‌దేవ్ సురక్షితంగా ఉన్నారని, ఇది జనాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని ఇంకొందరు తీసిపారేస్తున్నారు. కపిల్‌దేవ్ కిడ్నాప్ అయితే పరిస్థితి గందరగోళంగా ఉంటుందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు.ఇది అడ్వర్టైజ్‌మెంట్ స్టంట్ అని, జనాలను పిచ్చోళ్లను చేసేందుకు కంపెనీలు ఎంతకైనా దిగజారుతాయి అనేందుకు ఈ వీడియో నిదర్శనమని అభిమానులు మండిపడుతున్నారు. ఈ తరహా వీడియోలు గతంలోనూ వైరల్ అయ్యాయని ఆ తర్వాత ఇవన్నీ వ్యాపార ప్రకటనలుగా తేలాయని నెటిజన్లు గుర్తు చేస్తున్నారు. ఈ వీడియోపై కపిల్‌దేవ్ స్పందిస్తేనే క్లారిటీ రానుంది. ఇక కపిల్‌దేవ్ చివరిసారిగా ప్రధాని నరేంద్రమోడీతో ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో కనిపించారు.

## హైడ్రామా తర్వాత పాకిస్థాన్ క్రికెట్ టీమ్‌కు వీసాలు మంజూరు చేసిన ఇండియా

**న్యూఢిల్లీ:** వారం రోజుల నుంచి కొనసాగిన హైడ్రామా తర్వాత పాకిస్తాన్ క్రికెట్ జట్టుకు, టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఇండియా వీసాలను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో 27వ తేదీ రాత్రి దుబాయ్ మీదుగా పాక్ జట్టు ఇండియాకు బయల్దేరనుంది. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు చేరుకోనుంది. భారత్ వీసాలను మంజూరు చేయకపోవడంతో ఐసిసికి పాక్ క్రికెట్ బోర్డు ఈ రోజు లేఖ రాసింది. ప్రపంచకప్ సమయంలో పాకిస్థాన్‌పట్ల ఇండియా వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని లేఖలో పిసిబి పేర్కొంది. 29వ తేదీన హైదరాబాద్‌లో ప్రాక్టీస్ మ్యాచ్ ఉన్న సమయంలో కూడా ఇంతవరకు వీసాలు మంజూరు చేయలేదని అసహనం వ్యక్తం చేసింది. ఈ పరిణామాల అనంతరం పాక్‌జట్టుకు ఇండియా వీసాలను మంజూరు చేసింది.

# వాణిజ్యం

# నిలకడగా పసిడి ధరలు



**ముంబై, సెప్టెంబరు 25:** రెండు రోజులుగా పసిడి ధరలు స్థిరంగా ఉండడంతో మధ్య తరగతి ప్రజలు షాపింగ్ చేసేందుకు మొగ్గుచూపతున్నారు. ఈక్రమంలో 22 క్యారెట్ల 10 గ్రాముల రిటైల్ ధరలను దేశ వ్యాప్తంగా పరిశీలిస్తే, చెన్నైలో రూ.55,200, ముంబైలో రూ.54,950, ఢిల్లీలో రూ.55,100, కోల్‌కతాలో రూ.54,950, హైదరాబాద్‌లో రూ.54,950, కేరళలో రూ.54,950, పుణెలో రూ.54,950, వడోదరలో రూ.55వేలు, జైపూర్‌లో రూ.55,100, మధురైలో రూ.55,200, నాసిక్‌లో రూ.54,980 వద్ద విక్రయాలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధరలు పరిశీలిస్తే, చెన్నైలో రూ.60,220, ముంబైలో రూ.59,950, ఢిల్లీలో రూ.60,100, కోల్‌కతాలో రూ.59,950, బెంగళూరులో రూ.59,950, కేరళలో రూ.59,950, వడోదరలో రూ.60వేలు, జైపూర్‌లో రూ.60,100, లక్నోలో రూ.60,100, మధురైలో రూ.60,220, నాగపూర్‌లో రూ.59,950, నాసిక్‌లో రూ.59,980 వద్ద స్థిరంగా విక్రయాలు కొనసాగుతున్నాయి. విజయవాడ, గుంటూరు, కాకినాడ, తిరుపతి, నెల్లూరు, కడప, అనంతపురం, విశాఖపట్నం, హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్‌లలో 22 క్యారెట్ల బంగారం ధర 54,950 రూపాయలుగా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ.59,950లుగా కొనసాగుతోంది. ఇక వెండి రిటైల్ ధరలను పరిశీలిస్తే, కేజీ వెండి ధర రూ.79 వేలుగా విక్రయించబడుతోంది.

# నిధుల సమీకరణకు బ్యాంకుల ప్లాన్ !

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** పలు అవసరాల కోసం ఆయా లిస్టెడ్ కంపెనీలు, బ్యాంకులు డెట్ రూట్‌లో నిధులు సేకరిస్తుంటాయి. ఇందులో భాగంగా రెండు రోజుల్లోనే ఏకంగా 18వేల కోట్ల సేకరణకు పూనుకున్నాయి. లిస్టెడ్ కార్పొరేట్‌లు, బ్యాంకులు సెప్టెంబరు 25-26 మధ్య డెట్ మార్గంలో 18,101 కోట్ల వరకు సమీకరించబోతున్నారని తెలిసింది. సోమవారం ఒక్కరోజు దాదాపు 4,671 కోట్లు సమీకరణకు రేడీ అయ్యారు. నెలారంభం నుంచి సెప్టెంబరు 22 వరకు బ్యాంకులు సహా పలు కార్పొరేట్ సంస్థలు 31వేల కోట్లకు పైగా నిధులు సమీకరించాయి. నెలాఖరు నాటికి ఈ మొత్తం 50వేల కోట్లకు చేరుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ అదే జరిగితే, ఈ ఆర్థికస సంవత్సరం ప్రారంభం నుంచి డెట్ మార్గంలో 50వేల కోట్లకుపైగా నిధులు సమీకరించడం ఇది మూడోసారి అవుతుంది. ఏప్రిల్‌లో 52వేల కోట్లకుపైగా జూన్‌లో అత్యధికంగా ఒక లక్ష కోట్లకుపైగా ఇప్పటికే ఆయా సంస్థలు సమకూర్చుకున్నాయి. ఇప్పుడు తాజాగా దాదాపు 5వేల కోట్ల సమీకరణ జరుగుతోంది. సెప్టెంబరు 25న 10యేళ్ల కాలానికి శాశ్వత బాండ్ల ద్వారా 2 వేల కోట్లు సమీకరించడానికి ఆర్ఇసి సిద్ధంగా ఉంది. దాదాపు ఏడేళ్ల పరిమితితో శ్రీ సిమెంట్ 700 కోట్లు, 10 యేళ్ల సబార్డినేటెడ్ బాండ్లతో హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో 320 కోట్లు, 21 నెలలతో హెచ్‌డిబి ఫైనాన్షియల్ 300 కోట్లు సమీకరించాలని యోచిస్తున్నాయి. ఇవికాక మూడున్నరేళ్ల వ్యవధితో గోద్రెజ్ ఇండస్ట్రీస్ 500 కోట్లు, 5యేళ్లతో ఎన్ఎన్‌పి కన్‌స్ట్రక్షన్స్ 551 కోట్లను సమీకరించనున్నాయి. ఇక ప్రభుత్వ యాజమాన్యంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు శాశ్వత బాండ్ల ద్వారా 3వేల కోట్లు, కెనడా బ్యాంకు 10యేళ్ల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్ల ద్వారా 5వేల కోట్లు, ఐదేళ్ల సామాజిక ప్రభావ బాండ్ల ద్వారా నాబార్డ్ 3వేల కోట్లను నేడు సమీకరించనున్నట్లు తెలిసింది. దేశీయ అతిపెద్ద రుణదాత ఎస్‌బిఐ తన నాలుగవ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్ల జారీ ద్వారా 7.49శాతం కూపన్ రేటుతో 10 వేల కోట్ల రూపాయలను ఇప్పటికే సమీకరించింది.




# స్వల్ప లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు




**ముంబై, సెప్టెంబరు 25:** దేశీయస్టాక్ మార్కెట్లు సోమవారం ఫ్లాట్‌గా ముగిసాయి. ఉదయం ఊగిసలాట మధ్య ట్రేడింగ్ ప్రారంభించిన మార్కెట్లు, రోజంతా ఒడుదుడుకుల మధ్య కొనసాగాయి. చివరికి సెన్సెక్స్ 14.54 పాయింట్లు లాభపడి 66,023.69 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ 0.30 పాయింట్ల అతి స్వల్ప లాభంతో 19,674.55 పాయింట్ల వద్ద నిలిచింది. మార్కెట్లు ముగిసే సమయానికి డాలరుతో మారకంలోరూపాయి విలువ రూ.83.14 వద్ద నిలిచింది. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఏసియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్స్, ఐసిఐసిఐ బ్యాంకు, ఎన్‌టిపిసి, ఎల్‌అండ్‌టి, టెక్ మహీంద్రా వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. శ్యామ్ మెటాలిక్స్ షేరు విలువ 2.82 శాతం పెరిగి రూ.447 వద్ద నిలిచింది. ఈ కంపెనీ లిథియం ఐయాన్ బ్యాటరీకి కావాల్సిన అల్యూమినియం ఫాయిల్స్‌ను తయారుచేయనున్నట్లు ప్రకటించింది. జెఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా ఐపిఒలో తొలిరోజు 28శాతం షేర్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి. రిటైల్ విభాగంలో పూర్తి షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

జెఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్ మారుతి సుజుకి వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, విప్రో, టిసిఎస్, సన్‌ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంకు, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, ఎస్‌బిఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్,


# డెల్టా కార్ప్ షేరు పతనం

**ముంబై, సెప్టెంబరు 25:** ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలపై ఇటీవల భారత ప్రభుత్వం జిఎస్‌టి పెంచింది. ఇది కాకుండా నిబంధనలు పాటించడంలో గతంలో అలసత్వం వహించారంటూ జిఎస్‌టి విభాగం షాకిచ్చింది. గేమింగ్, క్యాసినో వ్యాపారాలు నిర్వహిస్తున్న ప్రముఖ కంపెనీకి ఈ వ్యవహారంపై నోటీసులు అందాయి. దీంతో దాని షేర్లలో భారీ పతనం నమోదైంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ నుంచి మొత్తం 16,822 కోట్లకుగాను పన్ను నోటీసుఏలు అందినట్లు డెల్టా కార్ప్ తెలిపింది. జులై 2017-మార్చి 2022 మధ్య కాలానికి ఈ నోటీసులు వచ్చినట్లు పేర్కొంది. ఇదే విషయాన్ని గత శుక్రవారం ఎక్స్ఛేంజీలకు కూడా తెలియచేసింది. దీంతో సోమవారం షేరు విలువ ఏకంగా 20శాతం క్రాష్ అయింది. డెల్టా కార్ప్ ఇలా క్రాష్ కావడం దాదాపు 3 నెలల వ్యవధిలో ఇది రెండోసారి. మొదటిసారిగా ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలపై జిఎస్‌టి కౌన్సిల్ 28శాతం టాక్స్ విధించిన సమయంలో ఈ యేడాది జులై 12న 23శాతం నష్టపోయింది. కాగా ప్రస్తుతం 20శాతం పడి పోవడంతో రెండో అతిపెద్ద క్రాష్‌గా నమోదైంది. షేరు వాల్యూ క్షీణతతో డెల్టాకార్ప్ మార్కెట్‌క్యాప్ 4,692 వేల కోట్ల నుంచి 3,850 కోట్లకు పడిపోయింది. ఈ రెండు భారీ క్రాష్‌ల వల్ల ఈ యేడాదిలో 30.91శాతం క్షీణించింది. అయితే మొత్తం టాక్స్ డిమాండ్ విలువలో డెల్టా కార్ప్‌పై 11,140 కోట్లు, దాని అనుబంధ సంస్థలు క్యాసినో డెల్టిన్‌డెన్ జాంగ్, హైస్ట్రీట్ క్రూయిసెస్, డెల్టా ప్లెజర్ క్రూయిసెస్‌పై దాదాపు 5,682 కోట్లకు జిఎస్‌టి విభాగం నోటీసులు ఇచ్చింది. పన్ను డిమాండ్లు కేవలం డెల్టా కార్ప్ ఒక్క సమస్యే కాదు, పరిశ్రమ వ్యాప్తంగా ఉన్నాయి. ప్రస్తుతం మాకు అందిన ఈ నోటీసులు ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా ఉన్నట్లు మా న్యాయనిపుణులు భావిస్తున్నారు. వీటిని సవాలు చేయడానికి అందుబాటులో ఉన్న చట్టపరమైన అన్ని పరిష్కారాలను అనుసరిస్తాము' అని కంపెనీ వెల్లడించింది.



# హోల్‌మార్క్ ఆప్టో లిస్టింగ్ భేష్

**ముంబై, సెప్టెంబరు 25:** హోల్‌మార్క్ ఆప్టో మెకాట్రానిక్స్ కంపెనీ ఐపిఒ సోమవారం మార్కెట్లో ఎంట్రీ ఇచ్చింది. తొలిరోజే ఇన్వెస్టర్లను ధనవంతులను చేసింది. ఏకంగా 65శాతం ప్రీమియంతో రూ.65.25 రేటుకు జాబితా చేయబడింది. అసలు కంపెనీ ఒక్కో షేరును రూ.40 కి విక్రయించగా, ప్రారంభంలోనే రూ.25.25 లాభాన్ని సంపాదించి పెట్టింది. ఐపిఒ లిస్టింగ్ తర్వాత హోల్‌మార్క్ ఆప్టో మెకాట్రానిక్స్ షేర్లు 5శాతం అప్పర్ సర్క్యూట్‌కుచేరాయి. దీంతో కంపెనీ షేర్లు రూ.68.50 రేటుకి చేరాయి. కంపెనీ ఐపిఒ 15 సెప్టెంబరు 2023న సబ్‌స్క్రిప్షన్ కోసం తెరవబడి సెప్టెంబరు 20న ముగిసింది. కంపెనీ ఐపిఒ దరఖాస్తుదారులకు షేర్ల కేటాయింపును 25 సెప్టెంబరు 2023న ఖరారు చేసింది. కంపెనీ ఐపిఒ ఇష్యూ సమయంలో ఇన్వెస్టర్ల నుంచి బలమైన స్పందనను పొందింది. ఈ క్రమంలో 85.81 రెట్లు సబ్‌స్క్రైబ్ చేయబడింది. కంపెనీ ఐపిఒ రిటైల్ కేటా 75.78 రెట్లు, ఇతర కేటగిరీల్లో 93.27 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయింది. కంపెనీ ఐపిఒలో రిటైల్ పెట్టుబడిదారులు ఒక లాట్‌కు 3వేల షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుందని కంపెనీ నిర్ణయించింది. అంటే ఇన్వెస్టర్లు ఐపిఒలో పాల్గొనాలంటే 1.20 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఐపిఒకు ముందు కంపెనీలో ప్రమోటర్ల వాటా 87.30 శాతం ఉండగా, ప్రస్తుతం అది 62.54 శాతానికి తగ్గింది.




# రూ.2వేల నోట్ల మార్పిడికి 5రోజులే గడువు!

**ముంబై, సెప్టెంబరు 25:** రెండు వేల రూపాయల నోట్ల మార్పినడికి గడువు దగ్గరపడుతోంది. బ్యాంకుల్లో మార్చుకోవడానికి ఆర్‌బిఐ ఇచ్చిన గడువు సెప్టెంబరు 30తో ముగియనుంది. అంటే ఇంకా అయిదు రోజులే మిగిలుంది. ఒక వేళ ఇప్పటికీ రూ.2వేల నోట్లు మార్చుకోకుంటే వెంటనే ఆ పని పూర్తి చేయండి. ఆర్‌బిఐ క్లీన్ నోట్ పాలసీలో భాగంగా రూ.2వేల నోట్లను ఉపసంహరించుకున్న విషయం విదితమే. నోట్ల మార్పుడికి మే 23 నుంచి బ్యాంకుల్లో మార్చుకు నేందుకు అనుమతిచ్చింది. ఏదైనా బ్యాంకు శాఖలో ఒక రోజులో గరిష్టంగా రూ.20వేల విలువైన రూ.2వేల నోట్లను మార్చుకోవచ్చు. అదే సాధారణ సేవింగ్స్ అకౌంట్లు, జన్‌ధన్



ఖాతాల్లో డిపాజిట్లకు మాత్రం ఎలాంటి పరిమితీ లేదు. ఒకవేళ ఒకే రోజు రూ.50వేలకు పైబడి డిపాజిట్ చేయాల్సి వస్తే మాత్రం ఐటి నిబంధనల ప్రకారం పాన్ వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. నోట్ల మార్పిడికి స్లిప్ గానీ, ధ్రువీకరణ పత్రం గానీ అవసరం లేదని ఆర్‌బిఐ చెప్పినప్పటికీ, కొన్ని బ్యాంకులు మాత్రం ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొటున్నాయి. సెప్టెంబరు 26, 27 తేదీల్లో నోట్లు మార్చుకునేందుకు అవకాశం ఉంటుంది. 28న మిలాద్-ఉన్-నబి కారణంగా బ్యాంకులు పని చేయవు. మళ్లీ 29, 30 తేదీల్లో బ్యాంకులు పనిచేయనున్నాయి. ఆయా తేదీల్లో బ్యాంకు పనివేళల్లో పనినోట్లు మార్చుకోవచ్చు. సెప్టెంబరు 1 నాటికి 7శాతం నోట్లు వెనక్కి రావాలని ఆర్‌బిఐ గణాంకాలు చెబుతున్నాయి. గడచిన 25 రోజుల్లో ఎన్ని నోట్లు బ్యాంకులకు చేరాయి. ఇంకా మొత్తంగా ఎన్ని చేరుతాయి? అనేది తెలియరావాలి. అలాగే సెప్టెంబరు 30 తర్వాత రూ.2వేల నోటు గురించి ఆర్‌బిఐ ఏం నిర్ణయం తీసుకుంటోందనేది ఆసక్తికరం. అయితే నిర్దేశిత గడువు దాటిన తర్వాత కూడా రూ.2వేల నోటు లీగల్ టెండర్‌గా కొనసాగే అవకాశం ఉందని, లావాదేవీలకు అనుమతివ్వకుండా ఆర్‌బిఐ శాఖల వద్ద మాత్రమే మార్చుకునేందుకు అవకాశం ఇవ్వొచ్చని తెలుస్తోంది. అదే సమయంలో డెడ్‌లైన్‌లోపు ఎందురు మార్చుకోలేకపోయిందీ వివరాలను సమర్పించాల్సి ఉంటుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.